


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 177

శనివారం 16-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు వారి దశను మార్చేందుకు

ప్రపంచపు అతి భారీ మోటార్లుతో, దానిని మించిన వజ్రసంకల్పంతో సాధ్యపడిన

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్



భారతదేశంలో త్రాగునీరు, సాగునీరు కోసం దశాబ్దాలుగా పరితపిస్తున్న ప్రాంతాల్లో మరో మార్గంలేక ప్రజలు నిరంతరం ఇతర ప్రాంతాలకు వలసపోయేవారు. **తెలంగాణ ఆవిర్భావంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయినవి.**

గౌరవనీయ తెలంగాణ ముఖ్యమంత్రి, **శ్రీ కె. చంద్రశేఖర్ రావు** గారి అపూర్వ నాయకత్వాన భీమ, కల్వకుర్తి, కోయిల్సాగర్ లాంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించబడినవి. క్రమేణా ప్రజల వలసలు ఆగినవి.


ఈ సమయంలో తెలంగాణ యవనికపై ఒక అద్భుత ఘట్టానికి తెరతీయబడింది. తరతరాలుగా నిరాదరణకు గురై, తడారిన గొంతులతో, నెర్రెలిచ్చిన భూములతో కళావిహీనంగా మారిన ప్రాంతాల్లో **శ్రీశైలం నుండి కృష్ణా జలాలను ఎత్తిపోసి,** జలసిరి అందించేందుకు, తెలంగాణ ప్రజల భవిష్యత్తును సమూలంగా మార్చేసేందుకు 50,000 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్ఠాత్మకమైన **పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్** ఆవిష్కరించబడింది.

మొదటి దశ

70 మండలాల్లోని 1226 గ్రామాలకు తాగునీటి సౌకర్యం

రెండవ దశ

6 జిల్లాల్లోని 19 నియోజకవర్గాలలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు



ప్రాజెక్ట్ విశిష్టతలు

- 5 లిఫ్ట్ దశలు
- 6 రిజర్వాయర్లు
- 672 మీటర్ల ఎత్తుగల లిఫ్ట్
- 61.57 కి.మీ. పొడవు సొరంగం
- 915.47 కి.మీ. ప్రాథమిక కాలువ
- ఒక్కొక్కటి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 31 బాహుబలి పంపులు మరియు ఒక్కొక్కటి 75 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3 పంపులు

జల వనరులు

- రోజుకు 1.5 TMC నీరు లిఫ్ట్ చేయబడుతుంది
- 67.52 TMC నిలువ సామర్థ్యాన్ని కలిగివుంది
- పరిశ్రమల వినియోగానికి 0.33 టీఎంసీలు


లబ్ధిపొందే ప్రాంతాలు

- 1226 గ్రామాలు తాగునీరు పొందుతాయి
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు
- నాగర్ కర్నూలు, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట్, రంగారెడ్డి, వికారాబాద్ మరియు నల్గొండ జిల్లాలకు సాగునీరు అందుతుంది.
- తాగునీరు: జంట నగరాలకు కలిపి 7.15 టీఎంసీలు



ఈ సంబరానికి కేంద్ర బిందువు నీరే
ఈ మహోత్సవం జరిగేది నేడే

నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
తెలంగాణ ప్రభుత్వం.



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 177

శనివారం 16-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



క్రోచెట్ టోపీలతో పిల్లలు



పంచడానికి సిద్ధంగా ఉన్న పాంచోస్

250 మంది... ఒకే ఆలోచన...

250 మంది మహిళలు ఆరు నెలల్లో 2,719 క్రొచెట్ పాంచోలు తయారుచేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పారు. ఈ పాంచోలను గిరిజన పిల్లలకు ఉచితంగా పంచిపెడుతున్నారు. విశాఖపట్నం వేదికగా వీరందరూ ఒక తాటి మీదకు వచ్చి చేసిన ఈ ప్రయత్నం ఎంతో మందిని ఆకట్టుకుంటోంది. మహిళా మనోవికాసం పేరుతో క్రొచెట్ గ్రూప్‌ను ప్రారంభించిన మాధవి సూరిభట్ల, డెబ్బై ఏళ్ల వయసులోనూ చురుగ్గా పాల్గొన్న రాఘవమ్మ, టీమ్‌లీడర్‌గా ఫణి శిరీష, తనూజలు ఈ సందర్భంగా ఈ రికార్డు సాధనపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

– నిర్మలారెడ్డి

కొత్త ప్రపంచం



కుటుంబ జీవనంలోనే ఏళ్లు గడిచిపోయాయి. 70 ఏళ్ల వయసులో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఎంబ్రాయిడరీ, క్రొచెట్ అల్లిక చిన్నప్పటి నుంచీ అలవాటు. మహిళా గ్రూప్‌లో చేరి నాలుగేళ్లు అవుతోంది. వచ్చిన పనిని నలుగురితో షేర్ చేసుకోవడం, తెలియంది తెలుసుకోవడం చేస్తుంటాను. ఇంటి దగ్గర రోజూ కొంత సమయం ఎంబ్రాయిడరీకి కేటాయిస్తుంటాను. ఈ గ్రూప్ ద్వారా ఈవెంట్‌లో పాల్గొని చాలామంది మహిళలతో పరిచయాలు పెంచుకోగలిగాను. ఒక కొత్త ప్రపంచాన్ని చూస్తున్నట్టుగా, చాలా ఆనందంగా అనిపించింది.

– డి.వి.రాఘవమ్మ, విజయవాడ

గ్రూప్‌కి లీడర్‌ని



మా పిల్లలతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొంటుంటాను. మూడేళ్ల క్రితం మహిళా మనోవికాస్‌లో జాయిన్ అయ్యాను. 25 మంది ఉన్న గ్రూప్‌కి లీడర్‌గా ఉన్నాను. ఇలా మొత్తం తొమ్మిది టీమ్స్ ఉన్నాయి. ఒక్కో టీమ్‌లో 25 నుంచి 35 వరకు ఉంటారు. నెల రోజులు ఆన్‌లైన్‌లో క్రొచెట్ కోర్సు నేర్చుకున్నాను. కిందటేడాది గ్రూప్ అంతా దాదాపు 4,686 క్రొచెట్ టోపీలు అల్లి, ఈవెంట్ చేశాం. ఆ టోపీలను చలి ఎక్కువ ఉండే గిరిజన ప్రాంతాల పిల్లలకు అందజేశాం. ఈసారి పాంచోస్‌ను కూడా అదేవిధంగా పంపిణీ చేస్తున్నాం. రెండుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోవడం ఆనందంగా ఉంది.

– ఫణి శిరీష, హైదరాబాద్

ఆన్‌లైన్ క్లాసుల నుంచి మొదలు...



ప్రైవేట్ కంపెనీలో హెచ్ఆర్ ఉద్యోగం చేసే నేను పిల్లలు సెటిల్ అయ్యాక మానేశాను. ఇంటి వద్ద ఉంటూ నా హాబీస్ పైన దృష్టి పెట్టాను. అన్నిరకాల హ్యాండ్‌క్రాఫ్ట్స్ చేయగలను. అందులో భాగంగానే నా క్రాఫ్ట్ వర్క్ నలుగురికీ తెలియజేద్దామని ఎఫ్‌బిలో మధురం క్రాఫ్ట్స్ అండ్ క్రియేషన్స్ పేరుతో పోస్ట్ చేసే దాన్ని. కొంతమంది తమకు క్లాసులు చెప్పమన్నారు. దీంతో కోవిడ్ టైమ్‌లో గ్రూప్ స్టార్ట్ చేసి, ఆన్‌లైన్ క్లాసులు చెబుతూ వచ్చాను. విదేశాలలోనూ నా స్టూడెంట్స్ ఉన్నారు. చెన్నై గ్రూప్‌తో 3 సార్లు క్రొచెట్ గిన్నిస్ రికార్డ్‌లో పాల్గొన్నాను. నా వ్యక్తిగతంగానే ఏడుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించాను. వైజాగ్‌లోనూ ఈవెంట్ చేయాలనే ఆలోచనతో మహిళా మనోవికాస్ పేరుతో గ్రూప్ ప్రారంభించాను. ఆన్‌లైన్‌లో మహిళలకు క్రొచెట్ క్లాసులు తీసుకునేదాన్ని. ఒకరి ఆలోచనను ఇంకొకరు పంచుకుంటూ క్రొచెట్ అల్లికలు చేసి, వాటిని పేదవారికి పంచాలనేది ఆలోచన. దేశ విదేశాల నుంచి ఒకరి ద్వారా మరికొందరు పరిచయం అవుతూ ఆన్‌లైన్‌లో ఒక తాటిమీదకు వచ్చారు. కిందటేడాది క్రొచెట్ టోపీలు తయారుచేశాం. ఇప్పుడు పాంచోస్ తయారుచేశాం. పెళ్లి అయిన తర్వాత గృహిణులుగా ఉన్నవారు తమ జీవితంలో ఎలాంటి అచీవ్‌మెంట్ లేదు అనుకునేవారికి ఇదో మంచి బూస్టింగ్ అయ్యింది. మా గ్రూప్‌లో క్యాన్సర్ పేషెంట్స్ కూడా ఉన్నారు. కీమో తీసుకుంటూ కూడా ఈ అల్లికలు చేశారు. ఈవెంట్‌కు అటెండ్ అవ్వాలనుకునేవారు 150 మెంబర్స్ వచ్చారు. ఆరేళ్ల పాప నుంచి 80 ఏళ్ల వయసు వారు ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారు. అందరికీ ఇది ఒక స్ట్రెస్ బస్టర్ అని చెప్పవచ్చు.

– మాధవి సూరిభట్ల, విశాఖపట్నం

మా పిల్లలకూ నేర్పిస్తున్నాను..



డెలివరీ టైమ్‌లో ఖాళీగా ఉండటంతో ఆన్‌లైన్‌లో క్రొచెట్ బేసిక్స్ నేర్చుకున్నాను. ఆర్డర్స్ మీద అమీగ్రూమీ స్టఫ్ టాయ్స్ కూడా చేయడం నేర్చుకున్నాను. మా పిల్లలకు కూడా నేర్పిస్తున్నాను. ప్రతి ఒక్కరూ పది పాంచోస్ చేస్తే చాలు అనుకున్నాను. నేను 25 పాంచోస్ చేసిచ్చాను. ఇప్పుడు చాలా మంది అడుగుతున్నారు ఎలా అచీవ్‌మెంట్ వస్తుంది అని. కొంతమంది 'మాకు నేర్పిస్తారా, మేం ఎలా ఇందులో పాల్గొనాలి..' అని అడుగుతున్నారు. ట్రైబల్ పిల్లలకు వాటిని అందజేశారు.

– తనూజ, నంద్యాల

న్యూస్‌మేకర్

'పూజారి గారూ... అర్చన చెయ్యండి' అనే మాట ప్రతి గుడిలో వినపడేదే. కాని తమిళనాడులో ఒక మార్పు జరిగింది. పూజారులుగా స్త్రీలు నియమితులయ్యే ప్రయత్నం మొదలయ్యింది. 'పూజారమ్మా... అర్చన చెయ్యి' అనే ఇకపై మాట వినపడనుంది. రమ్య, కృష్ణవేణి, రంజిత అనే ముగ్గురు మహిళలు అర్చకత్వం కోర్సును ముగించి త్వరలో పూజారులుగా నియమితం కానున్నారు.

ఆమె ఇకపై గుడి పూజారి



రమ్య, కృష్ణవేణి, రంజిత

'మహిళలు పైలెట్లుగా, వ్యోమగాములుగా దిగంతాలను ఏలుతున్నప్పుడు దేవుని అర్చనను ఎందుకు చేయకూడదు' అనే ప్రశ్న తమిళనాడు ప్రభుత్వం లేవనెత్తింది. అంతేకాదు దానికి సమాధానం కూడా వెతికింది. జవాబును ప్రజల ముందుకు తెచ్చింది. గతంలో ఛాందస దృష్టితో బహిష్టు కారణాన స్త్రీలను 'అపవిత్రం' అని తలచి గర్భగుడి ప్రవేశానికి, అర్చనకు దూరంగా ఉంచేవారు. గ్రామదేవతల అర్చనలో స్త్రీలు చాలా కాలంగా ఉన్నా ఆగమశాస్త్రాలను అనుసరించే దేవాలయాలలో స్త్రీలు అర్చకత్వానికి నిషిద్ధం చేయబడ్డారు. ఇప్పుడు ఆ విధానంలో మార్పును తెచ్చింది తమిళనాడు ప్రభుత్వం. మహిళా అర్చకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వనుంది. అందులో భాగంగా ముగ్గురు మహిళలు ఒక సంవత్సరం కోర్సును ముగించి సహాయక అర్చకులుగా శిక్షణ పొందనున్నారు. ఒక సంవత్సరంపాటు ఆలయాల్లో శిక్షణ పొందాక ప్రధాన అర్చకులు కానున్నారు.

అందరూ యోగ్యులే

డి.ఎం.కె నేత కరుణానిధి 2007లో అర్చకత్వానికి అన్ని కులాల వాళ్లు యోగ్యులే అనే సమానత్వ దృష్టితో తమిళనాడులో ఆరు అర్చక ట్రైనింగ్ స్కూళ్లను తెరిచారు. అయితే ఆ కార్యక్రమం అంత సజావుగా సాగలేదు. ఇప్పుడు స్టాలిన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని కులాల వాళ్లు అర్చకత్వం కోర్సు చేసి పూజారులుగా నియమితులు కావచ్చన్న విధానాన్ని ప్రోత్సహించింది. దాంతో గత సంవత్సరం నుంచి చాలామంది ఈ కోర్సుల్లో చేరుతున్నారు. అయితే తిరుచిరాపల్లిలోని అర్చక ట్రైనింగ్ స్కూల్‌లో ముగ్గురు మహిళలు ఈ కోర్సులో చేరడంతో కొత్తశకం మొదలైనట్టయ్యింది. రమ్య, కృష్ణవేణి, రంజిత అనే ముగ్గురు మహిళలు ఒక సంవత్సరం కోర్సులోని థియరీని విజయవంతంగా పూర్తి చేసి ప్రభుత్వ హిందూ ధార్మిక మంత్రిత్వ శాఖ నుంచి తాజాగా సర్టిఫికెట్‌లు పొందారు. ప్రాక్టికల్స్‌లో భాగంగా ఒక సంవత్సరం పాటు వివిధ ఆలయాల్లో సహాయక అర్చకులుగా పని చేసి తదుపరి అర్చకులుగా నియమితులవుతారు. కోర్సు చదివిన కాలంలో వీరికి 3000 రూపాయల స్టయిపెండ్ లభించింది.

దేవుడు కూడా బిడ్డడే

'దేవుడు కూడా చంటిబిడ్డలాంటివాడే. గర్భగుడిలో దేవుణ్ణి అతి జాగ్రత్తగా ధూపదీపాలతో, నైవేద్యాలతో చూసుకోవాలి. స్త్రీలుగా మాకు అది చేతనవును' అంది రమ్య. కడలూరుకు చెందిన ఈ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగం మాని మరీ అర్చకత్వం కోర్సులో చేరింది. మరో మహిళ కృష్ణవేణి ఇంటర్ వరకూ చదివి ఈ కోర్సు చేసింది. మూడో మహిళ రంజిత బి.ఎస్సీ చదివింది. 'మా బ్యాచ్‌లో మొత్తం 22 మంది ఉంటే మేము ముగ్గురమే మహిళలం. కాని గత నెలలో మొదలైన కొత్తబ్యాచ్‌లో 17 మంది అమ్మాయిలు చేరారు. రాబోయే రోజుల్లో ఎంతమంది రానున్నారో ఊహించండి' అంది రమ్య.

తమిళనాడులో మొదలైన ఈ మార్పును మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తాయో లేదో ఇప్పటికైతే సమాచారం లేదు. కాని స్త్రీలు దైవాన్ని కొలిచేందుకు ముందుకు వస్తే ఇకపై వారిని ఆపడం అంత సులువు కాకపోవచ్చు.

ఇంటిప్స్



- కాయగూరలు తరిగే చెక్కని నిమ్మచెక్కతో రుద్ది కాసేపయ్యాక కడిగేయండి. మరకలు పోతాయి. ఎప్పుడైనా దానిపై మాంసం కోసినా.. నిమ్మచెక్కతో రుద్దాలి. క్రిములు వృద్ధి చెందకుండా ఉంటాయి
- నిమ్మచెక్కలని సన్నగా తరిగి కాసిని నీళ్లలో వేసి ఆ పాత్రని మైక్రో ఓవెన్‌లో కొన్ని నిమిషాలు ఉంచి తీసేయండి. అలా చేస్తే దుర్వాసనలు తొలగిపోవడంతో పాటూ లోపల పడి ఉన్న పదార్థాలని శుభ్రం చేయడం కూడా తేలికవుతుంది.
- ఫ్రిజ్‌లో ఓ మూలగా నిమ్మచెక్కని పెట్టి చూడండి. అందులోంచి వచ్చే దుర్వాసనలు పోతాయి.
- స్టీలు కుళాయిలపై నీటిమరకలు పడుతుంటాయి. అవి తెల్లగా మారాలంటే వాటిని నిమ్మచెక్కతో రుద్ది కడిగితే చాలు.

సందర్భం

పోరాడి గెలిచింది

ఆమె 'టైమ్' ఇప్పుడు బాగుంది



నందితా వెంకటేషన్ నృత్య, సంగీత ప్రేమికురాలు. పాదం కదలాలంటే పదం వినిపించాల్సిందే. నాట్యంలో మంచి పేరు తెచ్చుకుంటున్న రోజుల్లో క్షయ బారిన పడింది. మందులు వాడి వాడి శరీరం గుల్ల అయింది. బాగయ్యాక కొన్ని రోజులకు ఆమె వినికిడి శక్తిని కోల్పోయింది. అలా అని ఆమె నాట్యం ఆపలేదు. ఆ నాట్యమే తన బలం అయింది. తక్కువ ధరలకు క్షయవ్యాధిగ్రస్తులకు మందులు దొరికేలా దక్షిణ ఆఫ్రికాకు చెందిన పుమెజా టిసిలీతో కలిసి కృషి చేసి విజయం సాధించింది నందిత. టైమ్స్ మ్యాగజీన్ 2023 (100–ఎమర్జింగ్ లీడర్స్) జాబితాలో నందితా వెంకటేశన్‌కు చోటు లభించింది....

'క్షయ వ్యాధి నా పాత స్నేహితురాలు' అని సరదాగా చెబుతుంది ముంబైలో పుట్టి పెరిగిన నందితా వెంకటేశన్. డిగ్రీ కాలేజీలో చేరిన సంతోషంలో ఒకవైపు స్నేహితులంతా తలమునకలై ఉండగా, నందిత మాత్రం టీబీతో పోరాడుతోంది. పద్నాలుగు నెలల పాటు చికిత్స తీసుకోవాల్సి వచ్చింది.

కొంతకాలానికి...

పరిస్థితిలో మార్పు రాకపోగా మరింత జటిలం అయింది. భరించలేని కడుపు నొప్పి. బరువు తగ్గడం మొదలైంది.

వైద్యుల సూచన మేరకు సర్జరీ కోసం ఆస్పత్రిలో పదిరోజులు ఉంది. డిశ్చార్జి తరువాత పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. దీంతో పెద్ద మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్‌లో చేర్పించారు.

'చికిత్సలో భాగంగా రోజుకు పది నుంచి పదిహేను మాత్రల వరకు వేసుకోవాల్సి వచ్చేది. వాంతులు అయ్యేవి. డిప్రెషన్‌కు గురయ్యేదాన్ని. టీబీ కంటే నరకమే నయం అనిపించేది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది నందిత.

పీక్కుపోయిన ముఖంతో, రాలిపోయిన తల వెంట్రుకలతో తనను తాను అద్దంలో చూసుకోవాలన్నా భయపడేది నందిత. ఇలా భయపడుతూ, బాధపడుతూ ఉంటే వైద్యుల చికిత్స ఎలాంటి ఫలితం ఇవ్వదని తనకు తెలుసు. ముందు మనోధైర్యం తెచ్చుకోవాలి. మానసికంగా ఉల్లాసంగా ఉండాలి అనుకుంది. తనకు కావల్సిన శక్తులు సంగీతంలో దొరికాయి. రెండు నెలల తరువాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయింది. 22 కిలోల బరువు తగ్గింది.

మందులు వాడీ వాడీ శరీరం చచ్చుబడినట్లుగా అనిపించింది. అయితే ఇంటికి వచ్చిన సంతోషం ఆ బాధని దూరం చేసింది. అయితే ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. నెలరోజుల తరువాత వినికిడి శక్తి కోల్పోయింది. ఎంత పెద్ద శబ్దమైనా వినిపించేది కాదు.



నందితా వెంకటేషన్

వినికిడి శక్తి కోల్పోయినా తనకు ఇష్టమైన నృత్యంపై ప్రేమను మాత్రం కోల్పోలేదు నందిత. మ్యూజిక్ వినిపించక పోయినా డ్యాన్స్ చేసేది. ఇది తనకు బాధ నుంచి ఉపశమనంగా అనిపించేది. ఏడు సంవత్సరాల వయసులో భరతనాట్యంలో శిక్షణ మొదలుపెట్టిన నందిత...

'భరత నాట్యం అనేది నాకు కేవలం అభిరుచి కాదు. అంతకంటే ఎక్కువ. నన్ను నేను ప్రేమించుకోవడానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి. నన్ను నేను వ్యక్తీకరించుకునే బలమైన మాధ్యమం' అంటుంది.

చీకటిరోజులు వెళ్లి పోయాయి. నందిత మళ్లీ మామూలు మనిషి అయింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసిన నందిత జర్నలిస్ట్‌గా తనకు ఇష్టమైన అక్షర సేద్యం చేస్తోంది.

క్షయవ్యాధి చికిత్సలో భాగంగా తనలాగే వినికిడి శక్తి కోల్పోయిన దక్షిణ ఆఫ్రికాకు చెందిన పుమెజా టిసిలీతో కలిసి ఒక అమెరికన్ మల్టీ నేషనల్ ఫార్మాస్యూటికల్ కంపెనీకి సంబంధించిన క్షయవ్యాధి ఔషధానికి రెండోసారి పేటెంట్ ఇవ్వకూడదంటూ భారత ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసి విజయం సాధించింది. ఈ విజయం ద్వారా క్షయవ్యాధిగ్రస్తులకు తక్కువ ధరలకు మందులు దొరికే అవకాశం ఏర్పడింది. ఇద్దరూ టైమ్స్ జాబితాలో చోటు సాధించారు.

సోషల్ మీడియా సాక్షిగా... సాయంగా



మెర్లిన్‌తో మొహమ్మద్ ఆషిక్

కూటికోసం కోటివిద్యలు అంటారు. ఈ విద్యే... ఎవరూ చూసేవారు లేక అనాథలా మారి, పదిమంది దగ్గర యాచిస్తూ కడుపు నింపుకొంటోన్న మెర్లిన్‌కు భోజన, వసతి సదుపాయాలు కల్పించి ఆదుకుంటోంది. ఎంతోమందికి మెర్లిన్ నేర్పిన విద్యాబుద్ధులే 81 ఏళ్ల వయసులో నిస్సహాయస్థితిలో ఉన్న ఆమెని ఆదుకుంటూ... అండగా నిలబడ్డాయి.

బర్మాకు చెందిన మెర్లిన్ భారతీయ వ్యక్తిని పెళ్లి చేసుకుని చెన్నైలో స్థిరపడిపోయింది. ఇంగ్లీష్, లెక్కలు, తమిళం బోధిస్తూ, భర్తతో సంతోషంగా ఉండేది. సంవత్సరాలు గడిచే కొద్దీ తనవారిని ఒక్కొక్కరిగా పోగొట్టుకుంటూ ఒంటరిదైపోయింది. తినడానికి తిండిలేక, ఉండడానికి చోటులేక ఫుట్‌పాతే అన్నీ అయ్యి బతుకుతోంది. చెన్నై రోడ్లమీద తిరుగుతూ భిక్షమెత్తుకుని పొట్టనింపుకుంటోంది.

దుస్తులు కొనివ్వండి బాబూ...

ఒకరోజు 'ఎబ్రోకాలేజ్‌కిడ్' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సోషల్ సర్వీస్ చేస్తోన్న మొహమ్మద్ ఆషిక్ కంటపడింది మెర్లిన్. ఆమెను చూడగానే ఆమె మొదటినుంచి యాచకవృత్తిలో ఉన్న ఆమె కాదని గ్రహించాడు ఆషిక్. వెంటనే ''ఎక్కడినుంచి వచ్చావు అమ్మా? నీకు ఎవరూ లేరా? వయసులో ఉన్నప్పుడు ఏం చేసేదానివి...'' వంటి ప్రశ్నలు వేస్తూ మెర్లిన్ గురించిన వివరాలు తెలుసుకున్నాడు ఆషిక్. ''భిక్షం అడిగి కడుపు నింపుకుంటున్నాను. కొన్ని రోజులు ఆహారం దొరుకుతుంది. మరికొన్ని రోజులు ఏమీ దొరకదు... నీళ్లు తాగి పడుకుంటాను. దేవుడు ఎంతవరకు ఇస్తే అంతే బాబు'' అని మెర్లిన్ చెప్పింది. ''నీకు ఏం కావాలమ్మా?'' అని ఆషిక్ అడిగినప్పుడు...

''నా దుస్తులు చిరిగిపోయాయి. వీలయితే అవి కొనివ్వు బాబు... అది చాలు'' అంది.




యాచించ కూడదనీ...

మెర్లిన్ పరిస్థితి చూసి చలించిపోయిన ఆషిక్ మెర్లిన్‌కు చీర కొనిచ్చాడు. తరువాత...''అమ్మ నువ్వు ఇంగ్లీష్ క్లాసులు చెప్పు. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తాను. ఒక్కో వీడియోకు డబ్బులు ఇస్తాను అని చెప్పాడు''. మెర్లిన్ ఇంగ్లీష్ క్లాసులు చెప్పడానికి ఒప్పుకోవడంతో ఆమె చెప్పే పాఠాలు వీడియోలు తీసి 'ఇంగ్లీష్ విత్ మెర్లిన్' పేరుమీద ఇన్‌స్టా అకౌంట్ ఓపెన్ చేసి పోస్టు చేస్తున్నాడు. ఒక్కో వీడియోకు డబ్బులు ఇస్తూ మెర్లిన్ ఎవరి దగ్గరా చేయి చాచకుండా... తన కష్టార్జితంతో బతికేలా ఏర్పాట్లుచేశాడు ఆషిక్.

తన విద్యార్థులసాయంతో...

ఆషిక్ పోస్టు చేసిన మెర్లిన్ వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. వాటిని చూసిన వారిలో కొంతమంది మెర్లిన్ దగ్గర చదువుకున్న విద్యార్థులు ఉన్నారు. తమ టీచర్ పరిస్థితి ఇంత దారుణంగా ఉందా అని బాధపడుతూ మెర్లిన్‌ను వెతుక్కుంటూ వచ్చారు. దగ్గర కూర్చుని, ఫలానా వాళ్లమని పరిచయం చేసుకుని, అప్పుడు ఇలా చేశాం, అలా చేశాం, మీరు ఇలా ఉండేవారంటూ మాట్లాడి ఆమెలో ఉత్సాహం నింపారు. కొంతమంది ఆమెతో వీడియో కాల్ చేసి మాట్లాడారు. అంతా కలిసి మెర్లిన్‌కు కష్టం కలగకుండా ఉండేందుకు, నలుగురి మధ్యలో ఉండేలా వృద్ధాశ్రమంలో చేర్చారు. అక్కడ ఆమెకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మెర్లిన్ ఎనభై ఏళ్ల వయసులో ఇంగ్లీష్ క్లాసులు చెబుతూ ఐదు లక్షలకు పైగా ఫాలోవర్స్‌తో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

మనం చేసే మంచి ఎప్పటికైనా ఏదో ఒక రూపంలో తిరిగి వస్తుందనడానికి మెర్లిన్ జీవితమే ఉదాహరణగా నిలుస్తోంది.


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 177

శనివారం 16-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కక్ష్య దూరం మళ్లీ పెంపు

ఆదిత్య–ఎల్1 ఉపగ్రహానికి 4వ విడతలో కక్ష్య దూరాన్ని ఇస్రో పెంచింది -6లో



భారత్‌కు బంగ్లా షాక్

6 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా.. గిల్ శతకం వృథా - 13లో



175 మంది బలి

మణిపూర్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటిదాకా 175 మంది మరణించారని పోలీసు శాఖ వెల్లడించింది.

వివరాలు 6లో ▸



న్యాయం జరగాల్సిందే..

పోలీసు వాహనం ఢీకొని మృతిచెందిన జాహ్నవికి న్యాయం జరగాలని ఇండియన్–అమెరికన్ చట్ట సభ్యులు పట్టుబడుతున్నారు.

వివరాలు 6లో ▸



జై హింద్, పాపా...!

ఉగ్ర దాడిలో అమరుడైన కల్నల్ మన్‌ప్రీత్ సింగ్‌కు ఆరేళ్ల కుమారుడు తుది సెల్యూట్ చేయడం అందరినీ కంటతడి పెట్టించింది.

వివరాలు 6లో ▸



మరో అద్భుతం యశోభూమి

ఢిల్లీలో 8.8 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రపంచస్థాయి కన్వెన్షన్–ఎక్స్‌పో సెంటర్ యశోభూమి ప్రారంభానికి సిద్ధమైంది.

వివరాలు 6లో ▸

మన డాక్టర్లు.. దేశానికి రక్ష!

తొమ్మిది ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్



శుక్రవారం హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో కలసి నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్

రాష్ట్రంలో ఏటా 10 వేల మంది కొత్త డాక్టర్లు వస్తారు

- తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు ఇది
- ప్రతి జిల్లాకో మెడికల్ కాలేజీ అనే లక్ష్యానికి చేరువయ్యాం
- ఈ కాలేజీల ఆస్పత్రులతో పేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుతాయి
- వచ్చే ఏడాది మరో 8 కొత్త వైద్య కళాశాలలు ప్రారంభిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తున్నట్టు వెల్లడి
- జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏటా పది వేల మంది వైద్యులను తయారుచేసే స్థాయికి చేరుకుందని.. ఇది భారత దేశ వైద్య రంగ చరిత్రలోనే విప్లవాత్మకమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండటానికి, రోగ నిరోధక శక్తి ఉండటానికి తెల్లరక్త కణాలు ఏ విధంగా పనిచేస్తయో.. తెలంగాణ ఉత్పత్తి చేసే తెల్లకోటు డాక్టర్లు రాష్ట్రానికే కాకుండా దేశానికి రక్షగా నిలుస్తారని చెప్పారు. రాష్ట్ర వైద్య రంగం దేశానికే ఆదర్శంగా నిలిచేలా పురోగమించడం మనకు గర్వకారణమన్నారు. శుక్రవారం కరీంనగర్, కామారెడ్డి, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో కలిపి మొత్తం 9 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను సీఎం కేసీఆర్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఎం చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో మిగతా 3వ పేజీలో ▶

ఆ బిల్లులు ఆమోదించాలి

- చట్టసభల్లో ఓబీసీలు, మహిళలకు 33% కోటా బిల్లులు వచ్చే సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలి
- బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఏకగ్రీవ తీర్మానం
- పార్లమెంటు ప్రత్యేక భేటీలో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చ
- కవితకు ఈడీ నోటీసుల వెనుక రాజకీయం
- న్యాయ పోరాటం చేస్తూనే.. రాజకీయంగానూ ఎదుర్కొందామన్న కేసీఆర్

- వివరాలు 2లో▶

శుక్రవారం సభా ప్రాంగణంలో ఠాక్రే, కేసీ వేణుగోపాల్‌లతో కలసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో సంపత్, శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ, పొంగులేటి, వంశీచంద్‌రెడ్డి, భట్టి









ఐదు అంశాలే ఎజెండాగా!

హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలకు సర్వం సిద్ధం

- తాజ్ కృష్ణ హోటల్‌లో రెండు రోజుల పాటు కాంగ్రెస్ అగ్రనేతల భేటీ
- ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహం, భారత్ జోడో యాత్ర–2 నిర్వహణ, లోక్‌సభ ఎన్నికలు, ఇండియా కూటమి మధ్య సీట్ల పంపకాలు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో వైఖరిపై మేధోమథనం
- శుక్రవారమే వచ్చిన 52 మంది.. నేడు సోనియా, ఖర్గే, రాహుల్, మిగతా నేతల రాక
- 17న తుక్కుగూడ సభకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)' సమావేశాలకు సర్వం సిద్ధమైంది. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో శని, ఆదివారాల్లో జరగనున్న ఈ సమావేశాల్లో కాంగ్రెస్ అతిరథ మహారథులంతా పాల్గొననున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని.. శనివారం మధ్యాహ్నం సీడబ్ల్యూసీ సభ్యులకు టీపీసీసీ విందు అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు సీడబ్ల్యూసీ భేటీ మొదలవుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

ఐదు కీలక అంశాలు ఎజెండాగా..

సీడబ్ల్యూసీ భేటీ ముగిసే మరునాటి నుంచే పార్లమెంటు ప్రత్యేక భేటీ జరుగుతుండటం, ఆ సమావేశాల్లో కేంద్రం పలు కీలక బిల్లులను మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కవితకు సమన్లు 10 రోజులు వాయిదా వేస్తాం



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కల్వకుంట్ల కవితకు సమన్ల జారీని 10 రోజులు వాయిదా వేస్తామని ఈడీ సుప్రీంకోర్టుకు తెలిపింది. మనీలాండరింగ్ అంశంలో మహిళల్ని ఇంటి వద్దే విచారించాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను నళిని చిదంబరం కేసుతో జత చేసిన విషయం విదితమే.

- వివరాలు 5లో▶

తెలంగాణలో సభ పెట్టే నైతికత సోనియాకు లేదు



తెలంగాణలో సెప్టెంబర్ 17న సభ పెట్టే నైతికత కాంగ్రెస్ పార్టీకి, సోనియాగాంధీకి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు.

- వివరాలు 2లో▶

నేడు సోనియా సమక్షంలో కాంగ్రెస్ గూటికి తుమ్మల



మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. సీడబ్ల్యూసీ సమావేశాల విరామ సమయంలో ఆ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.

- వివరాలు 2లో▶

ముగిసిన టెట్



రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష అక్కడక్కడా అపశ్రుతులతో ముగిసింది. ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 2,69,557 మంది దరఖాస్తు చేసుకోగా 2,26,744 మంది (84.12%) పరీక్షకు హాజరయ్యారు.

- వివరాలు 5లో▶

సర్కారు బడుల్లో అల్పాహారం

- విజయదశమి కానుకగా అమలుకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- తమిళనాడు తరహాలో రాష్ట్రంలో కూడా...



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విజయదశమి కానుక ముందుగానే ప్రకటించింది. ఉదయం వేళ విద్యార్థులకు అల్పాహారం అందించనుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉదయంపూట విద్యార్థులు ఖాళీ కడుపుతో వస్తుండడంతో చదువుపై ధ్యాస తగ్గుతోందని విద్యాశాఖ వర్గాల పరిశీలనలో తేలింది. దీనిని అధిగమించడంతోపాటు పిల్లలను శారీరకంగా మరింత పటిష్టంగా తయారు చేసే దిశగా సీఎం కేసీఆర్ అల్పాహార పథకం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో అల్పాహారం పథకాన్ని అమలు చేస్తుండగా, అదే తరహాలో మన రాష్ట్రంలో కూడా మిగతా 3వ పేజీలో ▶

ముస్తాబవుతున్న సభా వేదిక



నేడే 'పాలమూరు' ఎత్తిపోత

- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- నార్లాపూర్ ఇంటెక్‌వెల్ నుంచి అక్కడి జలాశయంలోకి కృష్ణా జలాల ఎత్తిపోత
- జలాశయంలోకి చేరిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు చేయనున్న ముఖ్యమంత్రి
- కొల్లాపూర్‌లో బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం

- వివరాలు 7లో

ఇదండీ సంగతి



.. జస్ట్ పాలు అమ్మి.. రెండెకరాల నుండి లక్షల కోట్లు ఎలా సంపాదించారో ఆ కిటుకొకటి చెప్పి పుణ్యం కట్టుకోండి సార్!

బాబు బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ వేయండి

సీఐడీకి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశం

- విచారణ 19కి వాయిదా.. సీఐడీ వేసిన పోలీసు కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉంది
- ఇదే సమయంలో హైకోర్టులో క్వాష్ పిటిషన్ కూడా.. ఈ పరిస్థితుల్లో బెయిల్ పిటిషన్‌పై విచారణ సబబేనా?: ఏసీబీ ప్రత్యేక కోర్టు సందేహం
- మా కస్టడీ పిటిషన్‌లో ముందుకెళ్లకుండా హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చారు
- వాటిని అడ్డుపెట్టుకుని బెయిల్ పిటిషన్ వేసి మధ్యంతర బెయిల్ అడుగుతున్నారు
- కోర్టు దృష్టికి తీసుకొచ్చిన సీఐడీ స్పెషల్ పీపీ వివేకానంద

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు వేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.

ఆ పిటిషన్‌కు విచారణార్హతే లేదు : సీఐడీ పీపీ

చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం మిగతా 7వ పేజీలో ▶

క్లుప్తంగా...



లక్ష మెజార్టీతో కేసీఆర్‌ను గెలిపిస్తాం

గజ్వేల్ మున్సిపల్ పాలకవర్గం తీర్మానం

గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం నుంచి మూడోసారి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లక్ష పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, పాలకవర్గ సభ్యులు తీర్మానం చేశారు. శుక్రవారం మంత్రి హరీశ్‌రావు నివాసంలో కలిసి తీర్మానం కాపీని అందజేశారు. కేసీఆర్ కృషితోనే గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. అడిగిందే తడవుగా నిధులు ఇస్తూ అభివృద్ధికి బాసటగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి 'నల్లాల' దంపతులు

కారు దిగనున్న మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి, మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. కొంతకాలంగా 'నల్లాల'దంపతులు బీఆర్‌ఎస్ పార్టీలో అసంతృప్తిగా ఉంటున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పిస్తామనే హామీ మేరకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెపుతున్నారు. గత ఏడాది మే 19న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ చైర్‌పర్సన్, తన కుమారులతో కలసి బీఆర్‌ఎస్ ను వీడి, ఢిల్లీలో ప్రియాంకాగాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మళ్లీ అక్టోబర్ 5న తిరిగి 'కారు'పార్టీలోకే వెళ్లారు. తాజాగా మరోసారి గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధపడ్డారు. సెప్టెంబర్ 17న 'విజయ భేరీ' బహిరంగ సభ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. పార్టీ మార్పుపై ఓదెలు 'సాక్షి'తో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరుతున్నది నిజమేనని స్పష్టం చేశారు.

రేపు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ ముగింపు సభ

ముఖ్య అతిథులుగా డి.రాజా, సురవరం: కూనంనేని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభ జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11 నుండి ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ప్రతి జిల్లాలో పోరాట చిహ్నాలు, స్మారక స్తూపాల వద్ద బహిరంగ సభలు, నాటి సాయుధపోరాట ఇతివృత్తంతో ఆట, పాట, కళారూపాల ప్రదర్శనలు జరిగాయని పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, కార్య వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరవుతా రని కూనంనేని వెల్లడించారు.

రేపు అమిత్ షాతో పీవీ సింధు భేటీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ఆదివారం కలుసుకోనున్నారు. ఈ నెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో హైదరా బాద్ స్టేట్ విమోచన 75 వార్షికోత్సవాల్లో అమిత్ షా ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి ఆయన హైదరాబాద్‌కు చేరుకుని సీఆర్‌పీఎఫ్ ఆఫీసర్స్ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసుల వందనం, జాతీయ జెండా ఎగురవేత అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తారు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో అమిత్ షా ఢిల్లీకి తిరుగుప్రయాణం కావాల్సి ఉంది. అయితే పీవీ సింధును కలిసి గతంలో ఆమె సాధించిన విజయాలకుగాను అభినందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కొంత ఆలస్యంగా అంటే మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల మధ్య ఆయన తిరుగు ప్రయాణమయ్యే అవకాశాలున్నాయి. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు పార్టీ వర్గాల సమాచారం. కాగా, గతంలో రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా సినీహీరో జూనియర్ ఎన్టీఆర్‌ను, బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో అమిత్ షా మర్యాదపూర్వకంగా భేటీ అయిన విషయం తెలిసిందే.

ఆ బిల్లులు ఆమోదించాలి

చట్టసభల్లో ఓబీసీలు, మహిళలకు 33% కోటా బిల్లులు వచ్చే సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలి

- బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఏకగ్రీవ తీర్మానం
- పార్లమెంటు ప్రత్యేక భేటీలో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చ
- కేసీఆర్ అధ్యక్షతన సమావేశమైన ఎంపీలు



బీఆర్‌ఎస్‌పీపీ సంయుక్త సమావేశంలో ఎంపీలతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులు (ఓబీసీ), మహిళలకు పార్లమెంటుతో పాటు రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లులను ఆమోదించాలని కోరుతూ భారత్ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ (బీఆర్‌ఎస్‌పీపీ) సంయుక్త సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనే వీటిని ఆమోదించాలని డిమాండ్ చేసింది. పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బీఆర్‌ఎస్‌పీపీ సంయుక్త సమావేశం జరిగింది. పార్లమెంటు, శాసనసభల్లో ఓబీసీలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టే దిశగా బీఆర్‌ఎస్ ఎంపీలు అనుసరించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించింది. మహిళా సంక్షేమం, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ కట్టుబడి ఉందని కేసీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వారి హక్కులు కాపాడేందుకు దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ తన గళాన్ని వినిపిస్తూనే ఉంటుందన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో పార్టీ డిమాండ్లను ఎంపీలు లేవనెత్తాలని, అందుకు అవసరమైన సమాచారంతో సిద్ధం కావాలని సూచించారు.

దేశ సంపదలో ఓబీసీల కీలక భాగస్వామ్యం

తమ వృత్తుల ద్వారా దేశ సంపదను సృష్టించడంలో కీలక భాగస్వాములైన ఓబీసీలకు చట్టసభల్లో సముచిత ప్రాధాన్యత కల్పించేలా 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్‌ఎస్‌పీపీ ఏకగ్రీవంగా తీర్మానించింది. దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉంటున్న ఓబీసీ కులాలను సామాజిక, విద్య, ఆర్థిక రంగాల్లో ముందుకు నడిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైనే ఉందనే అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైంది. తెలంగాణ ప్రభుత్వం బీసీల అభివృద్ధి సంక్షేమం దిశగా అమలు చేస్తున్న పథకాలు, కార్యాచరణ మంచి ఫలితాలు ఇస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీలు అన్నారు. రాజకీయ అధికారంలో ఓబీసీల భాగస్వామ్యం మరింత పెంచడం ద్వారానే వారు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతారని బీఆర్‌ఎస్‌పీపీ పేర్కొంది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఓబీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత జరిగిన మొదటి అసెంబ్లీ సమావేశంలోనే (14 జూన్ 2014) ఓబీసీ రిజర్వేషన్ బిల్లుపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించిన విషయాన్ని గుర్తు చేసింది. తొమ్మిదేళ్లు కావస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తాత్సారం చేయడంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది.

17న కేంద్రం ఏమంటుందో చూద్దాం

ఐదు రోజుల పాటు జరిగే పార్లమెంటు సమావేశాల్లో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నియామకానికి సంబంధించిన బిల్లుతో పాటు ఇతర బిల్లులు చర్చకు వస్తాయని కేంద్రం రెండు రోజుల క్రితం విడుదల చేసిన ఎజెండాలో పేర్కొంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్‌పీపీ భేటీలో కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. 'ఈ నెల 17న కేంద్రం అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావించే అంశాల ఆధారంగా తదుపరి కార్యాచరణపై వ్యూహాన్ని రూపొందించుకుందాం. ఒకవేళ జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌర స్మృతి వంటి అంశాలు ప్రస్తావనకు వస్తే మన వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేద్దాం. ఈడీ నోటీసులు జారీ వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నందున ఓ వైపు న్యాయ పోరాటం చేస్తూనే, మరోవైపు రాజకీయంగా ఎదుర్కొనేందుకు కూడా వెనుకాడేది లేదు. మహిళలు, ఓబీసీల రిజర్వేషన్ బిల్లులపై ఒత్తిడి చేయడం ద్వారా బీజేపీ అసలు స్వరూపం పడుతుంది..' అని కేసీఆర్ అన్నట్టు సమాచారం. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు, పార్టీ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, ఇతర ఎంపీలు పాల్గొన్నారు.

మహిళలకు సమానావకాశాలతోనే అభివృద్ధి

మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభించినపుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని బీఆర్‌ఎస్‌పీపీ పేర్కొంది. మహిళా సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తీరుపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. వచ్చే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని కూడా బీఆర్‌ఎస్‌పీపీ ఆమోదించింది.

వారికి 33% రిజర్వేషన్ కల్పించండి

ప్రధాని మోదీకి కేసీఆర్ లేఖలు

చట్టసభల్లో మహిళలు, ఓబీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రధాని మోదీని సీఎం కేసీఆర్ కోరారు. ఈ మేరకు రెండు వేర్వేరు లేఖలు రాశారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు ప్రవేశ పెట్టాలని శుక్రవారం బీఆర్‌ఎస్‌పీపీ తీర్మానించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ లేఖలు రాశారు. 'శతాబ్దాలుగా మహిళలు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపేందుకు ముందుచూపుతో రాజ్యాంగంలో కొన్ని వెసులుబాట్లు కల్పించిన విషయం మీకు తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోంది. పార్లమెంటు, శాసనసభల్లోనూ మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు తెలంగాణ శాసనసభ 2014లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించింది. కానీ కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి చొరవను తీసుకోలేదు. ఈ నెల 18 నుంచి జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లోనైనా బిల్లు ఆమోదానికి అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతున్నాను..' అని ఒక లేఖలో కేసీఆర్ పేర్కొన్నారు. ఓబీసీలకు కోటాపై సీఎం మరో లేఖ రాశారు. 'విద్య, ఉద్యోగ రంగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్ ఫలాలు కొంతమేర దక్కినా చట్టసభల్లో వారికి సరైన ప్రాతినిధ్యం లేదు. ఇప్పటికైనా కేంద్రం 33 శాతం కోటా బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలి..' అని కోరారు.



పరకాలలో జరిగిన బహిరంగసభకు హాజరైన జనం, (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి

తెలంగాణలో సభపెట్టే నైతికత సోనియాకు లేదు

- సీఎం కేసీఆర్ మజ్లిస్ ఆత్మ.. సమైక్యదినం అంటూ వక్రీకరిస్తున్నారు
- బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి
- పరేడ్ గ్రౌండ్ నుంచి పరకాలకు బీజేపీ బైక్‌ర్యాలీ

సాక్షిప్రతినిధి, వరంగల్ / రసూల్‌పుర: కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు తెలంగాణ చరిత్ర, విమోచనదినం ప్రాధాన్యతను వక్రీకరిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సెప్టెంబర్ 17న తెలంగాణలో మీటింగ్ పెట్టే నైతికత కాంగ్రెస్ పార్టీకి, సోనియాకు లేవని, హైదరాబాద్‌లో మీటింగ్ పెట్టుకోవాలంటే భాగ్యలక్ష్మి ఆలయం వద్ద నెహ్రూ కుటుంబం రక్తం వచ్చేలా ముక్కు నేలకు రాయాలన్నారు. అధికారంలోకి రాకముందు విమోచన దినోత్సవాన్ని జరపాలన్న కేసీఆర్.. ఆ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. సెప్టెంబర్ 17ను 'విమోచన దినోత్సవం'గా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ నుంచి చేపట్టిన బైక్‌ర్యాలీ శుక్రవారం సాయంత్రం హనుమకొండ జిల్లా పరకాల అమరధామం వద్ద ముగిసింది. అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం పరకాల అంగడి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను దాచిపెట్టిన మొదటి ముద్దాయి కాంగ్రెస్ అని, తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ సమాధానం చెప్పాలని లేకుంటే సోనియాగాంధీ కుటుంబ అడుగుపెట్టే అర్హత లేదన్నారు. సీఎం కేసీఆర్‌ను మజ్లిస్ ఆత్మ ఆడిస్తుందని, ఆ పార్టీకి భయపడే నాడు కాంగ్రెస్, నేడు బీఆర్‌ఎస్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. నైజాం ఓడిపోయిన దినం ఎలా సమైక్యత దినం అవుతుందో ఆ రెండు పార్టీలు తెలంగాణ ప్రజలకు చెప్పాలని, తెలంగాణ విమోచన దినాన్ని సమైక్య దినంగా వక్రీకరిస్తున్న కేసీఆర్ పరకాలకు వస్తావా తేల్చుకుందాం? అని సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక వచ్చే సంవత్సరం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని, పరకాల అమరధామం వద్ద అత్యంత వైభవంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ కేసీఆర్ కూడా అప్పటి నిజాంలాగా అరెస్టులు చేస్తూ నిర్బంధాలు విధిస్తున్నారని, స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం బ్రిటిష్ పాలనలో, నిజాం పాలనలో ఉండేది కాదని, ఇప్పుడు ఇక్కడా అదే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రావు పద్మ, రావుల కిషన్‌లతోపాటు పలువురు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్ టు పరకాల

తెలంగాణ విమోచన ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి పరకాల అమరధామం వరకు బీజేపీ బైక్‌ర్యాలీని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాశ్ జవదేకర్ జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్వయంగా బైక్ నడిపి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు ఆయన పరేడ్ గ్రౌండ్‌లో విమోచన దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పరేడ్ మైదానం నుంచి సికింద్రాబాద్ క్లాక్ టవర్, ఓయూ. తార్నాక, ఉప్పల్, భువనగిరి, జనగాం, పరకాల వరకు 200 కిలోమీటర్లు ఏడు గంటల పాటు బైక్‌ర్యాలీ కొనసాగింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అడుగడుగునా పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు.



25 ఏళ్లయినా.. గడువు కోరుతూనే ఉంటారు

- ఇంకుడు గుంతల ఏర్పాటులో ప్రభుత్వతీరుపై హైకోర్టు అసహనం
- పిటిషన్ వేసి 18 ఏళ్లయినా నివేదికకు గడువు కోరడంపై ఆగ్రహం
- అమికస్ క్యూరీ సూచనలపై ఏ చర్యలు తీసుకున్నారో 3 వారాల్లో నివేదిక అందజేయాలి



సాక్షి, హైదరాబాద్: ఇంకుడు గుంతల ఏర్పాటుకు సంబంధించి పిటిషన్ దాఖలు చేసి 18 ఏళ్లయినా నివేదక అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడువు కోరడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 25 ఏళ్ల తర్వాత కూడా ఇంకా సమయం కావాలని కోరుతూనే ఉంటారని అసహనం వ్యక్తం చేసింది. మూడు వారాలు సమయం ఇస్తున్నామని, కొత్తగా నిర్మించే భవనాల్లో ఇంకుడుగుంతల ఏర్పాటుపై అమికస్ క్యూరీ చేసిన సూచనలపై ఏ చర్యలు తీసుకున్నారో నివేదిక అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ అక్టోబర్ 5వ తేదీకి వాయిదా వేసింది. హైదరాబాద్‌లో నీటికొరతపై సుభాష్‌చంద్రన్ 2005లో హైకోర్టుకు లేఖ రాశారు. దీనిని న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌లో అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి నివేదిక సమర్పించారు. ప్రస్తుతం నీటికొరత అంతగా లేకపోయినా, భవిష్యత్ అవసరాల నిమిత్తం సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉందని, భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఏర్పాటు తప్పనిసరి చేయాలన్నారు. వాల్టా చట్టం కింద బోర్ల తవ్వకంపై నియంత్రణ అవసరమని చెప్పారు. దీనిపై నివేదిక అందజేయడానికి గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనాన్ని విజ్ఞప్తి చేశారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేస్తూ.. ఏళ్ల గడిచినా ఇంకా గడువు కోరడం సాధారణంగా మారిందని ప్రభుత్వం తీరును తప్పుబట్టింది. 3 వారాలు గడువిస్తూ, విచారణ వాయిదా వేసింది.



తాజ్ కృష్ణా హోటల్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫ్లెక్సీల చించివేతపై కాంగ్రెస్ ఆందోళన

బంజారాహిల్స్: కాంగ్రెస్ ఫ్లెక్సీల చించివేత ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశం సందర్భంగా సోనియా, రాహుల్‌గాంధీని ఆహ్వానిస్తూ హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం చించివేశారు. దీంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. భట్టి విక్రమార్క, అంజన్ కుమార్‌యాదవ్, రోహిణ్‌రెడ్డి, విజయారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు కార్యకర్తలు పాల్గొని బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నేడు సోనియా సమక్షంలో కాంగ్రెస్ గూటికి తుమ్మల

నాగేశ్వర్‌రావు ఇంటికి వెళ్లి ఆహ్వానించిన ఠాక్రే, రేవంత్, భట్టి



మాణిక్‌రావ్ ఠాక్రే నేతృత్వంలో తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అసంతృప్తనేత, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శనివారం(నేడు) కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. సీడబ్ల్యూసీ సమావేశాల విరామ సమయంలో శనివారం ఆ పార్టీ అగ్ర నేతలు సోనియా, రాహుల్‌గాంధీల సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. పార్టీలోకి రావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఇప్ప టికే తుమ్మలను ఆహ్వానించిన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తుమ్మల నివాసానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతోపాటు రేవంత్, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెళ్లారు. పార్టీలోకి రావాలని మరోమారు ఆహ్వానించగా సానుకూలంగా స్పందించిన తుమ్మల శనివారం కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. కాగా, సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా రాష్ట్రంలోని పలువురు మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. వీరిని ఈ నెల 17న తుక్కుగూడ సభా వేదికగా పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించినప్పటికీ అనివార్య కారణాల వల్ల దానిని మార్చారని తెలిసింది. శని, ఆదివారాల్లో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల విరామ సమయంలోనే వీరిని సోనియా, రాహుల్, ఖర్గే సమక్షంలో పార్టీలో చేర్చుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ స్థానం నుంచి తుమ్మల పోటీ చేసే అవకాశముందని సమాచారం.

ఐదు అంశాలే ఎజెండాగా!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రవేశపెడుతుందన్న అంచనాల నేపథ్యంలో.. హైదరాబాద్ సీడబ్ల్యూసీ సమావేశాల్లో ఏం చర్చిస్తారు? ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపై దేశ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శని, ఆదివారాల్లో జరిగే ఈ సమావేశాల్లో ఐదు కీలక అంశాలపై కాంగ్రెస్ పార్టీ చర్చించనుంది. 'త్వరలోనే జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, భారత్ జోడో యాత్ర–2 నిర్వహణ, 2024 లోక్‌సభ ఎన్నికలు, ఆ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీల మధ్య సీట్ల పంపకాలు, ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వైఖరి'పై కాంగ్రెస్ కీలక నేతలు చర్చించి పలు నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇదే సమయంలో దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అదానీ వ్యవహారం, ఎన్డీయేకు వ్యతిరేకంగా ఇండియా కూటమి నేతృత్వంలో చేపట్టాల్సిన పోరాట కార్యాచరణ, ఇండియా కూటమిలో లేని ప్రాంతీయ పార్టీలను ఆయా రాష్ట్రాల్లో ఎదుర్కోవాల్సిన తీరు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

శుక్రవారమే చేరుకున్న 52 మంది

సీడబ్ల్యూసీలోని సాధారణ సభ్యులతోపాటు శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు కలిపి మొత్తం 84 మంది సమావేశాలకు హాజరుకానున్నారు. శుక్రవారమే 52 మంది హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరిలో హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్‌సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ఏకే ఆంటోనీ, రమేశ్ చెన్నితాల, కొడుక్కునిల్ సురేశ్, శశిథరూర్, రణదీప్‌సింగ్ సూర్జేవాలా, రాజీవ్‌శుక్లా, పవన్‌ఖేరా, యశోమతి ఠాకూర్, దీపేందర్ సింగ్ హుడా, ఫూలోదేవి, లాల్జీదేశాయ్, తారిఖ్ అన్వర్, మీరా కుమార్, నెట్టా డిసౌజా, అల్కా లాంబా, బీకే హరిప్రసాద్, మాణిక్యం ఠాగూర్, ఇబోబిసింగ్, ప్రతిభా సింగ్, మనీశ్ తివారీ, గౌరవ్ గొగోయ్, భక్తచరణ్‌దాస్, సుప్రియా షినాటె, దిగ్విజయ్‌సింగ్, కుమారి షెల్జా తదితరులు ఉన్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు సోనియా, రాహుల్, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీఎంలు అశోక్ గెహ్లోట్, సిద్ధరామయ్య, భూపేశ్ భగేల్, మరికొందరు నేతలు శనివారం రానున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్

బహిరంగ సభ.. నియోజకవర్గ పర్యటనలు

సీడబ్ల్యూసీ సమావేశాలు ముగిశాక 17న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో కాంగ్రెస్ 'విజయభేరి' బహిరంగ సభ జరగనుంది. సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేలతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు ఈ సభలో పాల్గొననున్నారు. ఆ సభా వేదికపై నుంచి కాంగ్రెస్ ఎన్నికల హామీలుగా గ్యారంటీ కార్డు స్కీంలను సోనియాగాంధీ ప్రకటించనున్నారు. ఇక ఈ నెల 18న రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు జాతీయ స్థాయి నేతలు వెళ్లి.. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు.

బొట్టు పెట్టి.. మంగళ హారతి పట్టి..

సీడబ్ల్యూసీ, విజయభేరి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కాంగ్రెస్ జాతీయ నేతలకు టీపీసీసీ ఘనంగా స్వాగతం పలికింది. కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ఇతర నేతలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి జాతీయ నేతలు తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకోగా.. మహిళా నేత కత్తి కార్తీకగౌడ్ వారందరికీ బొట్టు పెట్టి, మంగళ హారతి ఇచ్చి ఆహ్వానించారు.

తెలంగాణ పార్టీలో జోష్ కోసం

త్వరలో తెలంగాణతోపాటు రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో హైదరాబాద్‌లోనే సీడబ్ల్యూసీ సమావేశాలు నిర్వహించేందుకు కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపింది. తెలంగాణలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాలు ఉన్నాయన్న అంచనాలు ఉన్నాయని.. ఈ క్రమంలో రాష్ట్ర కేడర్‌లో జోష్ నింపడం, బీఆర్‌ఎస్‌ను దీటుగా ఎదుర్కొంటామనే సంకేతాలను ఇవ్వడం కోసం ఇక్కడ సమావేశాలు పెట్టారని చర్చ జరుగుతోంది.

ఐదు రాష్ట్రాల్లోనూ అధికారం మాదే!

- భారత్‌జోడో యాత్రతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చాం
- 'విజయభేరి'తో తెలంగాణలో పాగా వేస్తాం: కేసీ వేణుగోపాల్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం రాష్ట్రాల్లో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 30 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో 17న తలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభాస్థలిని పార్టీ ముఖ్య నేతలు జైరాం రమేశ్, ఠాక్రే, రేవంత్‌రెడ్డి తదితరులతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. రాహుల్ భారత్ జోడో యాత్రతో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని.. విజయభేరి సభతో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామన్నారు. తెలంగాణలో దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం, అరాచకం పాలన కొనసాగుతున్నాయని ఆరోపించారు.

రాజకీయాలకు అతీతంగా స్వాగతం: రేవంత్

తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి రాజకీయాలకు అతీతంగా స్వాగతం పలకాలని మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులకు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాట ప్రకారం తెలంగాణ ఇచ్చినట్టే.. సోనియా విజయభేరి సభలో ప్రకటించే 6 గ్యారంటీలను నెరవేరుస్తారని చెప్పారు. సోనియా పాల్గొనే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ రుచులు.. దమ్ బిర్యానీ

సీడబ్ల్యూసీకి హాజరయ్యే అతిథుల కోసం 78 రకాల వంటకాలు

సాక్షి, హైదరాబాద్: సీడబ్ల్యూసీ భేటీలకు వచ్చే నేతలకు తెలంగాణ ప్రత్యేక వంటకాలతోపాటు హైదరాబాదీ దమ్ బిర్యానీని వడ్డించనున్నారు. మొత్తంగా 78 రకాల వంటకాలను వడ్డించేలా పీసీసీ ఏర్పాట్లు చేసింది. ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు అన్నిరకాల వంటలు, రుచులు ఉండేలా మెనూ సిద్ధం చేసింది. సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, వివిధ రాష్ట్రాల ఇతర సీనియర్లు వస్తున్న నేపథ్యంలో.. ప్రత్యేక వంటకాల కోసం వివిధ ప్రాంతాల నుంచి వంట మనుషులను రప్పించింది.

- అల్పాహారంలో ఇడ్లీ, వడ, దోశ, పెసరట్టు, ఉగ్గాని, కిచిడీ, ఉప్మా, రాగి, జొన్న సంగటి, పాయ సూప్, ఖీమా రోటీ, మిల్లెట్ ఉప్మా, మిల్లెట్ వడ, ఫ్రూట్ సలాడ్ వంటివి వడ్డించనున్నారు.
- మధ్యాహ్నం భోజనంలో హైదరాబాదీ దమ్ బిర్యానీ, హలీమ్, బగారా రైస్, కుర్మా, దాల్చా మటన్, స్పెషల్ చికెన్, మటన్ కర్రీ, చికెన్ ఫ్రై, తలకాయ కూర, లివర్ ఫ్రై, తెలంగాణ స్పెషల్ మటన్ కర్రీ, చింతచిగురు మటన్, గోంగూర మటన్, చేపలు వడ్డిస్తారు.
- శాకాహారుల కోసం పచ్చిపులుసు, గోంగూర చట్నీ, గుత్తి వంకాయ, కొబ్బరి చట్నీ, అంబలి, దాల్చా, రోటి పచ్చళ్లు ఉండనున్నాయి.
- స్నాక్స్ ఐటమ్స్‌గా ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లు, సర్వపిండి, వివిధ రకాల సమోసాలు, కుడుములు, మురుకులు, ఉడికించిన మొక్కజొన్న, సకినాలు, గారెలు రుచి చూపించనున్నారు.

క్లుప్తంగా...

తెలంగాణ పోలీస్‌కు ఫిక్కీ స్మార్ట్ పోలీసింగ్ అవార్డు

అందుకున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ పోలీస్‌కు ఫిక్కీ స్మార్ట్ పోలీసింగ్–2022 పురస్కారం దక్కింది. చైల్డ్ సేఫ్టీ విభాగంలో ఈ పురస్కారం అందజేశారు. ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఫిక్కీ ప్రతినిధులు రాచకొండ సీపీ మహేశ్ భగవత్‌కు పురస్కారాన్ని ప్రదానం చేశారు. 2017–22 సంవత్సరాల మధ్య ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న చిన్నారులకు ఒడియా, మరాఠీ భాషల్లో వర్క్‌సైట్ పాఠశాలలను తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీటిద్వారా 6555 మంది వలస చిన్నారులకు విద్యాబోధన అందింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఫిక్కీ అవార్డుకు తెలంగాణ పోలీస్‌ను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సీపీ మహేశ్ భగవత్ విలేకరులతో మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇటుక బట్టీల నుంచి రక్షించిన పిల్లలకు మాతృభాషలో విద్య అందించామన్నారు. అనంతరం చిన్నారులకు వారి రాష్ట్రంలో తదుపరి విద్యకు అవకాశం కల్పించినట్టు వెల్లడించారు.

రేపు 'పీఎం విశ్వకర్మ'కు మోదీ శ్రీకారం

- 140 జాతులు, 18 వృత్తులకు పథకం వర్తింపు
- తెలంగాణ, ఏపీల్లోని నాలుగున్నర లక్షల కుటుంబాలకు లబ్ధి: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న ప్రధాని మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ జయంతి సందర్భంగా చేతి, కులవృత్తులవారి జీవితాలలో వెలుగు నింపే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి మోదీ శ్రీకారం చుడుతారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం మోదీ వర్చువల్‌గా ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ప్రజలందరూ ప్రత్యక్షంగా వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. శిల్పకళావేదికలో జరిగే కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, తాను పాల్గొంటామని, వరంగల్‌లో కేంద్ర సహాయమంత్రి రాజీవ్ రతన్, దేశవ్యాప్తంగా కేంద్రమంత్రులు 70 ప్రాంతాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటారని తెలిపారు. శుక్రవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్రం ఆధ్వర్యంలో 750 ప్రాంతాల్లో 'ధన్యవాద్ మోదీజీ' పేరుతో బైక్ ర్యాలీలు, పాలాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని లక్ష్మణ్ తెలియజేశారు. ఈ పథకం ద్వారా 140 జాతులు, 18 వృత్తులకు చెందిన దాదాపు 30 లక్షల కుటుంబాలకు, తెలుగు రాష్ట్రాల్లో నాలుగున్నర లక్షల కుటుంబాలకు రూ.13 వేల కోట్లతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు ఉచితశిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామీణ చేతి, కులవృతులవారి నైపుణ్యశిక్షణకు అవసరమైన ఆధునిక పనిముట్లు, యంత్రాల కొనుగోలు కోసం ఉచిత ఆర్థిక సాయం అందించనున్నట్లు లక్ష్మణ్ తెలిపారు.

కేసీఆర్.. అబద్ధాలకోరు

9 మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర ప్రభుత్వానిది నయాపైసా లేదు : ఎంపీ అర్వింద్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రారంభించిన 9 మెడికల్ కాలేజీల్లో రాష్ట్ర ప్రభుత్వ నిధులు నయాపైసా లేవని, మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధులతో కట్టించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. సెంట్రల్ అసిస్టెన్స్ నిధుల నుంచి ఈ కాలేజీల నిర్మాణానికి రూ. 233.20 కోట్లు కేంద్రం గ్రాంట్‌గా ఇచ్చిందని తెలిపారు. శుక్రవారం అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత పరిణామాలతో కేసీఆర్ అబద్ధాలకోరుగామిగిలిపోయారని, ఆయనవి దొంగలెక్కలు, దొంగమాటలు అని ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు దమ్ముంటే ఉస్మానియాకు వెళ్లి చూడాలని, అక్కడ కొత్త ఆస్పత్రి కడతా అన్నారు ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు.

మన డాక్టర్లు.. దేశానికి రక్ష!

▶ మొదటి పేజీ తరువాయి

లిఖించదగ్గ రోజు ఇది. రాష్ట్ర వైద్య రంగ చరిత్రలో చారిత్రక ఘట్టం ఇది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఉండాలనే లక్ష్యానికి చేరువయ్యాం. తెలంగాణ వాళ్లకు పరిపాలన చేతకాదని ఎకసెక్కాలు పలికిన వారి సమయంలో తెలంగాణలో కేవలం 5 మెడికల్ కాలేజీలు ఉంటే ఇప్పుడు 26కు చేరుకున్నాయి. వచ్చే ఏడాది మరో 8 వైద్య కాలేజీలను ప్రారంభించుకోనున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మొత్తం 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు రాష్ట్రంలో ఉంటాయి. వెనుకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో 5 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకున్నాం. గతంలో ఒక్క కాలేజీ కూడా లేని ఉమ్మడి నల్లగొండలో మూడు వైద్యకళాశాలలు ఏర్పాటు చేసుకున్నాం. ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ వంటి అడవి బిడ్డలు నివసించే ప్రాంతాలను జిల్లా కేంద్రాలుగా చేసి మెడికల్ కాలేజీలను స్థాపించుకున్నాం. హరీశ్‌రావు ఆరోగ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టాక డైనమిక్‌గా పనిచేస్తున్నారు. మంచి విజయాలు సాధించారు.

ఏటా పది వేల మంది డాక్టర్లు..

తెలంగాణలో 2014లో 2,850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే.. ఇప్పుడు 8,515కు చేరుకున్నాయి. ఇందులో 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కేలా చర్యలు చేపట్టాం. మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు కలిపి తెలంగాణ రాష్ట్రం నుంచి ఏటా 10 వేల మంది డాక్టర్లను తయారుచేసే స్థాయికి ఎదుగుతున్నాం. వారు రాష్ట్రానికే కాకుండా దేశమంతటికీ సేవలు అందిస్తారు.

ప్రజలకు మంచి వైద్య సేవలు కూడా..

దేశంలోనే అత్యధికంగా ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లున్న ఏకైక రాష్ట్రం మనదే. 34 వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉండే 34 పెద్దాస్పత్రులలో వేలాది పడకలతో పేదలకు మంచి వైద్య సేవలు అందుతాయి. ప్రతి మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కోర్సులు పెడుతున్నాం.



వర్చువల్ విధానంలో వైద్య కళాశాలలను ప్రారంభించి మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

2014లో రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో 17 వేల పడకలుంటే.. ఇప్పుడు 34 వేలకు పెరిగాయి. మరో 6 ఆస్పత్రులు నిర్మాణంలో ఉన్నాయి. వరంగల్‌లో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌లో టిమ్స్ బ్యానర్ కింద నాలుగు ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. నిమ్స్‌ను విస్తరిస్తున్నాం. మొత్తంగా బెడ్ల సంఖ్యను 50 వేలకు పెంచుకుంటున్నాం. ఏవైనా విపత్కర పరిస్థితులు ఎదురైతే ఎదుర్కొనేందుకు మొత్తం 50 వేల పడకలను ఆక్సిజన్ బెడ్స్‌గా సిద్ధం చేసుకుంటున్నాం.

రాష్ట్రంలో మానవీయ పాలన: తెలంగాణలో మానవీయ పాలన కొనసాగుతోంది. అమ్మ ఒడి వాహనాలు ఏర్పాటు చేసి గోండు గూడాలు, ఆదివాసీ, బంజారా తండాలు, మారుమూల ప్రాంతాల్లోని గర్భవతులను ఆస్పత్రులకు తరలిస్తున్నాం. ప్రసవం అయ్యాక తిరిగి ఇంటివద్ద దింపుతున్నాం. తల్లీపిల్లల కోసం కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలను అమలు చేస్తున్నాం. వైద్య వృత్తి పవిత్రమైనది. తెలంగాణ వైద్యులంటే గొప్ప పేరు రావాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలి..'' అని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

దేశ చరిత్రలోనే తొలిసారి: హరీశ్‌రావు

ఒక రాష్ట్రం ఒకేసారి తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించడం దేశ వైద్య రంగ చరిత్రలోనే మొదటిసారని.. ఇది సీఎం కేసీఆర్ పట్టుదలకు నిదర్శనమని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో సుదినమని చెప్పారు. గత ఏడాది ఒకేసారి 8 కాలేజీలు ప్రారంభించి రికార్డు సృష్టించామని, ఈసారి మన రికార్డును మనమే అధిగమించామని తెలిపారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి వచ్చిన ఎంబీబీఎస్ సీట్లలో ఒక్క తెలంగాణ వాటానే 43 శాతమని వివరించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్తు సరఫరా, జిల్లాకో మెడికల్ కాలేజీ, రైతుబంధు వంటి కార్యక్రమాలతో మన రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. కాగా.. సీఎం కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభించగా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు జిల్లాల్లో కాలేజీల వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.

పీవీని విస్మరించిన కాంగ్రెస్

దివంగత మాజీ ప్రధాని మనవడు సుభాష్

సాక్షి, హైదరాబాద్: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ బలోపేతానికి కీలక పాత్ర పోషించిన దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఆ పార్టీలో కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని ఆయన మనవడు ఎన్.వి. సుభాష్ విమర్శించారు. ఆయన లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో బంగాళాఖాతంలో కలిసేదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ భేటీ సందర్భంగా పీవీకి కనీస గౌరవం కూడా ఇవ్వలేని సోనియా గాంధీ, తెలంగాణకు వచ్చి ఏం చేస్తారో చెప్పాలని సుభాష్ ప్రశ్నించారు.

పొలాలకు నీళ్లు.. ప్రతిపక్షాలకు కన్నీళ్లు!



సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- ధాన్యం ఉత్పత్తి నుంచి డాక్టర్ల దాకా తెలంగాణదే అగ్రస్థానం
- సిరిసిల్ల మెడికల్ కాలేజీ వద్ద కార్యక్రమంలో మంత్రి కేటీఆర్
- కేంద్రం పగబట్టినా.. రాష్ట్ర సొంత నిధులతో కాలేజీల ఏర్పాటు
- తెలంగాణను మళ్లీ ఢిల్లీ చేతుల్లో పెట్టాలని కాంగ్రెస్, బీజేపీ చూస్తున్నాయని ఫైర్

సిరిసిల్ల/ సాక్షి నెట్‌వర్క్: తెలంగాణను మళ్లీ ఢిల్లీ చేతుల్లో పెట్టాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చూస్తున్నాయని.. రాష్ట్రంలో పొలాలకు నీళ్లు అందుతుంటే, ప్రతిపక్షాలకు కళ్లమంటతో కన్నీళ్లు వస్తున్నాయని మంత్రి కె.తారకరామారావు మండిపడ్డారు. గత 65 ఏళ్లలో కాంగ్రెస్ వాళ్లు చేయని ఎన్నో పనులు తాము తొమ్మిదేళ్లలో చేశామని.. ధాన్యం ఉత్పత్తిలోనే కాదు డాక్టర్లను తయారు చేయడంలోనూ తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం శివార్లలోని పెద్దూరు వద్ద మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం సిరిసిల్లలోని అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీలో మాట్లాడారు. ''తెలంగాణ ధాన్యం ఉత్పత్తిలోనే కాదు.. డాక్టర్లను తయారు చేయడంలోనూ అగ్రస్థానంలో ఉంది. 2014కు ముందు తెలంగాణలో ఐదే మెడికల్ కాలేజీలుంటే.. ఇప్పుడు 21 ఉన్నాయి. మరో ఎనిమిది ఏర్పాటు కానున్నాయి. అన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నవే. అదే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే.. తెలంగాణకు మాత్రం ఒక్కటీ ఇవ్వలేదు. ఇలా తెలంగాణపై కేంద్రం పగబట్టినా.. రాష్ట్ర సొంత నిధులతో సీఎం కేసీఆర్ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారు..'' అని కేటీఆర్ చెప్పారు.

అమ్మానాన్న అనుకున్నది వేరు..

''నేను ఇంటర్‌లో బైపీసీ చదివా.. మా అమ్మ నన్ను డాక్టర్‌ను చేయాలనుకుంది.. మా నాన్న ఐఏఎస్‌ను చేయాలనుకున్నారు.. కానీ నేను ఆ రెండూ కాకుండా రాజకీయాల్లోకి వచ్చాను..'' అని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. తాను 1993లో ఎంసెట్ రాస్తే.. ఉమ్మడి రాష్ట్రంలో 1,600వ ర్యాంకు వచ్చిందని, బీఫార్మసీలో సీటు వచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఏమైనా డాక్టర్ చదువు చాలా కష్టంతో కూడుకున్నదని.. ఇష్టంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు..

- ఖమ్మంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్ పాల్గొన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య, వైద్యవిద్య రంగాల్లో సీఎం కేసీఆర్ నవశకానికి నాంది పలికారని పేర్కొన్నారు.
- కర్ణాటక ఎన్నికలతో నిద్రలేచిన కాంగ్రెస్ నేతలు.. కేసీఆర్ రుణమాఫీ చేయడంతో బొక్కబోర్లా పడ్డారని జనగామ కాలేజీ వద్ద కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు.
- నిర్మల్ కాలేజీ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆసిఫాబాద్‌లో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఆసిఫాబాద్ వద్ద విద్యార్థులు, యువకులు కోరడంతో మంత్రి మల్లారెడ్డి..''పాలమ్మిన, పూలమ్మిన.. స్కూళ్లు, కాలేజీలు పెట్టిన.. మెడికల్ కాలేజీలు కట్టిన..' అంటూ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది.
- భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాల్లో అందే వైద్య సేవలు ఇకపై భూపాలపల్లిలో అందుతాయన్నారు.
- కామారెడ్డి కాలేజీ వద్ద జరిగిన కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. వైద్యవిద్యలో దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నామని ఈ సందర్భంగా పోచారం పేర్కొన్నారు.

సర్కారు బడుల్లో అల్పాహారం

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. అయితే కేవలం ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే కాకుండా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకటోతరగతి నుంచి పదోతరగతి వరకు ఈ పథకం అమలు చేస్తారు. ఇందులో భాగంగానే విద్యాశాఖ కార్యదర్శి వాకాటికరుణ జీఓ 27 జారీ చేశారు.

వచ్చే నెల 24 నుంచి అమల్లోకి...

ముఖ్యమంత్రి అల్పాహార పథకం అమలుకు పక్కాగా కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాల్సి ఉంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులను డీటైల్డ్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. తమిళనాడులో అమలు చేస్తున్న అల్పాహార పథకాన్ని లోతుగా అధ్యయనం చేసి ప్రణాళిక తయారు చేయాలని స్పష్టం చేసింది. ఈ పథకం కేవలం పాఠశాలల పనిదినాల్లోనే అమలులో ఉంటుంది. మొత్తంగా దసరా కానుకగా అక్టోబర్ 24వ తేదీన ఈ పథకం అమలు చేయనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.

బడిపిల్లలకు వరం

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులంతా పేదపిల్లలే. వారికి మధ్యాహ్న భోజన పథకం ఎంతో ఉపయోగపడుతోంది. ఇక అల్పాహార పథకం వారికి సీఎం ఇస్తున్న వరంగానే చెప్పొచ్చు. ఈ పథకం అమలుకు కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. – రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి

సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని స్వాగతిస్తున్నాం. బడికి వచ్చే పేదవిద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన ఆలోచనతో పథకాన్ని తీసుకురావడం శుభసూచకం. దీనిని శాశ్వతంగా అమలు చేయాలి. కార్యాచరణ ప్రణాళిక పకడ్బందీగా రూపొందించాలి. – కె.జంగయ్య, చావ రవి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

ప్రభుత్వ మానవీయకోణం

సీఎం కేసీఆర్ మానవీయ కోణంలో తీసుకున్న ఈ నిర్ణయం అద్భుతం. సీఎం నిర్ణయం పట్ల రాష్ట్రంలోని అన్నివర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.– జూలూరు గౌరీశంకర్, చైర్మన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ

సాక్షి
శనివారం, 16 సెప్టెంబర్ 2023

కశ్మీర్ మళ్లీ మొదటికి?!

అడపా దడపా జరిగే ఘటనలు మినహా దాదాపు ప్రశాంతంగా ఉన్నట్టు కనబడిన కశ్మీర్‌పై ఉగ్రవాదులు పంజా విసిరారు. ఒక ఎన్‌కౌంటర్ సందర్భంగా అనంతనాగ్ జిల్లాలో బుధవారం సైనికాధికారులు కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆషిష్, డీఎస్పీ హుమాయిన్ ముజామిల్ భట్ ఉగ్రవాదుల తుపాకి గుళ్లకు నేలకొరగడం... అదే ప్రాంతంలో శుక్రవారం మరో ఆర్మీ జవాన్ మిలిటెంట్ల చేతుల్లో ప్రాణాలు కోల్పోవటం అక్కడి తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. దట్టంగా అడవులు, కొండలు ఉండే ప్రాంతాలను ఎంచుకుని భద్రతా బలగాలపై దాడికి తెగబడటం ఇటీవలికాలంలో మిలిటెంట్లు అనుసరిస్తున్న వ్యూహం. గత నెలలో ముగ్గురు ఆర్మీ జవాన్లను హతమార్చిన ప్రాంతం కుల్గామ్ కూడా దట్టమైన అటవీ ప్రాంతమే. కొండలు. కోనలు ఉండే అటవీప్రాంతంపై సమగ్ర అవగాహన ఉంటే తప్ప సైన్యం మిలిటెంట్లను తిప్పికొట్టడం సాధ్యం కాదు. తమకు బాగా పట్టున్న ఇలాంటి ప్రాంతాల్లో వారానికి సరిపడా ఆహారం, మందుగుండు సిద్ధం చేసుకుని ఒక పద్ధతి ప్రకారం మిలిటెంట్లు సైన్యాన్ని తామున్నచోటకు రప్పిస్తున్నారు. కొండలపై మాటుగాసి తమవైపు వస్తున్న బలగాలపై కాల్పులు జరపటం మిలిటెంట్లకు సులభమవుతోంది. ఎత్తయిన ప్రాంతంలో ఉండటం వల్ల భద్రతా బలగాలకు బాసటగా వచ్చే హెలికాప్టర్లపై సునాయాసంగా దాడులు చేయగలుగుతున్నారు. పైగా మిలిటెంట్ల ఫోన్ సంభాషణలను వినటం, వారి ఆనుపానులు ఎక్కడ వున్నాయో కచ్చితంగా అంచనా వేయటంలాంటి అంశాల్లో సైన్యం విఫలమవుతోంది. మైదాన ప్రాంతాల్లో గతంతో పోలిస్తే పరిస్థితి మెరుగుపడింది. అక్కడ భద్రతా బలగాలకు సమాచార వ్యవస్థ పటిష్టంగా ఉండటంతో మిలిటెంట్ల ఆటలు సాగడం లేదు.

ఉగ్రవాద దాడులు పెరగటం వెనక ఎప్పటిలాగే పాకిస్తాన్ హస్తం ఉండటం బాహాటంగా కనబడుతోంది. వాస్తవానికి పాక్ ఆర్థికంగా దివాలా తీసి, ఇప్పట్లో కోలుకునే అవకాశం లేని స్థాయికి చేరుకుంది. రాజకీయంగా సరేసరి. ఇమ్రాన్ ఖాన్‌ను గద్దెదించిన నాటినుంచీ సైన్యంపై సాధారణ ప్రజానీకంలో ప్రతికూలత పెరిగింది. మరోపక్క ఉగ్రవాదులకు నిధులు అందజేయటానికి తోడ్పడే సంస్థలనూ, దేశాలనూ నిరోధించేందుకు అంతర్జాతీయంగా ఏర్పాటైన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పాకిస్తాన్‌పై నిఘా ఉంచింది. అయినా సరే అది తన వెనకటి గుణాన్ని వదులుకోవటానికి సిద్ధపడటం లేదని కశ్మీర్ తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఇప్పుడు జరిగిన దాడులకు బాధ్యులుగా చెప్పుకున్న ద రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్‌ఎఫ్) పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబాకు అనుబంధంగా పుట్టుకొచ్చిందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. యాక్షన్ టాస్క్ ఫోర్స్ సంస్థ ఆంక్షలను అధిగమించటానికి పాకిస్తాన్ ఈ కొత్త ఉగ్ర సంస్థను సృష్టించిందని సులభంగానే గ్రహించవచ్చు. సరిహద్దులకు ఆవలినుంచే టీఆర్‌ఎఫ్‌కు ఆయుధాలు, డ్రగ్స్ అందుతున్న సంగతి కూడా నిర్ధారణ అవుతోంది. 370వ అధికరణను రద్దుచేసి, జమ్మూ–కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టి నాలుగేళ్లు కావస్తోంది. అటు తర్వాత కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడిందని, ఆర్థికంగా కోలుకోవటంతోపాటు భద్రతరీత్యా సురక్షితంగా ఉన్నదని బీజేపీ నేతలు చెబుతూ వచ్చారు. గతంతో పోలిస్తే కశ్మీర్‌కు పర్యాటకుల సంఖ్య పెరిగింది. నగరాలు, పట్టణాల్లో మిలిటెంట్ల ఆటలు సాగటం లేదు. కానీ అంతమాత్రానికే సంతృప్తి పడితే ప్రమాదకర పర్యవసానాలుంటాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.

ఇటీవలి ఎన్‌కౌంటర్లను పరిశీలిస్తే బలగాలకు మార్గదర్శకాలిచ్చి వారిని నడిపించాల్సిన ప్రధాన అధికారులే బలవుతున్న సంగతి అర్థమవుతుంది. దాడులకు సీనియర్ అధికారులు నేతృత్వం వహించాలన్నది ఒకరకంగా మంచి నిర్ణయమే. ఇందువల్ల దాడుల్లో చురుగ్గా పాల్గొనేందుకు కింది స్థాయి జవాన్లు సంసిద్ధులవుతారు. అయితే దానికి తగినట్టుగా మిలిటెంట్లు మాటువేసిన ప్రాంతాన్ని నిర్దిష్టంగా, నిర్దుష్టంగా నిర్ధారించుకోవటానికి అవసరమైన పరికరాలు వారికి అందుబాటులో ఉంచటం అతి ముఖ్యం. తగిన వ్యూహాన్ని రూపొందించటంలో, బలగాల్లో ఆత్మవిశ్వాసం నింపి, వారి నమ్మకాన్ని గెల్చుకోవటంలో సీనియర్‌ల పాత్ర కీలకమైనది. అటువంటి అధికారులను కోల్పోవటం వల్ల భద్రతా బలగాలకు కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఇవన్నీ శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించినవి. వీటికి సమాంతరంగా కశ్మీర్‌లో మళ్లీ రాజకీయ ప్రక్రియ ప్రారంభించటానికి అవసరమైన చర్యలు తీసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవాలి. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టాక అంతా మెరుగైందని బీజేపీ నేతలు చెబుతున్నా ఉగ్రవాదుల ఆగడాలు క్రమేపీ పెరుగుతున్న సంగతి కాదనలేనిది. పండిట్లపైనా, వలస వచ్చినవారిపైనా మిలిటెంట్ల దాడులు జరుగుతున్నాయని గతంలో కశ్మీర్ సమస్యపై మధ్యవర్తిత్వం వహించిన బృందంలోని సభ్యురాలు రాధాకుమార్ ఇటీవలే గుర్తుచేశారు. కశ్మీర్‌లో నిరుద్యోగిత దేశ సగటుకన్నా మూడు రెట్లు ఎక్కువున్నదని ఆమె అంటున్నారు. ఇప్పుడు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం 2015 నుంచి మిలిటెన్సీకి దూరంగా ఉంది. అక్కడ గత ఏడెనిమిదేళ్లుగా చెప్పుకోదగిన ఘటనలు లేవు. అటువంటిచోట ఉగ్రవాదులు భద్రతా బలగాలపై దాడులు చేయగలిగారంటే ఆలోచించాలి. కశ్మీర్‌లో నిరుడు దాదాపు వందమంది యువకులు ఉగ్రవాద సంస్థల్లో చేరారని, వీరిలో చాలామంది టీఆర్‌ఎఫ్‌వైపు మొగ్గారని గణాంకాలు చెబుతున్నాయి. కనుక ఉగ్రవాదాన్ని నిరోధించటానికి అవసరమైన చర్యలు తీసుకుంటూనే రాజకీయ ప్రక్రియ ప్రారంభించటం, యువతలో నిరుద్యోగితను అరికట్టడం వంటి చర్యలు అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** శు.పాడ్యమి ఉ.7.54 వరకు
తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తర ఉ.7.33 వరకు, తదుపరి హస్త,
వర్జ్యం: సా.4.37 నుండి 6.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.51
నుండి 7.27 వరకు, **అమృతఘడియలు:** రా.3.29 నుండి
4.44 వరకు

సూర్యోదయం : 5.51
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

పునరుజ్జీవనం

ప్రత్యేక తెలంగాణ కల సాకారమైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉద్యమంగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. కృష్ణా–గోదావరీ జలాలను తెలంగాణలోని చేను చెల్కలను తడపడానికీ, చెరువులను నింపడానికీ, తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకి మళ్లించే కార్యక్రమానికీ ప్రథమ ప్రాధాన్యం ఇచ్చింది. అలా చేపట్టిన ప్రాజెక్టుల్లో ప్రతిష్ఠాత్మకమైనది 'పాలమూరు–రంగారెడ్డి.'

సందర్భం



విరసనోళ్ల శ్రీనివాస్ గౌడ్

తెలంగాణ ఉద్యమానికి ట్యాగ్ లైన్ 'నీళ్లు, నిధులు, నియామకాలు.' రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమ ఆకాంక్ష, ప్రజల స్వప్నంగా ఉన్న కృష్ణా– గోదావరీ జలాలను చేను చెల్కలకు, చెరువులను నింపడానికి తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకి మళ్లించే కార్యక్రమాన్ని ప్రథమ ప్రాధాన్యం రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకుంది. వింధ్య సాత్పురా పర్వతాల మధ్య ఉన్న దక్కన్ పీఠభూమి శిఖరంగా ఉన్న తెలంగాణను ఆకుపచ్చ సీమగా మలిచే బృహత్తర కార్యక్రమాన్ని కేసీఆర్ నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. నూతన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో సమాంతరంగా నీటి నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాల పెంపు ప్రాతిపదికగా ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన 'మిషన్ కాకతీయ' అపూర్వ ఫలితాలను ఇచ్చింది. ఇప్పుడు తెలంగాణ గ్రామీణ ఆర్థిక సామాజిక సాంస్కృతిక వికాసం పునరుజ్జీవం పొందుతోంది.

ఉమ్మడి రాష్ట్రంలో వలస పాలకుల దాష్టీకాల వలన తెలంగాణ సంక్షుభితంగా మారింది. పాలమూరు జిల్లాలో మానవ జీవన విధ్వంసం పతాక స్థాయికి చేరుకుంది. ఇక్కడ మనిషికి మనుగడకు మహా యుద్ధమే జరిగింది. 'నీరు పల్లమెరుగు' అనే కాలం చెల్లిన నమూనాతో తెలంగాణలో అత్యధిక చెరువులు ఉన్న ఉమ్మడి పాలమూరుపై నిర్లక్ష్యం చేసి బిరా బిరా కృష్ణమ్మను రానివ్వకుండా దగా చేశారు. తమ కళ్ళ ముందు పారుతున్న నీటిని కూడా చెరువులో నిల్వ కాకుండా చేశారు. అదే కృష్ణా– గోదావరులతో కోస్తా ప్రాంతాన్ని సుభిక్షంగా మార్చుకున్నారు. గతి తప్పిన రుతువులు, బోర్ బావులతో వ్యవసాయం బావురుమన్నది. నీరు లభ్యం కాని స్థితిలో తీవ్ర దుర్భిక్షం నడుమ జీవితం నిత్య మరణంగా మారిన నేపథ్యంలో బతకడానికి దేశ విదేశాలలో వలస కూలీలుగా కట్టు బానిస జీవితం వెల్లబోస్తున్న దైన్యానికి



పాలమూరు ప్రజానీకం నెట్టబడింది.

మలి దశ తెలంగాణ ఉద్యమాన్ని అంతిమ విజయతీరం వైపు చేర్చడానికి కేసీఆర్ చేపట్టిన అనేక ప్రజాస్వామ్య ఉద్యమ వ్యూహాల్లో భాగంగా 2009 లోక్‌సభ ఎన్నికలలో మహబూబ్ నగర్ నుండి ఎన్నికైనారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలు, భౌగోళిక స్థితిగతులను అవగాహన చేసుకున్నారు. జీవ వైవిధ్యానికి అనువుగా నల్ల రేగళ్లు, ఎర్ర చెల్కలు, ఇసుక భూములు ఉన్నాయక్కడ. నీరు అందితే దక్కన్ అన్నపూర్ణగా విలసిల్లే భవిష్యత్ ఉందని నిర్ధారించుకున్నారు. వలసలు వెళ్లిన ఇక్కడి ప్రజలు తిరిగి రావడమే కాదు, పక్క ప్రాంతాల నుండి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చే దశకు చేరుకోవాలని కోరుకున్నారు. ఈ ప్రాంత లోక్‌సభ సభ్యుడిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం సాధించిన సంతోషంలో కృతజ్ఞతను చాటుతూ ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలనుకున్నారు. పాలమూరును పడావు పెట్టి కృష్ణా నీటిని తరలించుకుపోయిన అప్పటి ప్రాంతీయ ద్రోహులను ఎండగట్టారు. 2014లో రాష్ట్ర సాకారం తర్వాత ఉద్యమ క్రమంలోనే రూపకల్పన చేసుకున్న ఉత్తర తెలంగాణ కోసం 'కాళేశ్వరం', దక్షిణ తెలంగాణ కోసం 'పాలమూరు– రంగారెడ్డి' ఎత్తిపోతల పథకం నిర్మాణం కోసం కార్యాచరణ ప్రారంభించారు. చైనా నిర్మించిన సుప్రసిద్ధ 'త్రీ గార్జెస్' ప్రాజెక్ట్ కంటే గొప్పగా స్టేట్ ఆఫ్ ఆర్ట్ సాంకేతికతతో, ఎలక్ట్రో మెకానికల్ ఇంజనీరింగ్ అద్భుతాలతో కూడిన 'పాలమూరు –రంగారెడ్డి' సాగునీటి ప్రాజెక్ట్‌కు 2015 జూన్ 11న శంకుస్థాపన చేశారు. శ్రీశైలం ఎగువ భాగాన కొల్లాపూర్ మండలం 'ఎల్లూరు' గ్రామం వద్ద వర్షాకాలంలో 120 టీఎంసీల కృష్ణా జలాలను తరలిస్తూ పాలమూరు జిల్లాలో 7 లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 5 లక్షల ఎకరాలు, నల్లగొండలో 30 వేల ఎకరాల భూమికి సాగునీరు; అలాగే 1,228 గ్రామాలకి త్రాగునీరు అందించడం దీని లక్ష్యం.

కృష్ణమ్మ నీరు గ్రావిటీ కెనాల్ ద్వారా నార్లాపూర్ అంజనగిరి, ఏదుల వీరాంజనేయ, వట్టెం వెంకటాద్రి, కరివేన కురుమూర్తి జలాశయాల గుండా ప్రవహించి లిఫ్ట్ ద్వారా రంగారెడ్డిలోని ఉద్దండాపూర్, లక్ష్మీదేవిపల్లి జలాశయాలకు చేరుతుంది. సెప్టెంబర్ 16న 'రంగారెడ్డి– పాలమూరు' ప్రాజెక్ట్‌ను కొల్లాపూర్ మండలంలో 'సింగోటం' వద్ద కేసీఆర్ ప్రజలకి అంకితం చేస్తున్నారు. నీటి శబ్దం, నీటి స్పర్శ మానవ భావోద్వేగాలకు ప్రతీకగా ఇక్కడ జరిగే ఉద్వేగ మహత్తర అంకిత సభకు ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల సర్పంచ్‌లతో పాటు అశేష ప్రజానీకం తరలి రానున్నారు. కృష్ణమ్మ నీటిని కలశాలలో తీసుకొని వెళ్లి ఆయా గ్రామ దేవాలయాల స్వామి పాదాలకు అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఆనతి కాలంలోనే తెలంగాణలో 78 శాతం ప్రజలు ఆధారపడే వ్యవసాయాన్ని పండుగగా మార్చే గౌరవప్రద జీవన భూమికను కేసీఆర్ పోషిస్తున్నారు. పరవళ్ళు తొక్కుతూ వస్తున్న నీటిని, కళ్ళ ముందునుంచి పారిపోతున్న నీటిని దోసిళ్ళతో ఒడిసిపట్టుకుంటున్న సంస్కృతిని సాగుచేస్తున్నారు. జీవన సంక్షోభం ద్వారా వచ్చిన ఆత్మన్యూనత స్థానంలో అభివృద్ధి సుభిక్ష ఆత్మ గౌరవ పతాకాన్ని జన మనో కేతనంగా మార్చిన యుగకర్తగా నిలిచిపోతారు కేసీఆర్. పాలమూరు బిడ్డగా, ఇక్కడి ప్రజల విధేయుడిగా, కేసీఆర్ ఉద్యమ సహచరుడిగా, ప్రభుత్వ పాలనలో తన అనుచరుడిగా ఇతిహాసాన్ని తలపించే పాలమూరు పునరుజ్జీవన చరిత్ర నిర్మాణంలో నేనూ ఒకడిగా ఉండడం పరమానందంగా ఉంది.


వ్యాసకర్త రాష్ట్ర మంత్రివర్యులు

(నేడు కొల్లాపూర్ మం॥ సింగోటం వద్ద 'పాలమూరు–రంగారెడ్డి' ఎత్తిపోతల పథకం జాతికి అంకితం.)

విమోచనం

హైదరాబాదు సంస్థానంలో ఉన్న వారందరూ భారతదేశంలో అంతర్భాగంగా ఉండి సామాజికంగా, సాంస్కృతికంగా కలిసి వున్నారు. ఈ సంస్థానాన్ని ఇస్లాం దేశంగా మార్చాలనీ, ఉర్దూను అధికార భాషగా రుద్దాలనీ నిజాం విషపూరితంగా ఆలోచించిన తర్వాతే పరిస్థితులు మారిపోయాయి. భారత ప్రభుత్వం 'పోలీసు చర్య'ను మొదలుపెట్టి, ప్రజలకు ఆ నిరంకుశ పాలన నుంచి విముక్తి కలిగించింది.

సందర్భం



చెన్నమనేని విద్యాసాగర రావు

హైదరాబాద్ సంస్థాన విమోచనకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలిస్తే 'భారత ప్రభుత్వ దౌత్యం, సామాన్య ప్రజల త్యాగం, యుద్ధం, విలీనం' లాంటివి చరిత్ర పుటలలో కనబడుతాయి. ఆనాడు, తెలంగాణా, మరాఠ్వాడ, కర్ణాటకలో విస్తరించి ఉన్న ప్రాంతాలలో ఇప్పటికీ వీటి భయానక ఛాయలు కనబడతాయి. హైదరాబాద్ సంస్థానంలో బ్రిటిష్ వారికీ, నిజాముకూ మధ్య జరిగిన ఒప్పందానికి వ్యతిరేకంగా 1800 సంవత్సరంలోనే స్వాతంత్ర్య పోరాటం పురుడు పోసుకుంది. హిందువులు, ముస్లింలు కలిసి బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. హిందూ – ముస్లిం ఐక్యతకు ఇది దర్పణం.

ఆంగ్లేయులు సంపదను విచ్చలవిడిగా దోచుకొని దేశాన్ని ఆర్థికంగా నిర్వీర్యం చేశారు. 1857 జూలై 17న మౌల్వి అల్లాఉద్దీన్, తుర్రేభాజ్ ఖాన్ నాయకత్వంలో వందలాది మంది హిందూ, ముస్లింలు కోఠీలో గల బ్రిటిష్ రెసిడెన్సీపై దాడిచేశారు. ఫలితంగా తుర్రేభాజ్ ఖాన్‌ను హతమార్చి శవాన్ని కోఠీలో వేలాడదీశారు. అల్లాఉద్దీన్ అండమాన్ జైల్లో 1884లో కన్నుమూశారు. అప్పుడే పుంజుకున్న రాంజీ గోండ్ తిరుగుబాటు తరువాత, వీరులను ప్రభుత్వం నిర్మల్ పట్టణంలో మర్రిచెట్టుకు ఉరితీసింది. అదే ఉరిల మర్రిగా పేరొందింది. జల్ – జమీన్ – జంగల్ కోసం గిరిజనులు జరిపిన పోరాటం, దానికి నాయకత్వం వహించిన కుమ్రం భీం ఆత్మార్పణ ప్రజల స్వాభిమానాన్ని తట్టిలేపాయి.

విభజించు, పాలించు అన్న బ్రిటిష్ వారి చర్యల వల్ల 1927లోనే ముస్లింల కోసం నిజాం 'అంజుమన్ – ఎ– తబ్లిక్– ఎ –ఇస్లాం' పేరుతో ఒక సంస్థను స్థాపించాడు. దానికి బహాదూర్ యార్ జంగ్ నాయకుడు. అదే రంగులు మార్చి 'మజ్లీస్ ఇత్తెహాదుల్ ముస్లమీన్' అయింది. హైదరాబాదు సంస్థానంలో ఉన్న వారం



దరూ భారతదేశంలో అంతర్భాగంగా ఉండి సామాజికంగా, సాంస్కృతికంగా కలిసి వున్నారు. ఇందులో 86 శాతం హిందువులు, పన్నెండున్నర శాతం ముస్లింలు, ఒకటిన్నర శాతం క్రైస్తవులు, ఇతరులు. అత్యధికులు తెలుగు, మరాఠీ, కన్నడ మాట్లాడేవారు. ఉర్దూ కేవలం పాలకులు, వారికి సంబంధించిన వారికే పరిమితమై ఉండేది. నిజాం ఈ సంస్థానాన్ని ఇస్లాం దేశంగా మార్చాలనీ, ఉర్దూను ప్రజలందరిపైన అధికార భాషగా రుద్దాలనీ విషపూరితంగా ఆలోచించిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి.

బ్రిటిష్‌వారు దేశం వదిలి వెళ్లేముందు తీసుకువచ్చిన బలహీన చట్టాన్ని ఆసరాగా తీసుకొని నిజాము హైదరాబాదు సంస్థానాన్ని ఒక స్వతంత్ర దేశంగా పేర్కొని, దానికి తనను సార్వభౌమునిగా ప్రకటించుకున్నాడు. దీనికి అదనంగా మత దురహంకారి ఖాసిం రజ్వీ నిజాముకు మద్దతిస్తూ ఒక చేత్తో ఖురాన్, మరో చేత్తో తల్వార్ పట్టుకొని ఢిల్లీపై తమ జండాని ఎగురవేస్తానని ప్రగల్భాలు పలికాడు. 1947 ఆగస్టు నుండి 17 సెప్టెంబర్ 1948 వరకు నడిచిన హైదరాబాదు సంస్థాన చరిత్ర ఉద్వేగభరితమైనది. మానభంగాలు, దోపిడీలు నిత్యకృత్యాలయినాయి. దౌత్యపరంగా ఆలోచించి భారత ప్రభుత్వమే 1948 నవంబర్ 29న నిజాముతో యథాతథ ఒప్పందాన్ని చేసుకుంది. అయినా మతమార్పిడిలు చెయ్యాలనీ, ఉర్దూ తప్ప మరే భాష ఉండకూడదనీ నిజాము చర్యలు తీసుకున్నాడు. తబ్లీక్ అనే మతమార్పిడి ఉద్యమానికి ప్రతి తహసిల్ ఆఫీసులో ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేశాడు. లక్షలాది మంది పోలీసులను, రజాకార్లను గ్రామాలపైకి ఉసిగొల్పాడు. ఈ అనివార్య పరిస్థితులలో అతి సామాన్యులైన స్త్రీ, పురుషులు దృఢచిత్తులై పోరాడిన వారి త్యాగాలు అనితరసాధ్యం.

'అనిల్ మాలిక్' అనే ప్రమాదకరమైన నినాదం అప్పుడు ఉనికిలో ఉండేది. దీని అర్థం ముస్లింలు అందరూ ప్రభువులేనని. జైళ్ళల్లో బంధించబడ్డ సమర యోధులను రజాకార్ల చేత కొట్టించడానికి జైలు ద్వారాలను తెరిపించేవారు. నిజామాబాదు జైల్లో దాశరథికి కూడా ఈ దుఃస్థితి తప్పలేదు. జైలు గోడలపైన ఆయన 'కోటి రతనాల వీణ నా తెలంగాణ' అని బొగ్గుతో రాసిన రాత ఇంకా మండుతూనే ఉంది.

ఈ క్రమంలో వరంగల్ జిల్లా బైరాన్ పల్లిలో రజాకార్లు మారణ హోమాన్ని సృష్టించారు. రజాకార్లు మొదటిసారి దాడికి వస్తే గ్రామస్థులు అడ్డుకున్నారు. పగబట్టిన రజాకార్లు రెండవసారి తరలి వచ్చినా బురుజు మీద ఉన్నవారు గ్రామ ప్రజలను భేరీ ద్వారా అప్రమత్తం చేశారు. మూడు, నాలుగు, అయిదవ సారి జరిగిన దాడి కూడా విఫలమైంది. అయిదు సార్లు ప్రతిఘటించడం వల్ల ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుంది. 1948 ఆగస్టు 25న తమ ప్రతాపం చూపించుకోవడానికి విదేశీ పత్రికా విలేఖరులను వెంటబెట్టుకొని, అధునాతనమైన ఆయుధాలతో దాడి జరిపారు. రజాకార్ల సైన్యం గ్రామం చుట్టుముట్టి ఎక్కడి వారిని అక్కడే పట్టుకున్నారు. అధునాతన ఆయుధాల ముందు గ్రామస్థుల నాటు తుపాకులు సరితూగలేకపోయాయి. దుర్మార్గులైన నిజాం సైన్యం, దాదాపు 84 మందిని వరుసగా నిలబెట్టి ఒక్కొక్క గుండుకు ఎంతమంది చస్తారు అని లెక్కించిన పాశవిక ఆనందాన్ని పొందిన దుర్ఘటన బహుశా దేశంలో ఎక్కడా లేదు. ఇటువంటి ఘటనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 13 నాడు నిజామును నిలవరించడానికి పోలీసు చర్యను మొదలుపెట్టి, ప్రజలను నిరంకుశ నిజాము కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 మాసాల 2 రోజులకు ఈ ప్రాంతంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరేసే అవకాశం కల్పించి విలీన ప్రక్రియను పూర్తిచేశారు.

వ్యాసకర్త మహారాష్ట్ర మాజీ గవర్నర్

సంగీత కళాసాగరులు

ఆ స్వరం వింటే రాళ్ళు కూడా కరుగుతాయంటారు. సంగీతాన్ని నాదోపాసనగా భావించిన వ్యక్తి ఆయన. సంప్రదాయ కుటుంబంలో పుట్టి సంగీత ప్రపంచాన్ని శాసించిన వ్యక్తి ఆయన. బహుభాషావేత్త, వాగ్గేయకారుడు, సంగీత సాహిత్య కళానిధి, హరికథా చూడామణి, ఉత్తమ వాగ్గేయకారుడు, శిష్యులు ప్రేమతో ఎన్‌సీహెచ్ అని పిలుచుకొనే నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో 1923 సెప్టెంబర్ 15న జన్మించారు. తల్లి వేంకట రమణమ్మ, తండ్రి జగన్నాథ తిరువెంకటాచార్యులు. బాల్యంలో తండ్రి వద్ద తర్క మీమాంసాలను అధ్యయనం చేశారు. పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద సంగీత పాఠాలను ప్రారంభించారు. గురువు ఆశీర్వాద బలంతో సంగీతంలో పూర్తి స్థాయి కళాకారుడై దేశ విదేశాలలో కచేరీలు చేసే స్థాయికి చేరుకున్నారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో నిలయ విద్వాంసులుగా 1948లో జీవితం ప్రారంభించి, 1983 వరకు అక్కడే వయోలిన్ విద్వాంసునిగా పనిచేశారు. గాత్ర సంగీతంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. వందలాది మందికి గురుకుల పద్ధతిలో సంగీతంలో శిక్షణ నిచ్చారు.



నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు

కృష్ణమాచార్యులు వాగ్గేయకారుడు. కృతులను రచించారు. గోదాస్తుతి, బిడాల మోక్షం, పరకాల విలాసం, త్యాగరాజ అష్టోత్తరం, నారాయణ శతకం, ప్రాచీన భగద్గీత పరామర్శము తదితర తెలుగు గ్రంథాలు రాశారు. సంస్కృతంలో రామాయణ కథాయాంవ్యపదేశాః, మృత సంజీవం, శఠగోప చరితం, నౌకా చరితం తదితర గ్రంథాలను రచించారు. 2006 ఆగస్ట్ 24న శ్రీరామ సన్నిధి చేరుకున్నారు.

బెజవాడ సంగీత మూర్తి త్రయం మంగళంపల్లి బాలమురళీ కృష్ణ, అన్నవరపు రామస్వామి, ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు – వీరు ముగ్గురూ ఒకే గురువు 'గాయక సార్వభౌమ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వద్ద సంగీతంలో శిక్షణ తీసుకున్నారు. ఎవరి బాణీ వారిదే, ప్రతిభలో ముగ్గురికీ సాటిలేదు. ముగ్గురికీ విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆశ్రయమివ్వడం విశేషం. తెలుగు వారి కీర్తి పతాకను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయులు వారు. ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యుల శత జయంతి సందర్భంగా నేటి నుంచి ఐదు రోజులపాటు విజయవాడలోని శివరామకృష్ణ క్షేత్రంలో సంగీత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

– మణిమేఖల । 63034 59519

(వయోలిన్ విద్వాంసుడు ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యుల శతజయంతి)

కాంగ్రెస్ పెద్దలకు బహిరంగ లేఖ

సందర్భం



డా॥ దాసోజు శ్రవణ్

భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గారికీ, సీడబ్ల్యూసీ సభ్యులకూ –

తెలంగాణలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలని మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాలను సైతం వదిలి, హైదరాబాద్ నగరంలో నిర్వహించాలని నిర్ణయించడం, జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న కీలక నాయకులు సైతం ఈ సమావేశాలకు రావడం హర్షణీయం. మీరు పొలిటికల్ టూరిస్టులుగా కాకుండా, తెలంగాణ అభివృద్ధిపై అధ్యయనం చేయడానికి వస్తున్న పరిశోధకులుగా, ఈ పర్యటనను ఒక స్టడీ టూర్‌గా సద్వినియోగపరుచుకోవాలని కోరుతూ ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను.

ముందుగా మీరు 'విశ్వనగరం' హైదరాబాద్‌లోకి అడుగుపెడుతున్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. ఇక్కడ నివసిస్తున్న సబ్బండ వర్గాల ప్రజలకూ, పరిశ్రమలకూ సకల వసతులూ కల్పిస్తూ, విభిన్న జీవన శైలులకు నిలయమైన హైదరాబాద్ కున్న 'గంగా జమునా తెహజీబ్' ప్రత్యేక వారసత్వ సంస్కృతిని కేసీఆర్ ఎలా కాపాడుతున్నారో గమనించండి. మంత్రి కేటీఆర్ సారథ్యంలో ఐటీ రంగం విప్లవాత్మకమైన ప్రగతి సాధిస్తూ దూసుకుపోతున్న తీరు పరిశీలించండి.

మీ పర్యటనలో తెలంగాణ కొత్త సచివాలయం గురించి తప్పకుండా తెలుసుకోవాలి. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 125 అడుగుల అతి పెద్ద విగ్రహాన్ని చూసి తరించండి. తెలంగాణ అమరవీరుల స్మృత్యర్థం కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రపంచ స్థాయి అమరవీరుల స్మారకకేంద్రాన్ని సందర్శించండి.

మీ పర్యటనలో గ్రామాలకు వెళ్ళినప్పుడు 'మిషన్ కాకతీయ'లో భాగంగా చెరువులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంత అద్భుతంగా అభివృద్ధి చేసిందో చూడండి. మీరు 'మిషన్ భగీరథ' ఘనత తప్పకుండా తెలుసుకోవాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 24 వేల పల్లెలకు, 121 నగర ప్రాంతాలలో ఉన్న ప్రతి ఇంటికీ పైపు లైనులు ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తూ, ప్రజల దాహార్తిని తీరుస్తోంది ప్రభుత్వం. దాదాపు 80 వేల కోట్ల రూపాయలతో కేవలం 3–4 ఏళ్లలో రికార్డ్ స్థాయిలో నిర్మించిన అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకం 'కాళేశ్వరం ప్రాజెక్ట్'ను సందర్శించండి. అంతే కాదు ఒక పక్క మీరు రాజకీయాలు చేస్తుంటే మరోపక్క కేసీఆర్ 'పాలమూరు– రంగారెడ్డి' లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించి– 13 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించి బీళ్లు పడ్డ భూములను కృష్ణా నదీ జలాలతో తడుపుతున్న విషయాన్ని గుర్తించండి. 'రైతుబంధు', రైతులకు బీమా, పంటరుణాల రద్దు, ఇన్‌పుట్ సబ్సిడీ, 'ఉచిత విద్యుత్ సరఫరా వంటి పథకాలు రైతులను ఎలా ఆదుకొంటున్నాయో తెలుసుకోండి.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేసింది. ఆ విద్యాలయాలకు వెళ్ళండి. వీటిలో అంతర్జాతీయ ప్రమాణాలతో సాగే బోధనను గమనించండి. 'కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ', తెలంగాణ 'గిరిజన సంక్షేమ గురుకులాల'నూ దర్శించండి. ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌తో పాటు, కొత్త జూనియర్ కళాశాలల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు మౌలిక సదుపాయాల కల్పన లాంటి కార్యక్రమాలని ప్రభుత్వం ఎంత నిబద్ధతతో చేపడుతుందో గ్రహించండి. 'మన ఊరు– మనబడి', 'మన బస్తీ–మన బడి' పథకంలో నిర్మించిన స్కూల్స్ ని సందర్శించండి.



'కేసీఆర్ కిట్', 'బస్తీ దవాఖానాలు', 'తెలంగాణ డయాగ్నోస్టిక్స్', 'ఆరోగ్యశ్రీ' ఇలాంటి అద్భుతమైన పథకాల అమలూ; 34 మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఉన్నత ప్రమాణాలతో నిర్వహించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో సాధించిన గణనీయమైన వృద్ధిని అధ్యయనం చేయండి.

తండాలు, గూడేల్ని పంచాయతీలుగా మార్చాలని ఎన్నో ఏళ్లనుంచి కోరుకుంటున్న గిరిజనుల కలని కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'దళిత బంధు' పథకం దళితుల జీవితాలు ఎంత అద్భుతంగా మార్చిందో మీరు తెలుసుకోవాలి. వ్యవసాయం తరువాత ఎక్కువ శాతం ప్రజలకు జీవనోపాధి ఇస్తున్న వృత్తి చేనేత. నేతన్నల జీవితాల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన అద్భుతమైన మార్పుని పరిశీలించండి. దేశంలో ఎక్కడాలేని విధంగా గొల్ల, కురుమలకు వేలకోట్ల రూపాయలతో అమలు చేస్తున్న 'సబ్సిడీ గొర్రెల పంపిణీ' పథకం, అదే విధంగా కోట్లకొద్దీ చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారుల ఆదాయానికి తోడ్పడ్డ విషయం తెలుసుకోండి.

అలాగే మీ పర్యటనలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 'డబుల్ బెడ్ రూమ్' ఇళ్ళని సందర్శించండి. పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ప్రభుత్వం అద్భుతంగా అమలు చేస్తున్న 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు తెచ్చిన కల్యాణ కాంతులు చూడండి.

కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాల గాథ గురించి చెప్పాలంటే ఇంకా చాల విషయాలు ఉన్నాయి. మీ సీడబ్ల్యూసీ సమావేశాల్లో తెలంగాణలో పదేళ్ళలో జరిగిన అభివృద్ధి దేశంలో అరవై ఏళ్లలో ఎందుకు జరగలేదో లోతుగా చర్చించండి. ఒక విశాల దృక్పథంతో ఆలోచించి, తెలంగాణ అభివృద్ధి సంక్షేమాన్ని మీ రాష్ట్రాలలో అమలు చేసి మీ ప్రాంతాల్లో ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందించండి.

ఇట్లు మీ
శ్రవణ్

వ్యాసకర్త బీఆర్‌ఎస్ నాయకుడు

క్లుప్తంగా...

లింగ బలిజలను ఓబీసీలో చేర్చండి

• రాష్ట్రపతికి వీరశైవ లింగాయత్, లింగ బలిజల విజ్ఞప్తి



రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు బసవేశ్వరుని చిత్రపటాన్ని బహూకరిస్తున్న వీరశైవ లింగాయత్, లింగబలిజ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని వీర శైవ లింగాయత్‌లు, లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప నేతృత్వంలో బృందం శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు వినతి పత్రం అందజేసింది. ఆయా కులాలకు చెందిన 90 శాతం మంది పేదరికంలో ఉన్నారని రాష్ట్రపతికి వివరించారు. 2009లో రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చారని కానీ కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చలేదని పేర్కొన్నారు. అనంతరం కల్వ మల్లికార్జున జనవరిలో ఆవిష్కరించనున్న మాస పత్రిక సిల్వర్ జూబ్లీ సావనీర్‌కు సందేశాన్ని ఇవ్వాలని రాష్ట్రపతిని ఈశ్వరప్ప కోరారు.

మహిళా బిల్లులో బీసీలకు సబ్‌కోటా

• ఆర్. కృష్ణయ్య డిమాండ్



మాట్లాడుతున్న కృష్ణయ్య

ముషీరాబాద్ (హైదరాబాద్): పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్‌వద్ద శుక్రవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, బీసీ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిపాదిత మహిళా బిల్లులో బీసీ కోటా కోసం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ.. 76 ఏళ్లుగా బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించకుండా అగ్ర వర్ణాలు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలలోనే మహిళా బిల్లు పెట్టి బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత లేద న్నారు. మహిళా బిల్లు గురించి గొంతు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీ నాయకులు బీసీ మహిళలకు జరుగుతున్న అన్యాయాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మొక్కుబడిగా తెలంగాణ అసెంబ్లీలో తీర్మానించి చేతులు దులిపేసుకుంటే సరి పోదని స్పష్టం చేశారు.

రూ.3.39 కోట్ల నగదు చోరీ

• కొత్త ఇల్లు కొనుగోలుకు సమకూర్చుకున్న బాధితుడు

హైదరాబాద్(వెంగళరావునగర్): ఇంటి నుంచి బయటకు వెళ్లి వచ్చేలోగా కోట్ల రూపాయల నగదు, బంగారం అపహరణకు గురైనట్లు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఒకరు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం ..ఎల్లారెడ్డిగూడలోని పోకుల గంజన్‌కు చెందిన పెంట్‌హౌస్‌లో వాస్తు శాస్త్రం చెప్పే వీవీఎ ఎల్ఎన్.చౌదరి పాతికేళ్లగా నివాసం ఉంటున్నాడు. హౌస్‌ఓనర్ ఇల్లు ఖాళీ చేయాలని చెప్పగా, సొంతంగా ఇల్లు కొనేందుకు ప్లాన్ చేసుకున్నాడు. ఈ మేరకు రూ.3.39 కోట్ల నగదు, 450 గ్రాముల బంగారు బిస్కెట్లు సమకూర్చుకున్నాడు. తాను ఉంటున్న ఇంట్లో పరుపు కింద వాటిని భద్రంగా దాచాడు. కాగా ఈనెల 12వ తేదీ ఉదయం కొత్త ఇల్లు కొనుగోలుకు నగరంలోని పలు ప్రాంతాల్లో వెతికాడు. తర్వాత ఇంటికి బయలుదేరగా, రాత్రి వేళ పెంట్‌హౌస్‌కు వెళ్లే మెట్లమార్గం ధ్వంసమై ఉంది. గోడలు కూడా పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా అంతా చిందరవందరగా ఉంది. పరుపు ఎత్తి చూడగా నగదు, బంగారు బిస్కెట్లు, మూడు ల్యాప్‌టాప్‌లు కనిపించ లేదు. ఆందోళన చెందిన బాధితుడు చౌదరి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రక్తంతో లేఖ

హుజూరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఎం కేసీఆర్, సీఎస్ శాంతికుమారికి రక్తంతో లేఖ రాసినట్లు రాష్ట్ర వాణిజ్య పనులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ తెలిపారు. హుజూరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు 4 డీఏలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించడానికి చొరవ చూపాలని లేఖలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

పూతరేకులు.. వెరీ స్పైసీ గురూ..

కాకరకాయ, వెల్లుల్లి కారంపొడితో తయారీ

షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక పూతరేకులు

విశాఖలో మార్కెట్లోకి విడుదల చేసిన ఆత్రేయపురం తయారీదారులు



సాక్షి, విశాఖపట్నం: పూతరేకు ఏంటీ.. స్పైసీగా ఉండటమేంటి...? విడ్డూరం కాకపోతేనూ...! అని అనుకుంటున్నారా... లేదండీ... నిజమే.. ఇక నుంచి స్పైసీ పూతరేకులు మార్కెట్‌లో హాట్ హాట్‌గా కనిపించనున్నాయి. ప్రత్యేకంగా మధుమేహ వ్యాధిగ్రస్తుల కోసం కాకరకాయ, వెల్లుల్లి కారంతో పూతరేకులను రూపొందించారు ఆత్రేయపురానికి చెందిన తయారీదారులు. పూతరేకుల తయారీ అనేది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయ పురం ప్రజలకు తరతరాలుగా వారసత్వంగా వస్తోంది. తొలినాళ్లలో పంచదారతోనే పూతరేకులు తయారు చేసేవారు. కాలానుగుణంగా మారుతున్న అభిరుచుల మేరకు పూతరేకుల్లోనూ అనేక రకాలు వచ్చేశాయి. బెల్లం, నెయ్యి, డ్రై ఫ్రూట్స్ వంటి వాటితో రకరకాల పూతరేకులు తయారు చేస్తున్నారు. ఇప్పుడు పూతరేకుల తయారీదారులు ట్రెండ్ మార్చారు. స్పైసీ పూతరేకులు సిద్ధం చేశారు. కాకరకాయ, వెల్లుల్లి కారంపొడితో పూతరేకు చుడతారు. డయాబెటిక్‌తో ఉన్నవారికి ఇది ఒక ఔషధంలా పనిచేస్తుంది. ఈ పూతరేకులు తింటే రక్తశుద్ధి, ఇన్సులిన్ సామర్థ్యం పెరిగే అవకాశాలు ఉన్నాయని తయారీదారులు చెబుతున్నారు.

మార్కెట్‌లోకి స్పైసీ బిట్టర్‌గార్డ్, గార్లిక్ పూతరేకులు



ఇన్నాళ్లూ పూతరేకులు తీయని రుచితో నోరూరిస్తూ.. మధుమేహ బాధితులకు మాత్రం శత్రువుగా ఉండేవి. షుగర్ ఫ్రీ పూతరేకులు అందుబాటులోకి వచ్చినా వాటిపై డయాబెటిక్ రోగులు అంతగా ఆసక్తి చూపించలేదు. అందుకే ఇప్పుడు స్వీట్‌ని హాట్‌గా తింటూ... మధుమేహాన్ని కంట్రోల్ చేసుకునేందుకు ఆత్రేయపురం వాసులు తయారు చేసిన కొత్త తరహా పూతరేకులను శుక్ర వారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆత్రేయపురానికి చెందిన సర్ ఆర్థర్ కాటన్ పూతరేకుల సహకార సంఘం ప్రతినిధులు తీసుకువచ్చిన స్పైసీ బిట్టర్‌గార్డ్, గార్లిక్ పూతరేకులను దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీసుధ మార్కెట్‌లోకి విడుదల చేశారు.

ప్రతి ఒక్కరూ ఆస్వాదించేలా...

ఆత్రేయపురం పూతరేకులు అంటే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. మా పూతరేకు ప్రతి ఒక్కరూ ఆస్వాదిస్తూ తినాలన్నదే తయారీదారులందరి కోరిక. పంచదారతో తయారు చేయడం వల్ల తినలేకపోతున్నామంటూ చాలామంది మధుమేహం ఉన్నవారు మా ఊరు వచ్చినప్పుడు చెప్పి బాధపడేవారు. అందుకే భౌగోళిక గుర్తింపు వచ్చిన తర్వాత మంచి రోజు చూసుకుని స్పైసీ పూతరేకులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాం. – గాదిరాజు ప్రసాదరాజు, ఆత్రేయపురం

ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష

అక్కడక్కడా అపశ్రుతులు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష అక్కడక్కడా అప శ్రుతులతో ముగిసింది. ఉదయం జరిగిన పేపర్–1 పరీక్షకు 2,69,557 మంది దరఖాస్తు చేసుకోగా 2,26,744 మంది (84.12%) పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్–2 పరీక్షకు 2,08,498 మంది దరఖాస్తు చేసుకోగా 1,89,963 మంది (91.11%) హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 1139 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కానీ పలు పరీక్షా కేంద్రాల్లో కనీసం హాల్ టిక్కెట్లు సైతం పరిశీలించకుండా లోనికి అనుమతి ఇచ్చారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. మాల్ ప్రాక్టీస్, పరీక్ష బుక్‌లెట్ మారడం లాంటివి కూడా చోటు చేసుకున్నాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం సంతోష్‌నగర్‌లోని కృష్ణవేణి హైస్కూల్ పరీక్ష కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ జరిగింది.

ఇన్విజిలేటర్‌పై కేసు

పేపర్–1 పరీక్ష సమయంలో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శి పరీక్ష రాస్తున్న తన సమీప బంధువుకు జవాబులు అందజేశాడు. విషయం తెలిసిన పోలీసులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన అభ్యర్థిని, అందుకు సహకరించిన ఇన్విజిలేటర్‌పై కేసు నమోదు చేశారు. పంచాయతీ కార్యదర్శిని అధికారులు సస్పెండ్ చేశారు.

మూడు గంటల ముందే ప్రశ్నపత్రాల సరఫరా

సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ సభను దృష్టిలో ఉంచుకుని గంట ముందుగా రావాల్సిన టెట్ ప్రశ్నపత్రాలను అధికారులు మూడు గంటల ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేర్చినట్లు తెలిసింది. మధ్యాహ్నం 12.30 గంటలకు సభ ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయని భావించిన అధికారులు ప్రశ్నపత్రాలను ముందే తీసుకొచ్చినట్లు తెలిసింది. అయితే అధికారులు సరఫరా చేసిన బుక్‌లెట్‌కు బదులు మరో బుక్‌లెట్ ప్రశ్నపత్రాలు ఇవ్వాలని హైదరాబాద్ నుంచి సమాచారం రావడంతో గందరగోళం ఏర్పడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశ్నపత్రం మార్చేందుకు కస్టోడియన్ మళ్లీ కేంద్రానికి వెళ్లి వచ్చేసరికి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు చేరడం ఆలస్యమైంది. మరోవైపు సిరిసిల్లలో మధ్యాహ్నం పేపర్–2 పరీక్ష నిర్వహణలో అధికారుల అలసత్వంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా పేపర్–2కు బుక్‌లెట్–2 ఇస్తే.. సిరిసిల్లలో మాత్రం బుక్‌లెట్–1 ఇచ్చారు. అభ్యర్థులు పలువురు కొన్ని ప్రశ్నలకు సమాధానాలు కూడా రాశారు. అయితే విషయం తెలుసుకున్న అధికారులు గంట ఆలస్యంగా బుక్‌లెట్–2 అందజేశారు. అయితే పత్తిపాక వీధిలోని సిద్ధార్థ స్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల ఓఎమ్మార్ షీట్‌ను వైట్‌నర్‌తో దిద్దించారంటూ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఇలావుండగా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో పలువురు అభ్యర్థులు పరీక్షా కేంద్రాల చిరునామాలు సరిగా లేకపోవడంతో సకాలంలో పరీక్షకు హాజరుకాలేకపోయారు.



సిరిసిల్లలో నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు, వివిధ పార్టీల నేతలు

టెట్ పరీక్షకు వచ్చి గర్భిణి మృతి

• అస్వస్థతతో పరీక్ష కేంద్రంలోనే కుప్పకూలిన వైనం
• ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలొదిలిన యువతి



రాధిక

పటాన్‌చెరు టౌన్: టెట్ పరీక్ష రాసేందుకు భర్త, కుమార్తెలతో కలిసి హడావుడిగా పరీక్షా కేంద్రానికి వచ్చిన ఓ గర్భిణి అస్వస్థతకు గురై మరణించింది. ఈ విషాద సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి ఇంద్రానగర్‌కు చెందిన రాధిక శుక్రవారం ఉదయం తన భర్త అరుణ్ ఇద్దరు కుమార్తెలు.. నాలుగేళ్ల అమృత వర్షిణి, రెండేళ్ల కాత్యాయనితో కలిసి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి వచ్చింది. ఈమె 8 నెలల గర్భిణీ అని తెలిసింది. అయితే పరీక్ష ప్రారంభ సమయం దగ్గర పడటంతో వేగంగా నడుస్తూ వచ్చిన ఆమె ఎట్టకేలకు పరీక్షా హాలుకు చేరుకుంది. అయితే విపరీతమైన చెమటతో గదిలోనే పడిపోయింది. వెంటనే ఆమెను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు. అధిక రక్తపోటుతో గుండెపోటుకు గురై రాధిక మరణించి ఉండొచ్చునని వైద్యులు తెలిపారు.

‘ప్రలోభానికే మళ్లీ కేసీఆర్ పథకాలు’

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. వివిధ పథకాల ద్వారా మళ్లీ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సీఎం కేసీఆర్ పావులు కదుపుతున్నారని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి ఆరోపించారు. పథకాలను ప్రకటించడంలో చూపిన ఉత్సాహం అమల్లో చూపడం లేదన్నారు. బీసీ బంధు, గృహలక్ష్మి తదితర పథకాలను సీఎం ప్రకటించి నిధులు సమీకరించలేక చేతులు దులిపేసుకున్నారని విమర్శించారు. ఇప్పటి దాకా పథకాల అమలు తీరు మరీ తీసికట్టుగా ఉండడంతో.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్‌కు ఓటమి తప్పదని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ఆర్.కె.సింగ్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే

• విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

వెంగళరావునగర్ (హైదరాబాద్): కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని, వాటిని ప్రజలు నమ్మేస్థితిలో లేరని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం టీఎస్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నేతృత్వంలో విద్యుత్ రంగంలో అనేక విజయాలు సాధించినట్టు పేర్కొన్నారు. తెలంగాణకు తిరిగి చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల అప్పులు నిలిపేశామని ఆర్‌కె సింగ్ అనడం శతాబ్దకాలంలోనే అతిపెద్ద అబద్ధమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా కూడా రుణాల చెల్లింపు ఆపిందిలేదని, ఏ రంగంలో అప్పు తీసుకున్నా సకాలంలో చెల్లించే రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. అందువల్లనే బ్యాంకులు ముందుకు వచ్చి అప్పులు ఇస్తామని క్యూ కడుతున్నాయన్నారు. కేంద్రం అబద్ధాలను మానుకోవాలని సూచించారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని అధికారులను కోరారు. ఎక్కడైనా విద్యుత్ లైన్లు లూజుగా ఉన్నాయని ఫిర్యాదులు అందితే తక్షణమే స్పందించాలని సూచించారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు మాట్లాడుతూ సంస్థ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సజావుగా సాగాలంటే ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని అన్నారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నాకర్‌రావు, పి.సదానందం తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

మిల్లెట్ సాగుకు అనుకూల వాతావరణం

• మిల్లెట్ కాంక్లేవ్‌లో నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ



సాక్షి, హైదరాబాద్: దేశంలో మిల్లెట్ సాగుకు అనుకూలమైన వాతావరణం ఉందని నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ‘మిల్లెట్ కాంక్లేవ్- 2023’ని జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా షాజీ మాట్లాడుతూ మిల్లెట్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అద్భుతమైన ఫలితాలు అందించిందని చెప్పారు. గ్రామీణ–పట్టణ ఆదాయ అసమానతలు తగ్గించడం, సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడం తమ కర్తవ్యమన్నారు. ఐక్యరాజ్యసమితి 2023ని మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించడానికి మన దేశమే కారణమని, మిల్లెట్లను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇది భారతదేశానికి ఒక సువర్ణావకాశాన్ని అందిస్తుందని చెప్పారు. భారత్‌ను మిల్లెట్ గ్లోబల్ హబ్‌గా మార్చడానికి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ అత్యుత్తమ కేంద్రంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మిల్లెట్‌పై వ్యవసాయ, వివిధ రంగాల ప్రముఖులు చర్చించారు. అపెడా చైర్మన్ అభిషేక్ దేవ్ వర్చువల్ పద్ధతిలో మాట్లాడారు. నాబార్డు సీజీఎంలు మోనోమోయ్ ముఖర్జీ, ఉదయ్ భాస్కర్ తదితరులు మాట్లాడారు.

కవితకు సమన్లు 10 రోజులు వాయిదా వేస్తాం

• సుప్రీంకోర్టుకు తెలిపిన ఈడీ
• తదుపరి విచారణ 26కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సమన్ల జారీని పదిరోజుల పాటు వాయిదా వేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సుప్రీంకోర్టుకు తెలిపింది. మనీలాండరింగ్ అంశంలో మహిళల్ని ఇంటి వద్దే విచారించాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను నళిని చిదంబరం కేసుతో జత చేసిన విషయం విదితమే. ఈ పిటిషన్లు శుక్రవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. విచారణ వాయిదా వేయాలని తొలుత ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు కోరారు. తర్వాత పిటిషనర్‌పై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కవిత తరఫు సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కోరారు. మనీలాండరింగ్ కేసుల్లో మహిళలకు ప్రయోజనం కలిగించేలా ఇచ్చిన పలు చట్టబద్ధమైన సడలింపులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. నళిని చిదంబరం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చేవరకూ విచారణకు హాజరు కావాల్సిందిగా తాము బలవంతం చేయబోమని ఈడీ తెలిపిందని, ఇవే ఆదేశాలు కవిత కూడా కోరుకుంటున్నారని తెలిపారు. కవితకు ఇచ్చిన సమన్లు కూడా నిరవధికంగా వాయిదా వేయాలని కోరారు. దీనిపై ఈడీ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. కవిత ఇప్పటికే రెండుసార్లు విచారణకు హాజరయ్యారని, ఒకవేళ ఆమె బిజీగా ఉండి ఉంటే విచారణను మరో పదిరోజుల పాటు వాయిదా వేస్తామని తెలిపారు. మౌఖికంగా ఇచ్చిన ఈ హామీని పరిగణనలోకి తీసుకున్నట్లుగా ధర్మాసనం ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తదుపరి విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

పరిశ్రమల్లో ఇంధన పొదుపు ప్రాజెక్టులకు వడ్డీ రాయితీ

• రూ.12,000 కోట్ల రాయితీలతో త్వరలో కొత్త పథకం
• బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక రంగంలో ఇంధన పొదుపును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.12,000 కోట్ల వడ్డీ రాయితీలతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనుందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే తెలిపారు. కేంద్ర విద్యుత్, ఆర్థిక శాఖల సహకారంతో బీఈఈ ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులో రూ.6 వేల కోట్లను కేవలం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల కోసం కేటాయించనున్నట్టు ఆయన చెప్పారు. సీఐఐ–గోద్రెజ్ జీబీసీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్–2023లో ఆయన మాట్లాడారు. బీఈఈ, స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎస్ఐడీబీఐ) భాగస్వామ్య ఒప్పందం ద్వారా పారిశ్రామిక ఇంధన పొదుపు ప్రాజెక్టులకు రాయితీ వడ్డీతో రుణాలను అందించడమే ఈ పథకంఉద్దేశమన్నారు. కనీసం 10 శాతం ఇంధన పొదుపును లక్ష్యంగా పెట్టుకునే ప్రాజెక్టులకు ఈ పథకం కింద అర్హత లభిస్తుందన్నారు. కాగా, పరిశ్రమల్లో ఇంధన పొదుపునకు దోహదపడే 150 రకాల టెక్నాలజీలను బీఈఈ ప్రతిపాదించిందని వివరించారు. పరిశ్రమల్లో ఇంధన పొదుపును ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్ (పాట్) పథకం అద్భుత ఫలితాలు సాధించిందన్నారు. లక్ష్యానికి మించి ఇంధన పొదుపును సాధించిన పరిశ్రమలకు బహుమతిగా ఎనర్జీ సేవింగ్ సర్టిఫికెట్లను అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద 13 రంగాల్లోని 1,073 పరిశ్రమలు ప్రయోజనం పొందాయన్నారు. కార్యక్రమంలో సీఐఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటగిరి, ఈఈఎస్ఎల్ సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

సోనియా, రాహుల్‌పై ఈడీ కేసుల్లో కదలికేదీ?: కవిత

• కాంగ్రెస్, బీజేపీ అవగాహన వల్లే విచారణకు పిలవడం లేదా?



సాక్షి, హైదరాబాద్: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే, పవన్ బన్సల్‌తోపాటు ఏపీ, తెలంగాణ నాయకులను ఈడీ పిలిపించి విచారించిందని, ఏడాదిన్నరగా ఈ కేసు విచారణ ఏమైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీకి మధ్య అవగాహన కుదిరినందు వల్లే ఆ తర్వాత కాంగ్రెస్ నాయకులను ఈడీ విచారణకు పిలవడం లేదా అని అనుమానం వ్యక్తం చేశారు. ‘కాంగ్రెస్ ఒక రాష్ట్రంలో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుంటూ మరో రాష్ట్రంలో వారితో కొట్లాడుతారు. ఒక దగ్గర ఆమ్ ఆద్మీ పార్టీతో కొట్లాడుతారు. మరోచోట ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారు. ఇలా బహుళ రాష్ట్రాల్లో బహుళ విధానాలను కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తోంది’అని కవిత ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పారిశ్రామికవేత్త అదానికి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతూ ఇతర రాష్ట్రాల్లో ఆయనను వ్యతిరేకిస్తున్నారని ఎండగట్టారు. రాజకీయ టూరిస్టులను తాము స్వాగతిస్తామని, సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనడానికి వస్తున్నా రాహుల్, సోనియా హైదరాబాదీ బిర్యానీ తిని హ్యాపీగా వెళ్లిపోవాలని, కానీ మోసపూరిత వైఖరితో తెలంగాణ ప్రజానీకాన్ని మధ్యపెట్టవద్దని సూచించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో చర్చించడానికి తొమ్మిది అంశాలను ప్రతిపాదిస్తూ ప్రధాని మోదీకి రాసిన లేఖలో మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి సోనియాగాంధీ ఎందుకు ప్రస్తావించలేదని కవిత ప్రశ్నించారు.

క్లుప్తంగా...

'నోబెల్' నగదు పురస్కారం భారీగా పెంపు

స్టాక్‌హోమ్: నోబెల్ బహుమతి గ్రహీతలకిచ్చే నగదు మొత్తాన్ని ప్రస్తుతమున్న 1 మిలియన్ క్రోనార్ల(రూ.74.80 లక్షల) నుంచి 11 మిలియన్ క్రోనార్ల (రూ.8.15 కోట్ల)కు పెంచుతున్నట్లు నోబెల్ ఫౌండేషన్ శుక్రవారం ప్రకటించింది. ఇటీవలి కాలంలో స్వీడన్ కరెన్సీ క్రోనార్ విలువ పడిపోవడమే ఇందుకు కారణమని ఒక సంక్షిప్త ప్రకటనలో వివరించింది. అమెరికా డాలర్, యూరోలతో పోలిస్తే క్రోనార్ విలువ ఇంత దిగువకు పడిపోవడం ఇదే మొదటిసారి. స్వీడన్‌లో ద్రవ్యోల్బణం ఆగస్టులో 7.2 శాతంగా ఉంది. నోబెల్ బహుమతులను 1901లో మొదటిసారి ప్రదానం చేసినప్పుడు ఒక్కో కేటగిరీకి 1.50 లక్షల క్రోనార్లు అందజేసింది. అప్పటి నుంచి నోబెల్ ఫౌండేషన్ క్రమంగా ఈ మొత్తాన్ని పెంచుకుంటూ వస్తోంది. ఈ ఏడాది నోబెల్ విజేతలను అక్టోబర్‌లో ప్రకటించనుంది.

ప్రిన్సెస్ డయానా స్వెటర్ ధర రూ. 9.14 కోట్లు

లండన్: దివంగత బ్రిటిష్ యువరాణి డయానా ధరించిన స్వెటర్ ఒకటి వేలంలో రికార్డు స్థాయిలో రూ.9.14 కోట్లు పలికింది. రాజ కుటుంబానికి చెందిన వస్తువుకు అంచనాకు మించి ఇంతటి ధర పలకడం ఇదే మొదటిసారి. ప్రముఖ సోథ్‌బీ సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ ఫ్యాషన్ ఐకాన్ సేల్ వేలంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు రూ.9,14,58,510కి ఈ స్వెటర్‌ను సొంతం చేసుకున్నారు. గురువారం ఆఖరి రోజు చివరి 15 నిమిషాల వరకు ఈ స్వెటర్‌కు అత్యధికంగా 1.90 లక్షల డాలర్ల వరకు పలికింది. చివరి నిమిషాల్లో ఒక్కసారిగా 11 లక్షల డాలర్లకు బిడ్ వేశారని సోథ్‌బీ తెలిపింది. జనవరిలో సోథ్‌బీ సంస్థ నిర్వహించిన డయానా ధరించిన బాల్ గౌన్ సైతం రూ.5 కోట్లకు పైగా పలకడం గమనార్హం.

యుద్ధ విమానాల ప్లాంట్‌ను సందర్శించిన కిమ్

సియోల్: రష్యా పర్యటనలో ఉన్న ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ శుక్రవారం యుద్ధ విమానాల ఫ్యాక్టరీని సందర్శించారు. కొమ్సొమోల్స్క్ ఆన్ అముర్‌లోని ఫ్యాక్టరీలో అత్యంత ఆధునిక ఫైటర్ జెట్ ఎస్‌యూ–57ను ఆయన ఆసక్తికరంగా పరిశీలిస్తున్నట్లుగా ఉన్న వీడియోను రష్యా కేబినెట్ విడుదల చేసింది. ఒక ఎస్‌యూ–35 ఫైటర్ జెట్ ల్యాండ్ అయినప్పుడు కిమ్ చప్పట్లు కొడుతున్నట్లుగా ఉంది. కిమ్ సుఖోయ్ ఎస్‌జే–100 ప్యాసింజర్ విమానాల ప్లాంట్‌ను కూడా సందర్శించారని తెలిపింది. కిమ్ వెంట రష్యా ఉప ప్రధాని డెనిస్ మంటురోవ్ ఉన్నారు. బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కిమ్ భేటీ అయ్యారు.



మరో అద్భుతం 'యశోభూమి'

ఢిల్లీలో ప్రపంచ స్థాయి కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్

ఎనిమిది అంతస్తుల్లో కన్వెన్షన్ హాళ్లు, బాల్‌రూమ్, మీటింగ్ రూమ్‌లు

8.9 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన కేంద్ర ప్రభుత్వం

ప్రాచీన కట్టడాలు, దర్శనీయ క్షేత్రాలకు నిలయమైన దేశ రాజధాని ఢిల్లీ కీర్తికిరీటంలో మరో మణిహారం చేరబోతోంది. చూపు తిప్పుకోనివ్వని సుందరమైన, విశాలమైన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్(ఐఐసీసీ) యశోభూమి ప్రారంభానికి సిద్ధమైంది. దేశంలో సభలు, సమావేశాలు, ఎగ్జిబిషన్ల కోసం ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్న ప్రధానమంత్రి సంకల్పం మేరకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో యశోభూమిని అత్యాధునిక పరిజ్ఞానం, అద్భుతమైన వసతులతో నిర్మించింది. ప్రధాన ఆడిటోరియం, కన్వెన్షన్ హాళ్లు, బాల్‌రూమ్, మీటింగ్ రూమ్‌లతో యశోభూమి సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్లలో ఒకటిగా నిలువనుంది. ఎనిమిది అంతస్తుల యశోభూమిలో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్(ఎంఐసీఈ) సదుపాయాలన్నీ ఉన్నాయి. ఐఐసీసీ మొదటి దశను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17వ తేదీన స్వయంగా ప్రారంభించనున్నారు. అలాగే జాతికి అంకితం ఇస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

విశేషాలివీ..

1. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ ప్రాజెక్టు ఏరియా 8.9 లక్షల చదరపు మీటర్లు, బిల్ట్–అప్ ఏరియా 1.8 లక్షల చదరపు మీటర్లు. కన్వెన్షన్ సెంటర్‌ను 73,000 చదరపు మీటర్లకుపైగా వైశాల్యంలో నిర్మించారు.
2. మొత్తం ప్రాజెక్టులో ప్రధాన ఆడిటోరియంతో సహా మొత్తం 15 కన్వెన్షన్ హాళ్లు, ఒక బాల్‌రూమ్, 13 మీటింగ్ రూమ్‌లు ఉన్నాయి.
3. అన్ని గదుల్లో కలిపి ఏకకాలంలో 11,000 మంది ఆసీనులు కావొచ్చు.
4. 6,000 మంది అతిథులు సౌకర్యవంతంగా కూర్చునేలా ప్రధాన ఆడిటోరియం(ప్లీనరీ హాల్) నిర్మించారు. ఆటోమేటెడ్ సీటింగ్ సిస్టమ్ ఉంది.
5. అందమైన సీలింగ్‌తో ఆకట్టుకుంటున్న బాల్‌రూమ్ సీటింగ్ సామర్థ్యం 2,500. ఇక్కడే మరో 500 మంది కోసం ఓపెన్ ఏరియా ఉంది.
6. అలాగే 1.07 లక్షల చదరపు మీటర్ల వైశాల్యంలో ఎగ్జిబిషన్ హాళ్లు ఉన్నాయి.
7. మీడియా రూమ్‌లు, వీవీఐపీ గదులు, విజిటర్ ఇన్ఫర్మేషన్ సెంటర్, టికెటింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు.
8. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఇక్కడ వర్షం నీటిని, మురుగు నీటిని శుద్ధి చేసుకొని మళ్లీ ఉపయోగించుకునే ఏర్పాట్లున్నాయి.
9. సౌర విద్యుత్ కోసం రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్లు బిగించారు. ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంలో భారతీయ సంస్కృతి, కళలకు పెద్దపీట వేశారు.
10. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ భారత పరిశ్రమల సమాఖ్యకు చెందిన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) నుంచి గ్రీన్ సిటీస్ ప్లాటినమ్ సర్టిఫికేషన్ పొందింది.









జాహ్నవికి న్యాయం జరగాల్సిందే

భారత అమెరికన్ చట్ట సభ్యుల డిమాండ్

వాషింగ్టన్: అమెరికాలో పోలీసుల నిర్లక్ష్యంతో జరిగిన కారు ప్రమాదానికి బలైపోవడమే గాక మరణానంతరం కూడా వాళ్ల చేతుల్లో జాత్యహంకార హేళనకు గురైన తెలుగు యువతి జాహ్నవి కందుల ఉదంతాన్ని అక్కడి భారతీయ చట్ట సభ్యులు సీరియస్‌గా తీసుకున్నారు. వాషింగ్టన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ స్టూడెంట్ అయిన 23 ఏళ్ల జాహ్నవి గత జనవరిలో సియాటెల్‌లో రోడ్డు దాటుతుండగా పోలీసు వాహనం ఢీ కొని మరణించడం తెలిసిందే. 25 మైళ్ల స్పీడ్ లిమిట్ ఉన్న చోట సదరు వాహనం ఏకంగా 74 మైళ్ల వేగంతో దూసుకురావడమే ప్రమాదానికి కారణమని తేలింది. కానీ డేనియల్ ఆడరర్ అనే సియాటెల్ పోలీసు అధికారి ఈ ఉదంతంపై చేసిన అత్యంత అనుచిత వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'అయితే ఏమయిందిప్పుడు?! ఆమెకు ఆల్రెడీ 26 ఏళ్లు. అంత విలువైనదేమీ కాదు. ఏ 11 వేల డాలర్లకో ఓ చెక్కు రాసి పారేయండి' అంటూ అతనన్న మాటలు బాడీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. అతనిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, సియాటిల్ సిటీ కౌన్సిల్ సభ్యురాలు క్షమా సావంత్ తదితరులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా పోలీసుల్లో జాత్యహంకారం ఎంతగా జీర్ణించుకుపోయిందో చెప్పేందుకు ఈ ఉదంతం మరో నిదర్శనమని వారన్నారు. డేనియల్‌పై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం డిమాండ్ చేశారు. 'జాహ్నవి దుర్మరణానికి కారకులైన పోలీసులే ఆమె జీవితం విలువే లేనిదంటూ అంత నీచంగా మాట్లాడటం వింటే చెప్పరానంత జుగుప్స కలుగుతోంది. జాతి విద్వేషం, జాత్యహంకారం అమెరికాలో ఆమోదనీయత పొందుతున్నాయనేందుకు ఇది సంకేతం. ఈ చెడు ధోరణికి తక్షణం అడ్డుకట్ట పడాలి' అని కృష్ణమూర్తి అన్నారు. ఈ ఉదంతం మీద పూర్తి అధికారాలతో కూడిన పౌర సంఘ సభ్యుల కమిటీ వేసి స్వతంత్రంగా విచారణ జరిపించాలని సావంత్ కోరారు. డేనియల్ మీద 2014 నుంచి కనీసం 18 విచారణలు జరిగితే అతన్ని ఒక్క దాంట్లోనూ శిక్షించకపోవడం దారుణమన్నారు. పోలీసులే ఇంతటి నోటి దురుసుతో జాత్యహంకార వ్యాఖ్యలకు పాల్పడ్డ ఇలాంటి హై ప్రొఫైల్ కేసులో కూడా విచారణను ఆర్నెల్లు సాగదీయడం, రివ్యూ పేరిట ఏడాది దాకా లాగడం క్షమించరానిదని సౌత్ సియాటెల్ సిటీ కౌన్సిల్ సభ్యుడు టామీ జె.మోరల్స్ ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అమెరికన్ అసోసియేషన్స్ కూడా ఒక ప్రకటనలో కోరింది. వందలాది మంది గురువారం సియాటిల్‌లో నిరసన ప్రదర్శన కూడా చేశారు. దోషులైన పోలీసులకు శిక్ష పడి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు.

జాహ్నవికి మరణానంతరం డిగ్రీ

అమెరికాలో పోలీసు వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిన తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవికి మరణానంతరం డిగ్రీ ప్రదానం చేయనున్నట్లు నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రకటించింది. మాస్టర్స్ డిగ్రీ పట్టాను జాహ్నవి కుటుంబ సభ్యులకు అందజేస్తామని వెల్లడించింది. జాహ్నవి మృతి పట్ల నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ చాన్సలర్ సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

నివేదిక ఇవ్వడం నేరం కాదు

ఎడిటర్స్ గిల్డ్ కేసులో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా(ఈజీఐ) సభ్యులిచ్చిన నివేదికలోని అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ నివేదికలో వివిధ వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించే అంశం ఏమీ కనిపించడం లేదని పేర్కొంది. ఒక తప్పుడు ప్రకటన రాజ్యాంగంలో 153ఏ ప్రకారం నేరం కాదని స్పష్టం చేసింది. అది భావ ప్రకటన స్వేచ్ఛ కిందికి వస్తుందని వివరించింది. దేశంలో ఎందరో జర్నలిస్టులు నిత్యం ఇలాంటి అసత్య ప్రకటనలు చేస్తుంటారు. వారందరిపైనా అభియోగాలు మోపుతారా అని పోలీసులను ప్రశ్నించింది. ఈ కేసులో ఈజీఐకి చెందిన నలుగురు సభ్యులకు పోలీసు అరెస్టు నుంచి ఇచ్చిన రక్షణను మరో రెండు వారాలు పొడిగిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈజీఐ సభ్యులపై నమోదైన కేసును ఎందుకు కొట్టివేయరాదని మణిపూర్ పోలీసులను ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టులకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చే హక్కు ఉంటుందన్నారు. మణిపూర్ హింసపై నిజ నిర్ధారణలో భాగంగా నలుగురు సభ్యుల ఈజీఐ అక్కడికి వెళ్లి సెప్టెంబర్ 2న ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ఘర్షణలను ప్రేరేపించేదిగా ఉందంటూ పోలీసులు ఈజీఐకి చెందిన నలుగురు సభ్యులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

లిబియా మరణాలు..11 వేలకు పైనే

డెర్నా: లిబియాలోని డెర్నాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య శుక్రవారానికి 11 వేలు దాటింది. జాడ తెలియకుండా పోయిన మరో 10 వేల మంది కోసం అన్వేషణ ముమ్మరంగా సాగుతోంది. నివాస ప్రాంతాలను తుడిచిపెట్టిన మట్టి, బురద తొలగింపు పనులు సాగుతున్నాయి. సోమవారం సంభవించిన భారీ వర్షాలు, వరదలతో ఎగువనున్న రెండు జలాశయాలు బద్దలై ఒక్కసారిగా డెర్నా నగరాన్ని నీటి ప్రవాహం ముంచెత్తిన విషయం తెలిసిందే.

జై హింద్ పాపా!



నాన్న నీకు ఇదే నా జోహార్, తండ్రి పార్థివ దేహానికి సెల్యూట్ చేస్తున్న కబీర్

- వీర జవానుకు కొడుకు తుది సెల్యూట్
- అశ్రు నయనాల నడుమ కల్నల్ మన్ ప్రీత్ సింగ్ అంత్యక్రియలు
- యుద్ధ వీరుని యూనిఫాంలో పాల్గొన్న ఆరేళ్ల కొడుకు కబీర్
- అంతులేని దుఃఖాన్ని అదిమిపెట్టి మరీ తండ్రికి వీరోచితంగా వీడ్కోలు
- బరువెక్కిన హృదయాలు, కంటతడి పెట్టిన నయనాలు

చండీగఢ్: వయసు నిండా ఆరేళ్లే. ఇంకా ముక్కు పచ్చలే ఆరలేదు. కళ్లెదుట కన్న తండ్రి పార్థివ దేహం. అయినా సరే, వీర మరణం పొందిన తండ్రికి అంతే వీరోచితమైన వీడ్కోలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాడో ఏమో.. అంతటి అంతులేని దుఃఖాన్నీ పళ్ల బిగువున అదిమిపెట్టాడు. యుద్ధానికి సిద్ధమయ్యే సైనిక వీరుల యూనిఫాం ధరించాడు. త్రివర్ణ పతాకం కప్పి ఉన్న తండ్రి శవపేటికను మౌనంగా సమీపించాడు. ఆ పేటికనే చిట్టి చేతులతో బిగియారా కౌగిలించుకున్నాడు. ఆ సమయాన ఆ చిన్ని మనసులో ఎన్ని అగ్ని పర్వతాలు బద్దలయ్యాయో! ఎన్నెన్ని భావాలు చెలరేగాయో! ఎంతటి దుఃఖం పొంగుకొచ్చిందో! అవేవీ పైకి కనిపించనీయలేదు. కన్నీటిని కనీసం కంటి కొసలు కూడా దాటి రానివ్వలేదు. తండ్రి పార్థివ దేహం ముందు సగౌరవంగా ప్రణమిల్లాడు. రుద్ధమైన కంఠంతోనే, 'జైహింద్ పాపా' అంటూ తుది వీడ్కోలు పలికాడు. అందరినీ కంట తడి పెట్టించాడు...!

చండీగఢ్: కశ్మీర్ లోయలో ఉగ్ర ముష్కరులను ఏరిపారేసే క్రమంలో వీర మరణం పొందిన సైనిక వీరులు కల్నల్ మన్ ప్రీత్ సింగ్, మేజర్ ఆశిష్ దోంచక్ అంత్యక్రియలు శుక్రవారం అశ్రు నయనాల నడుమ ముగిశాయి. పంజాబ్‌లోని మొహాలీ జిల్లాలో మన్‌ప్రీత్ స్వగ్రామం బహరౌన్ జియాన్‌లో ఉదయం నుంచే సందర్శకుల ప్రవాహం మొదలైంది. చూస్తుండగానే జనం ఇసుకేస్తే రాలనంతగా పెరిగిపోయారు. వారందరి సమక్షంలో పూర్తి సైనిక లాంఛనాల నడుమ మన్ ప్రీత్ అంత్యక్రియలు ముగిశాయి. ఈ సందర్భంగా కుమారుడు కబీర్ సింగ్ కనబరిచిన గుండె దిటవు, 'జైహింద్ పాపా' అంటూ తండ్రికి తుది సెల్యూట్ చేసిన తీరు అందరినీ కంట తడి పెట్టించింది. గవర్నర్ భన్వారీలాల్ పురోహిత్ తో పాటు రాష్ట్ర మంత్రులు, మాజీ సైనికాధిపతి వేదప్రకాశ్ మాలిక్, సైనిక ఉన్నతాధికారులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మేజర్ ఆశిష్ అంత్యక్రియలు కూడా హరియాణాలోని పానిపట్‌లో పూర్తి సైనిక లాంఛనాలతో జరిగాయి. బుధవారం కశ్మీర్‌లోని కోకెర్ నాగ్ ప్రాంతంలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కల్నల్ మన్ ప్రీత్, మేజర్ ఆశిష్‌తో పాటు మొత్తం ముగ్గురు సైనిక సిబ్బంది, ఒక డీఎస్పీ అసువులు బాయడం తెలిసిందే.

గుండెలవిసేలా రోదించిన భార్య

మన్ ప్రీత్ అంత్యక్రియల సందర్భంగా గుండెలవిసేలా రోదించిన ఆయన భార్యను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గవర్నర్, మంత్రులు తదితరులు మన్ ప్రీత్ భార్య, తల్లి తదితరులను ఓదార్చారు. అంత్యక్రియల సందర్భంగా భారత్ మాతా కీ జై నినాదాలతో ఊరంతా మారుమోగింది. మన్ ప్రీత్ చిన్నప్పటి నుంచే అసాధారణ ప్రతిభావంతుడని ఆయన చిన్ననాటి గురువులు గుర్తు చేసుకున్నారు. తమ అభిమాన శిష్యుని అంత్యక్రియల సందర్భంగా వారంతా వెక్కి వెక్కి రోదించారు. 'మేము వర్ణనాతీతమైన బాధ అనుభవిస్తున్నాం. అదే సమయంలో, దేశం కోసం ప్రాణాలను ధార పోసిన మా శిష్యుణ్ణి చూసి గర్వంగానూ ఉంది' అని మన్‌ప్రీత్‌కు ఒకటో తరగతిలో పాఠాలు చెప్పిన ఆశా చద్దా అనే టీచర్ చెప్పారు.

మూడో తరం సైనిక వీరుడు

మన్‌ప్రీత్ తన కుటుంబంలో మూడో తరం సైనిక వీరుడు. ఆయనత తాత సైన్యంలో పని చేశారు. ఆయన తండ్రి సైన్యం నుంచి రిటైరయ్యాక తొమ్మిదేళ్ల క్రితం మరణించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తల్లి తన కుమారుని పార్థివ దేహం కోసం ఉదయం నుంచే ఇంటి ముందు వేచి చూస్తూ గడిపింది. సైనిక వాహనం నుంచి శవపేటిక దిగగానే కుప్పకూలింది!

ఏబీసీ చైర్మన్‌గా శ్రీనివాసన్ కె. స్వామి ఎన్నిక



న్యూఢిల్లీ: 2023–24 సంవత్సరానికి గాను ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ) చైర్మన్‌గా ఆర్.కె.స్వామి హంస గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీనివాసన్ కె.స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం ఆసియన్ ఫెడరేషన్ ఆఫ్ అడ్వర్‌టైజింగ్ అసోసియేషన్స్ చైర్మన్‌గా పని చేస్తున్నారు. గతంలో ఇంటర్నేషనల్ అడ్వర్‌టైజింగ్ అసోసియేషన్(ఐఏఏ)–ఇండియా చాప్టర్ ప్రెసిడెంట్/చైర్మన్‌గా సేవలందించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆసియన్ అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీ అసోసియేషన్స్, అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, అడ్వర్‌టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేసన్, మద్రాస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ చైర్మన్‌గాను పనిచేశారు. శ్రీనివాసన్ కె.స్వామిని అడ్వర్‌టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ డిప్యూటీ చైర్మన్‌గా రియాద్ మాథ్యూ, గౌరవ కార్యదర్శిగా మోహిత్ జైన్, గౌరవ కోశాధికారిగా విక్రమ్ సఖూజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

'ఇండియా' కూటమికి ఎన్‌బీడీఏ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: వివిధ టీవీ చానళ్లకు చెందిన కొందరు జర్నలిస్టులు/యాంకర్లు నిర్వహించే కార్యక్రమాలకు, వేదికలకు తమ ప్రతినిధులను పంపించకూడదని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి మీడియా కమిటీ తీసుకున్న నిర్ణయం పట్ల న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్(ఎన్‌బీడీఏ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి నిర్ణయం ఆందోళనకరమని ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా నడుచుకోవడం సరైంది కాదని పేర్కొంది. గతంలో ఇలాంటి పరిణామం ఎనాడూ సంభవించలేదని గుర్తుచేసింది. ప్రమాదకరమైన ఈ ధోరణిని మానుకోవాలని ఇండియా కూటమికి విజ్ఞప్తి చేసింది. మీడియా స్వేచ్ఛను గౌరవించాలని కోరింది. కొందరు జర్నలిస్టులను/యాంకర్లను బహిష్కరించడం అనేది దేశాన్ని అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) నాటి రోజుల్లోకి తీసుకెళ్తుందని ఎన్‌బీడీఏ స్పష్టం చేసింది. మీడియాపై విరుచుకుపడితే స్వతంత్ర భావాల వ్యక్తీకరణను, గొంతుకలను అణచివేసినట్లే అవుతుందని తెలియజేసింది. ఈ బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇండియా కూటమికి సూచించింది.

ఆదిత్య -ఎల్1 కక్ష్య దూరం మళ్లీ పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈనెల 2న ప్రయోగించిన ఆదిత్య -ఎల్1 ఉపగ్రహానికి శుక్రవారం నాలుగో విడత కక్ష్య దూరాన్ని పెంచారు. బెంగళూరులోని ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), మారిషస్, అండమాన్ నికోబార్ దీవుల్లోని పోర్టుబ్లెయిర్ గ్రౌండ్‌స్టేషన్ల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఉపగ్రహంలో అపోజి ఇంధనాన్ని మండించి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. మూడో విడతలో 296×71,767 కిలోమీటర్ల దీర్ఘవృత్తాకార కక్ష్యలో భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న సమయంలో నాలుగో విడుతలో భూమికి దగ్గరగా ఉన్న 296 కిలోమీటర్ల దూరాన్ని 256 కిలోమీటర్లకు తగ్గిస్తూ భూమికి దూరంగా ఉన్న 71,767 దూరాన్ని 1,21,973 కిలోమీటర్లకు పెంచారు. ఈనెల 19న అయిదోసారి కక్ష్య దూరం పెంపుదలలో భాగంగా ఆదిత్య -ఎల్1 ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యనుంచి సూర్యుడికి దగ్గరగా లాంగ్రేజియన్ పాయింట్–1 వద్ద హాలో కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

లిఫ్ట్ కుప్పకూలి నలుగురు కార్మికులు మృతి

నోయిడా: గ్రేటర్ నోయిడాలోని నిర్మాణంలో ఉన్న భవనంలో లిఫ్ట్ కుప్పకూలి నలుగురు కార్మికులు మృత్యువాతపడ్డారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆమ్రపాలి డ్రీమ్ వ్యాలీ సొసైటీలో శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సర్వీస్ లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్ నుంచి కార్మికులతో బయలుదేరి వెళ్తూ 14వ ఫ్లోర్ నుంచి అకస్మాత్తుగా జారుకుంటూ వచ్చి వేగంగా నేలను ఢీకొట్టింది. దీంతో లిఫ్ట్‌లోని నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా యూపీ, బిహార్‌లకు చెందిన వలసకార్మికులని పోలీసులు తెలిపారు.

మణిపూర్ హింసాకాండలో 175 మంది బలి

- 32 మంది అదృశ్యం..
  1,108 మందికి గాయాలు
- 4,786 ఇళ్లు దహనం..
- మణిపూర్ పోలీసుల ప్రకటన

ఇంఫాల్: జాతుల మధ్య ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అట్టుడుకుతోంది. ఈ ఏడాది మే నెలలో హింసాకాండ మొదలైంది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనల్లో ఇప్పటిదాకా 175 మంది మరణించారని, 32 మంది అదృశ్యమయ్యారని, 1,108 మంది గాయపడ్డారని మణిపూర్ పోలీసు శాఖ వెల్లడించింది. మరణించిన 175 మందిలో 96 మృతదేహాలను వారి కుటుంబ సభ్యులు ఇంకా తీసుకెళ్లలేదని, అవి వివిధ ఆసుపత్రుల్లో మార్చురీలోనే ఉన్నాయని పేర్కొంది. అలాగే 9 మృతదేహాలను గుర్తించలేదని వివరించింది. దాడులు, ప్రతి దాడుల్లో 4,786 ఇళ్లు దహనమయ్యాయని తెలియజేసింది. మణిపూర్‌లో హింస మొదలైనప్పటి నుండి ఆయుధగారాల నుంచి 5,668 ఆయుధాలను దుండగులు ఎత్తుకెళ్లారు. వీటిలో 1,329 ఆయుధాలను భద్రతా బలగాలు మళ్లీ స్వాధీనం చేసుకున్నాయి. అల్లరి మూకల నుంచి భారీగా మందుగుండు సామగ్రి, బాంబులను కూడా అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. గృహ దహనాలకు సంబంధించి పోలీసులు 5,172 కేసులు నమోదు చేశారు. హింసాకాండకు సంబంధించి మొత్తం 9,332 కేసులు నమోదు చేశారు. 325 మందిని అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలో శాంతియుత పరిస్థితులను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నామని మణిపూర్ పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

అస్సాం రైఫిల్స్‌ను ఉపసంహరించాలి

తమ రాష్ట్రం నుంచి అస్సాం రైఫిల్స్ దళాలను వెంటనే ఉపసంహరించాలని మణిపూర్ పౌర సమాజ సంస్థలతో కూడిన మణిపూర్ సమగ్రతపై సమన్వయ కమిటీ(కాకోమీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. అస్సాం రైఫిల్స్ జవాన్లు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాకోమీ ప్రతినిధులు తాజాగా ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు.

కరోనా కంటే నిఫాతోనే మరణాల రేటు ఎక్కువ

ఐసీఎంఆర్ డీజీ రాజీవ్ బహల్ వెల్లడి

న్యూఢిల్లీ: కోవిడ్–19 ఇన్ఫెక్షన్‌తో పోలిస్తే నిఫా వైరస్‌తో మరణాల రేటు చాలా ఎక్కువగా ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ చెప్పారు. నిఫా వైరస్ కేసుల్లో మరణాల రేటు 40 శాతం నుంచి 70 శాతం దాకా ఉంటోందన్నారు. అదే కోవిడ్‌లో అయితే 2–3 శాతం మధ్యనే ఉందని వివరించారు. కేరళలో నిఫా కేసుల్లో పెరుగుదల నమోదు అవుతుండటంతో ఈ వైరస్‌ను కట్టడి చేసేందుకు ఆస్ట్రేలియా నుంచి మోనోక్లోనల్ యాంటీబాడీ 20 డోసులు తెప్పించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. జంతువుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకుతుంది. కలుషిత ఆహారం లేక ఒకరి నుంచి మరొకరికి కూడా ఇది సోకుతుంది. నిఫా వైరస్‌తో ఇప్పటికే కేరళలో ఇద్దరు చనిపోయారు. మరో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. యాంటీబాడీ డోసుల కొనుగోలుపై రాజీవ్ బహల్ స్పందిస్తూ..ఆస్ట్రేలియా నుంచి 2018లో తెప్పించిన కొన్ని డోసులు ఇప్పటికీ ఉన్నాయనీ, అవి 10 మంది బాధితులకు మాత్రమే సరిపోతాయని వివరించారు. భారత్ కాకుండా విదేశాల్లో ఇప్పటి వరకు 14 మందికి మాత్రమే ఈ వైరస్ సోకిందన్నారు. వీరికి మోనోక్లోనల్ యాంటీబాడీలను ఇవ్వగా అందరూ సురక్షితంగా బయటపడ్డారని చెప్పారు. 'అయితే, ఈ యాంటీబాడీలను ప్రారంభదశలో ఉన్న వారికే వాడుతున్నారు. వీటితో చికిత్సపై నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం, వైద్యులు, వైరస్ బాధితుల కుటుంబాలకే వదిలేశాము. మోనోక్లోనల్ యాంటీబాడీలతో విదేశాల్లో భద్రతను నిర్ధారించే ఫేజ్–1 ట్రయల్ మాత్రమే జరిగింది. సామర్థ్యాన్ని నిర్ధారించే ట్రయల్స్ జరగలేదు. అందుకే దీనిని 'కారుణ్య వినియోగ ఔషధం'గా మాత్రమే వాడుతున్నారు' అని రాజీవ్ వివరించారు.

కర్ణాటకలో ఘనంగా రాజ్యాంగ పీఠిక పఠనం

బెంగళూరు: అంతర్జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని కర్ణాటక ప్రభుత్వం శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికను చదివే కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి ఏకకాలంలో లక్షలాది మంది పాల్గొన్నారు. బెంగళూరు విధానసౌధ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు ఇతర అతిథులు రాజ్యాంగ పీఠికను కన్నడ భాషలో స్వయంగా పఠించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో నిత్యం ఉదయం ప్రార్థన సమయంలో రాజ్యాంగ పీఠికను తప్పనిసరిగా చదవాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జూన్‌లో ఉత్తర్వులు జారీ చేసింది.

ముగిసిన ఈడీ డైరెక్టర్ పదవీకాలం

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్‌గా సంజయ్‌కుమార్ మిశ్రా పదవీకాలం శుక్రవారం ముగిసింది. ఆయన స్థానంలో రాహుల్ నవీన్‌ను ఇంఛార్జి డైరెక్టర్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1993 ఐఆర్ఎస్ ఆఫీసర్ అయిన రాహుల్ నవీన్ ఈడీకి రెగ్యులర్ డైరెక్టర్ నియమితులయ్యే దాకా పదవిలో కొనసాగుతారని వెల్లడించింది. రాహుల్ నవీన్ ప్రస్తుతం ఈడీలోనే స్పెషల్ డైరెక్టర్ హోదాలో కొనసాగుతున్నారు. సంజయ్‌కుమార్ మిశ్రాకు గతంలో రెండు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వం ఏడాది చొప్పున పొడగింపు ఇవ్వగా సుప్రీంకోర్టు తప్పుపట్టిన విషయం తెలిసిందే. మరోసారి పొడగింపు కుదరదని తేల్చిచెబుతూ సెప్టెంబరు 15 దాకా గడువిచ్చింది. అది పూర్తి కావడంతో శుక్రవారం రాహుల్ నవీన్‌ను ఇంఛార్జిగా నియమిస్తూ కేంద్రం ఆదేశాలు వెలువరించింది.


నేడే 'పాలమూరు' ఎత్తిపోత

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్

ప్రతిష్టాత్మక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి అప్రోచ్ కాల్వ ద్వారా నార్లాపూర్ ఇన్‌టేక్ వెల్‌కు చేరుకునే కృష్ణా జలాలను.. స్విచ్ నొక్కడం ద్వారా 104 మీటర్లు పైకి ఎత్తి సమీపంలోని నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి పోసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. ఆ వెంటనే నార్లాపూర్ రిజర్వాయర్ వద్దకు చేరుకుని అక్కడికి చేరుకున్న కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తర్వాత కొల్లాపూర్ పట్టణ శివారులో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు.

– సాక్షి, హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నమూనా



8 రోజులు.. 2 టీఎంసీలు

శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి దక్షిణ తెలంగాణలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితో పాటు 1,200 గ్రామాలకు తాగునీటిని అందించడానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించింది. ఇందులో భాగంగా 6.4 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో చేపట్టిన నార్లాపూర్ రిజర్వాయర్ పనులు పాక్షికంగానే పూర్తయ్యాయి. నార్లాపూర్ వద్ద 145 మెగావాట్ల భారీ సామర్థ్యంతో 8 బాహుబలి పంపులను ఏర్పాటు చేయాల్సి ఉండగా, 3 పంపుల పనులు మాత్రమే చేపట్టారు. అందులో ఒక పంపు ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటి ఎత్తిపోతను కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఒక పంపు ద్వారా 8 రోజుల పాటు నీళ్లను ఎత్తిపోసి 2 టీఎంసీలను రిజర్వాయర్‌లో నిల్వ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెండో స్టేజీ లిఫ్టులో భాగంగా నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీళ్లను ఎత్తిపోసే అంశంపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ప్రాజెక్టు తొలి విడతలో భాగంగా ఐదు స్టేజీల్లో నీళ్లను ఎత్తిపోసి మొత్తం 67.52 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న ఆరు రిజర్వాయర్లలో వేయాల్సి ఉండగా, ఆ మేరకు పనులు పూర్తి కాలేదు. పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు, కాల్వలు, సొరంగాల పనులు 80 శాతం పూర్తయ్యాయని నీటిపారుదల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.35,200 కోట్లు కాగా గత మార్చి నాటికి రూ.23,684 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.

రెండో విడత ప్రాజెక్టు చేపడితేనే సాగునీరు...

ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 5 రిజర్వాయర్లలో కొంతమేరకు నీళ్లను నింపి పెట్టుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. (చివరిదైన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను ప్రభుత్వం అనధికారికంగా విరమించుకుంది). అయితే రిజర్వాయర్ల నుంచి నీళ్లను తాగు, సాగునీటి అవసరాలకు తరలించేందుకు అవసరమైన కాల్వలు, డి్స్ట్రిబ్యూటరీల నిర్మాణం పనులను ఇంకా ప్రారంభించలేదు. పర్యావరణ అనుమతులు లభించిన తర్వాత ఈ పనులను రెండో విడతలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందువల్ల ప్రాజెక్టును ప్రారంభించినా తక్షణ ప్రయోజనాలు ఉండవు. రెండో విడత పనులు పూర్తైన తర్వాతే ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

మహా బాహుబలి మోటార్లు.. కాళేశ్వరం రికార్డు బద్దలు

'పాలమూరు-రంగారెడ్డి' విశిష్టతలెన్నో..

- ఆయకట్టు:12.30 లక్షల ఎకరాలు
- జల వనరు: శ్రీశైలం జలాశయం
- ప్రతిరోజూ లిఫ్ట్ చేసే జలాలు: 1.50 టీఎంసీలు
- లిఫ్టుల స్టేజ్‌లు: 5
- రిజర్వాయర్ల సంఖ్య: 6
- నీటినిల్వ సామర్థ్యం: 67.52 టీఎంసీలు
- పంపుల గరిష్ట సామర్థ్యం: 145 మెగావాట్లు
- నీటిని లిఫ్ట్ చేసే గరిష్ట ఎత్తు: 672 మీటర్లు
- సొరంగ మార్గం పొడవు: 61.57 కిలోమీటర్లు
- ప్రధాన కాలువల పొడవు: 915.47 కిలోమీటర్లు
- తాగునీటికి వినియోగం: 7.15 టీఎంసీలు
- పరిశ్రమలకు కేటాయింపులు : 3 టీఎంసీలు
- సాగునీటికి కేటాయింపులు : 79.00 టీఎంసీలు

నాలుగు పంప్‌హౌసుల్లో 145 మెగావాట్ల భారీ సామర్థ్యం కలిగిన మొత్తం 34 పంపులను ఏర్పాటు చేయడం ప్రపంచంలో ఇదే ప్రథమం. ఇందులో 3 పంపులను అత్యవసర సమయాల్లో స్టాండ్‌బైగా వినియోగించనున్నారు.

మోటార్లను దేశీయ దిగ్గజ కంపెనీ, కేంద్ర ప్రభుత్వ సంస్థ బీహెచ్ఈఎల్ తయారు చేయడం విశేషం

ఏదుల పంప్‌హౌస్ వద్ద ఆసియాలోనే అతిపెద్దదైన సర్జ్ పూల్

అత్యధిక సామర్థ్యం గల పంపుల వినియోగంలో కాళేశ్వరం రికార్డు బద్దలు.

145 మెగావాట్ల సామర్థ్యం గల మహా బాహుబలి మోటార్ల వినియోగం

కలశాల్లో గ్రామాలకు కృష్ణా జలాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: సీఎం కేసీఆర్ శనివారం నార్లాపూర్ జలాశయం వద్ద కృష్ణా జలాల్లోకి పూలు వదిలి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తర్వాత పాలమూరులోని అన్ని గ్రామ పంచాయతీలకు కృష్ణా జలాలను కలశాల్లో పంపిణీ చేయన్నారు. ఈ ప్రక్రియలో ఆయా మండలాల ఎంపీడీఓలు, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాలుపంచుకోనున్నారు. కృష్ణా జలాలతో పాలమూరు వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని దేవతామూర్తులకు అభిషేకం చేయాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

4 గంటల పాటు కేసీఆర్ పర్యటన

కేసీఆర్ హైదరాబాద్ నుంచి ఉదయం బస్సులో బయలుదేరతారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి సమీపంలోని తేజ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తారు. 3 గంటలకు నార్లాపూర్ పంపుహౌస్‌కు చేరుకుని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు స్టేజ్-1లోని మొదటి మోటారును ప్రారంభిస్తారు. 3.50 గంటలకు అక్కడి నుంచి కొల్లాపూర్‌కు బయలుదేరుతారు. 4.30 గంటలకు సింగోటం చౌరస్తాలోని బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. 5.30 గంటలకు సభ ముగిసిన తర్వాత రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు తిరిగి వెళతారు.

రిమాండ్ ఖైదీలకు వారానికి రెండే ములాఖత్‌లు

- చంద్రబాబుకు రెండు ములాఖత్‌లు ముగిశాయి
- అందుకే మూడో ములాఖత్ కోసం భువనేశ్వరి దరఖాస్తు తిరస్కరణ
- జైళ్ల శాఖ ప్రకటన

సాక్షి, రాజమహేంద్రవరం/సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు వారానికి గరిష్ట పరిమితి మేరకు రెండుసార్లు ములాఖత్‌లకు అవకాశం ఇచ్చామని జైళ్ల శాఖ తెలిపింది. అందుకే నారా భువనేశ్వరి ఈ వారంలోనే మూడోసారి ములాఖత్ కోసం చేసిన దరఖాస్తును తిరస్కరించినట్టు వెల్లడించింది. చంద్రబాబుతో ఆయన సతీమణి భువనేశ్వరి ములాఖత్‌కు జైళ్ల శాఖ ఏకపక్షంగా తిరస్కరించినట్టు టీడీపీ విమర్శించడం పూర్తిగా నిరాధారమని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. రిమాండ్ ఖైదీలకు వారానికి గరిష్టంగా రెండుసార్లు ములాఖత్‌కు అవకాశం ఇస్తామని, ప్రతి ములాఖత్‌లో గరిష్ఠంగా ముగ్గురు వ్యక్తులు రిమాండ్ ఖైదీని కలిసేందుకు అవకాశం ఉంటుందని జైళ్ల శాఖ పేర్కొంది. ఆ ప్రకారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుతో ఈ వారంలోనే మొదట ములాఖత్‌గా 12వ తేదీన ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి కలిసి వెళ్లారని తెలిపింది. రెండో ములాఖత్‌గా ఈ నెల 14న లోకేశ్, నందమూరి బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ ఆయనతో భేటీ అయ్యారని వెల్లడించింది. దాంతో ఈ వారంలో రెండు ములాఖత్‌లు పూర్తయినట్టు స్పష్టంచేసింది. అందుకే శుక్రవారం (15న) ములాఖత్ కోసం భువనేశ్వరి చేసిన దరఖాస్తును నిబంధనల ప్రకారమే తిరస్కరించామని వివరించింది. అదే విషయాన్ని నారా భువనేశ్వరికి లిఖితపూర్వకంగా తెలిపామని జైళ్ల శాఖ వెల్లడించింది.

బాబు రిమాండ్ ఐదు రోజులు పూర్తి

చంద్రబాబు జైలు జీవితం ఐదు రోజులు పూర్తయింది. ఎప్పటిలాగే శుక్రవారం కూడా జైలులో ఆయన దినచర్య సాగింది. ప్రస్తుతం లోకేశ్ ఢిల్లీ పర్యటనలో ఉండగా.. భువనేశ్వరి, బ్రాహ్మణి రాజమహేంద్రవరంలోనే ఉన్నారు. కాగా, జైలులో చంద్రబాబును హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ కలిశారు. ఈ సందర్భంగా కేసుకు సంబంధించిన విషయాలపై చర్చించినట్లు సమాచారం.

రామోజీ పైశాచికత్వం

రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ లీవుపై 'ఈనాడు' సైకో రాతలు

సాక్షి- అమరావతి: 'ఈనాడు' పత్రిక, దాన్ని నడిపిస్తున్న రామోజీరావు ఇంత పైశాచికంగా ఆలోచిస్తున్నారెందుకు? తెలుగుదేశం పార్టీ దారుణంగా దిగజారిపోయి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని 'ఈనాడు' కూడా తన సొంత స్టోరీల మాదిరిగా రాస్తూ ఎందుకింత నీచానికి ఒడిగడుతోంది? ఒక జైలు సూపరింటెండెంటు... అనారోగ్యంతో ఉన్న తన భార్య ఆరోగ్యం విషమించిందని తెలుసుకుని అప్పటికప్పుడు సెలవు పెట్టి వెళితే దానిక్కూడా ఊహలు, అతిశయోక్తులు జోడించి 'రాజమండ్రి జైల్లో ఏం జరుగుతోంది?' అంటూ కథనాన్ని వండేశారంటే ఏమనుకోవాలి? చంద్రబాబుతో, పవన్ కల్యాణ్, లోకేశ్, బాలకృష్ణ ములాఖత్ అయిన కాసేపటికే జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవు పెట్టారని, ప్రభుత్వ పెద్దలు బలవంతంగా సెలవుపై పంపించటం వల్లే ఇదంతా జరుగుతోందని, జైలును కుట్రలకు కేంద్రంగా మారుస్తున్నారని... ఇలా చేతికొచ్చిన అక్షరాలన్నిటినీ రాసేసింది. దాన్నే తెలుగుదేశం పార్టీ తన విషప్రచారానికి వాడుకుంటోంది. జనం మెదళ్లలో వీలైనంత విషం నింపటానికి ఎల్లో ముఠాలన్నీ ఒక్కటై సాగిస్తున్న ఈ దుష్ప్రచారం హద్దుల్లేకుండా సాగిపోతోంది.

భార్య అనారోగ్యం అని చెప్పినా....

వాస్తవానికి జైలు సూపరింటెండెంట్ రాహుల్ భార్య కిరణ్మయి (46) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఔట్ పేషెంట్‌గానే చికిత్స పొందుతున్న కిరణ్మయిని.. ఆరోగ్యం విషమించటంతో ఈ నెల 14న ఆసుపత్రిలో చేర్చారు. ఆమెను దగ్గరుండి చూసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో రాహుల్ కూడా సెలవు పెట్టారు. దురదృష్టవశాత్తూ పరిస్థితి విషమించి శుక్రవారం ఆమె మరణించారు కూడా. 'ఈనాడు' పత్రిక గానీ, తెలుగుదేశం పార్టీ గానీ ఇలాంటి వార్త రాసేముందు రాహుల్ సెలవు పెట్టిన కారణాన్ని తెలుసుకుని... అది వాస్తవమో కాదో ఒక్కసారి ధ్రువపరుచుకుని ఉంటే సరిపోయేది. అలా చేస్తే.. ఇంతటి హేయమైన, నీచమైన దౌర్భాగ్యపు రాతలు రాసి ఉండేవారు కాదేమో!!. వాస్తవానికి అలా అనుకోవటానికి లేదు. ఎందుకంటే వీళ్లెవరికీ నిజాలతో పనిలేదు. నిజం తెలిసినా దాన్ని బయటకు చెప్పరు కూడా. ఎన్ని అబద్ధాలు చెప్పయినా... జనం మెదళ్లలో ఎంతటి విషాన్ని నింపయినా చంద్రాబును వీలైతే జైల్లోంచి బయటకు తేవటం, లేకపోతే సానుభూతి సంపాదించి రాజకీయంగా లబ్ధి పొందటమే వాళ్ల లక్ష్యాలు. దీనికోసం తాము అధికారాన్ని అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా సంపాదించిన కోట్ల రూపాయల డబ్బు మూటల్ని వెదజల్లటానికి ఎల్లో ముఠా వెనకాడటం లేదు. కోట్లాది రూపాయలు ఫీజులివ్వటంతో పాటు ప్రత్యేక విమానాల్లో లాయర్లను తీసుకురావటం... దత్తపుత్రుడితో సహా కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ - విజయవాడ- ఢిల్లీ అంటూ స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతుండటం... జాతీయ మీడియాకు ఢిల్లీలో చినబాబు లోకేశ్ ఇంటర్వ్యూలు... స్కిల్‌డెవలప్‌మెంట్‌పై నిజాలు అంటూ గాలి మాటలతో ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించటం... ఇవన్నీ ఈ అక్రమ సంపాదనకు పుట్టిన సంతానమే అనుకోవాలి.

రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో
ఏం జరుగుతోంది?



ఈనాడులో ప్రచురించిన కథనం

దొంగతనం చేసి ఇంత యాగీ చేయటమా?

దేశంలోనే కాదు... ఒక దొంగని అరెస్టు చేస్తే ఇంత యాగీ చెయ్యటమనేది ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ఒక్క ఏపీలో తప్ప... అదీ చంద్రబాబునాయుడి విషయంలో తప్ప. ఒకవైపేమో సీమెన్స్ సంస్థ తమతో ఎవరూ ఎలాంటి ఒప్పందమూ చేసుకోలేదని చెబుతోంది... కానీ ఎల్లో మీడియా మాత్రం సీమెన్స్ పెద్ద సంస్థకాదా? సీమెన్స్ అంతర్జాతీయ దిగ్గజం కాదా? అని వాదిస్తోంది. నిజాలకు మసిపూస్తోంది. నిజంగా సీమెన్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్టే ఎదురు ప్రశ్నలు వేస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరఫున విడుదల చేసిన డబ్బులు బయటకు పోయాయన్నది నిజం. అవి సీమెన్స్‌కు చేరలేదని ఆ సంస్థే చెబుతోంది. అవి షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబును చేరాయని కేంద్ర దర్యాప్తు సంస్థలే తేల్చాయి. మరి ఇంత రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయి కూడా.. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సంఘీభావమంటూ, బెంగళూరులో తమకు మద్దతు తెలిపారంటూ పదేసి మందిని పోగేసి ఇంత యాగీ చేయటమెందుకు? మణిపూర్ పోరాట యోధురాలు ఇరోమ్ షర్మిల ద్వారా కూడా ట్వీట్ చేయించారంటే చంద్రబాబు ఎల్లో నెట్‌వర్క్ ఏ స్థాయిలో ఉందో చెప్పకనే తెలుస్తుంది. అసలు ఇరోమ్ షర్మిలకు ఏపీ గురించి తెలుసా? ఇక్కడ ఏం జరిగిందో తెలుసా? చంద్రబాబు ఎంత లూటీ చేశాడో తెలుసా? నిజంగా తప్పు చేయకపోతే... తాము అన్నీ సక్రమంగానే చేసి ఉంటే ఆ విషయాలన్నీ కోర్టులో చెప్పొచ్చు కదా? చంద్రబాబును వదిలేయాలంటూ వాట్సాప్ మెసేజ్‌లు, ఆయన్ను అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆడియో సందేశాలు... ఎందుకిదంతా? 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు...ఈ 40 ఏళ్లుగా తాను పెంచి పోషించిన విష వ్యవస్థను తనకు మద్దతివ్వటానికి ఉపయోగించుకుంటున్నారని తెలియటానికి ఇంకేం కావాలి? తనకు వ్యతిరేకంగా తీర్పునిస్తే న్యాయమూర్తిపై కూడా దారుణంగా దుష్ప్రచారం చేసిన ఈ ఎల్లో ముఠా తన అబద్ధాలతో ఇంకెన్నాళ్లు మనుగడ సాగించగలదు?

Telugu De... @JaiTDP Follow

రాజమండ్రి జైల్లో చంద్రబాబు గారి భద్రత పై నారా భువనేశ్వరి గారితో పాటు టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారంటే దాంట్లో నిజం లేకపోలేదు. ఉన్నట్టుండి రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ సెలవుపై ఎందుకు వెళ్తున్నారు? జగన్ కుట్ర ఏమైనా ఉంటుంది?

టీడీపీ ట్విట్టర్‌లో చేసిన పోస్ట్

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ భార్య కిరణ్మయి మృతి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ సతీమణి కిరణ్మయి (46) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో కిరణ్మయి బాధపడుతున్నారు. ఆమెకు ఆరోగ్యం బాగోకపోవడంతో నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాహుల్, కిరణ్మయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు.

పోలీసు యంత్రాంగం తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటోంది

- స్థితిగతులు తెలుసుకుని వాస్తవాలను ప్రచురించండి
- జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, జిల్లా ఎస్పీ పి.జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోందని, స్థితిగతులు తెలుసుకుని రాయాలని, అవాస్తవాలను ప్రచురించవద్దని కోస్తా, ఆంధ్ర రీజియన్ జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ చెప్పారు. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ భార్య కిరణ్మయి అనారోగ్యంతో మృతిచెందడంతో డీఐజీ రవికిరణ్, ఎస్పీ జగదీష్ శుక్రవారం హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి సూపరిండెంట్‌ను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు వార్తాపత్రికల్లో జైలు సూపరింటెండెంట్ రాహుల్ సెలవుపై వెళ్లిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తపరుస్తూ వార్తలు వచ్చాయన్నారు. ఆయన సతీమణి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఈనెల 14న ఉదయం 6 గంటల సమయంలో ఆసుపత్రి లో చేర్చారన్నారు. ఆమెను చూసుకునేందుకు రాహుల్ రెండు రోజులు సెలవుపై వెళ్లారన్నారు. దీనికి ఈ ఒక్క కారణమే తప్ప మరేకారణం లేదన్నారు. రాహుల్ భయపడి వెళ్లిపోయారు, అధికారులు బలవంతంగా పంపించారు అనేవి పూర్తిగా అవాస్తవాలన్నారు.

'కలిసి పనిచేస్తే ఏదైనా సాధించగలం'

సాక్షి, హైదరాబాద్: అందరూ కలిసి పనిచేస్తే భూమిపై సాధించలేనిది లేదనే ఆశయానికి ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రతిరూపంగా కనిపించడం అభినందనీయమని ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రాం మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నార్వే మాజీ మంత్రి, 'గ్రీన్‌బెల్ట్ అండ్ రోడ్ ఇనిస్టిట్యూట్ సంస్థ స్థాపకుడు ఎరిక్ సోల్హీమ్ అన్నారు. బేగంపేటలో 'గ్రీన్ చాలెంజ్' ఫౌండర్, ఎంపీ జె.సంతోష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఎరిక్ సోల్హీమ్ మొక్కలు నాటారు.

మన వైద్య రంగం దేశానికే దిక్సూచి

- గొప్ప డాక్టర్లు, మనసున్న డాక్టర్లను సమాజానికి అందించడమే లక్ష్యం
- ఐదు మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం : నాలుగేళ్లలో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు, కార్యక్రమాల వల్ల మన వైద్య రంగం దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రూ.8,480 కోట్ల వ్యయంతో రాష్ట్రంలో కొత్తగా నిర్మాణం చేపట్టిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో తొలి దశలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఐదు కళాశాలలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని స్వయంగా, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. విశాఖపట్నం నుంచి ఉదయం 10:30 గంటలకు విజయనగరం మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. కళాశాల అంతటా కలియ దిరిగి పరిశీలించిన తర్వాత విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలు పెట్టామని, అందులో ఇప్పటికే పూర్తి అయిన ఐదు మెడికల్ కాలేజీల్లో ఈరోజు పిల్లలు అడ్మిషన్లు తీసుకొని డాక్టర్లుగా అడుగులు వేస్తున్నారన్నారు. వైద్య విద్య అభ్యసించాక, అందరూ మంచి సేవల ద్వారా గొప్ప డాక్టర్లుగా, గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారని మనసారా ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. మనసున్న డాక్టర్లను సమాజానికి అందించడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని తెలిపారు.



డిసెక్షన్ హాలులో వైద్యసేవలను పరీక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

> కొన్ని స్టేట్‌మెంట్స్ ఎప్పుడూ నా మనసును తడుతుంటాయి. ఈవేళ అలా నా మనసుకు తట్టిన 'నాట్ ఆల్ ఏంజిల్స్ హావ్ వింగ్స్.. సమ్ హావ్ స్టెతస్కోప్స్' (దేవతలందరికీ రెక్కలుండవు.. కొందరికి స్టెతస్కోప్‌లు ఉంటాయి) అని ఈ ఆంగ్ల కోట్ చెబుతోంది. అంటే వైద్యులు ధవళ వర్ణ వస్త్రాల్లో మిలమిలా మెరిసిపోతూ నిష్కల్మష మనసుతో రోగులకు వైద్యం అందిస్తారని అర్థం. అందుకే కాబోలు మన తెలుగులో ఇంకో అడుగు ముందుకేసి వైద్యో నారాయణో హరీ అని డాక్టర్లను దేవుడితో పోలుస్తారు అనే కోట్‌ను ఈ కళాశాలలోకి అడుగు పెట్టినప్పుడు పుస్తకంలో రాసి సంతకం కూడా పెట్టాను. కీప్ దిస్ ఇన్ మైండ్. మీరంతా మంచి డాక్టర్లు, పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్లు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు అవుతారన్న నమ్మకం నాకు ఉంది. ఆల్ ద వెరీ బెస్ట్.
>
> -సీఎం వైఎస్ జగన్

ఢిల్లీలో లోకేశ్ అగచాట్లు

- బీజేపీ జాతీయ నేతలను కలిసేందుకు ప్రయత్నిస్తున్నా స్పందన కరువు
- జాతీయ మీడియాతో మాట్లాడదామన్నా అదే పరిస్థితి
- బాబుకు బెయిల్‌పై సుప్రీంకోర్టు న్యాయవాదులతో మంతనాలు

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన తన తండ్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టేందుకు నారా లోకేశ్ నానాఅగచాట్లు పడుతున్నారు. బీజేపీ జాతీయ నేతలను కలవాలని భావించినప్పటికీ శుక్రవారం ఆయనకు అపాయింట్‌మెంట్‌లేవీ లభించలేదు. పార్టీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, మరో ఎంపీ రామ్మోహన్‌నాయుడు సహా పార్టీ సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు స్వయంగా రంగంలోకి దిగి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా ఒకరిద్దరి అపాయింట్‌మెంట్‌లు కోరినప్పటికీ వారి నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో శనివారమైనా బీజేపీ అగ్ర నేతలను కలవాలనే ఉద్దేశంతో ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఇక చంద్రబాబుకు అన్యాయం జరిగిందని, అక్రమంగా అరెస్ట్ చేశారంటూ జాతీయ మీడియాకు చెప్పుకునేందుకు లోకేశ్ ప్రయత్నించినా ఏ మీడియా సంస్థల నుంచి పెద్దగా స్పందన కానరాలేదు. ఒకట్రెండు మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇచ్చినా, అవేవీ శుక్రవారం ప్రసారం కాలేదు. ఇదే సమయంలో బాబుకు బెయిల్ విషయంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులతోనూ లోకేశ్ చర్చలు చేస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై ఆయన ఎంపీలతో శనివారం పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

అన్యాయంగా బాబు అరెస్ట్: లోకేశ్

ఏఎన్ఐ న్యూస్ ఏజెన్సీతో మాట్లాడిన లోకేశ్, తన తండ్రిని అన్యాయంగా ప్రభుత్వం అరెస్ట్ చేసిందని ఆరోపించారు. ఈ విషయం జాతీయ స్థాయిలో తెలియజేసేందుకే ఢిల్లీ వచ్చినట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఎలాంటి స్కామ్ జరగలేదని, బాబుపై తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ విషయంలో చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకే జనసేన, టీడీపీ కలిసి పనిచేయాలని నిర్ణయించాయని తెలిపారు.

బెయిల్ పిటిషన్‌లో కౌంటర్ వేయండి

▶ మొదటి పేజీ తరువాయి

విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీఐడీ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైఎస్ వివేకానంద వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. ఈ మేర ఆయన దాఖలు చేసిన పిటిషన్‌కు అసలు విచారణార్హతే లేదన్నారు. సీఆర్‌సీపీ సెక్షన్ 437, సెక్షన్ 439 కింద బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని.. అయితే, ఈ సెక్షన్ల కింద మధ్యంతర బెయిల్ ఇవ్వడమన్న ప్రశ్నే తలెత్తదన్నారు. ఈ సెక్షన్లలో ఎక్కడా కూడా మధ్యంతర బెయిల్ ప్రస్తావనేలేదని ఆయన తెలిపారు. మధ్యంతర బెయిల్ తమ హక్కు అన్నట్లు చంద్రబాబు న్యాయవాదులు వాదిస్తున్నారని.. ఇప్పటికే అరెస్టయి జైలులో ఉన్న వ్యక్తి మధ్యంతర బెయిల్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదన్నారు. తాము ఇప్పటికే పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేశామని, అందులో కౌంటర్లు దాఖలు చేయాలని ఈ కోర్టు ఆదేశించినా చంద్రబాబు న్యాయవాదులు దాఖలు చేయలేదని వివేకానంద కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పైపెచ్చు హైకోర్టును ఆశ్రయించి, ఈ కోర్టు (ఏసీబీ కోర్టు) కౌంటర్ కోసం ఒత్తిడి చేస్తోందన్నట్లు హైకోర్టుకు చెప్పి, పోలీసు కస్టడీ పిటిషన్‌లో ఈ కోర్టు (ఏసీబీ కోర్టు)ను ముందుకెళ్లకుండా నియంత్రిస్తూ ఉత్తర్వులు తెచ్చారని తెలిపారు. వాస్తవానికి పోలీసు కస్టడీ పిటిషన్‌లో తామే కౌంటర్ కోసం ఒత్తిడి చేశామే తప్ప, ఈ కోర్టు ఎవరినీ ఒత్తిడి చేయలేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో తమ పోలీసు కస్టడీ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు విచారించలేని పరిస్థితిలో ఉండటంతో, దానిని అడ్డంపెట్టుకుని బెయిల్ కోసం పిటిషన్ వేసి మధ్యంతర బెయిల్ కోరుతున్నారని వివేకానంద తెలిపారు. వాస్తవాలను కోర్టు ముందుంచాలన్న ఉద్దేశంతోనే ఇవన్నీ చెబుతున్నామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని విచారణను వాయిదా వేయాలని వివేకానంద కోరారు.

మధ్యంతర బెయిల్‌పై విచారణ సబబేనా?

అనంతరం.. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, ప్రధాన బెయిల్ కౌంటర్ దాఖలు చేసి, వాదనలు విని దానిని తేల్చేలోపు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమయంలో న్యాయస్థానం స్పందిస్తూ.. సీఐడీ కేసు కొట్టేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, ఇదే సమయంలో చంద్రబాబు కస్టడీ కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ తమ ముందు పెండింగ్‌లో ఉందని, ఈ పరిస్థితుల్లో బెయిల్‌పై విచారణ జరపడంపై స్పష్టత కావాలని తేల్చిచెప్పింది. పోలీసు కస్టడీ పిటిషన్‌లో ముందుకెళ్లకుండా హైకోర్టు ఉత్తర్వులున్నాయని గుర్తుచేసింది. అందువల్ల ఈ దశలో మధ్యంతర బెయిల్‌పై వాదనలు వినడం సబబా? కాదా? అన్న సందేహం కలుగుతోందని ఏసీబీ తెలిపింది. కానీ, మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకునే విచక్షణాధికారం ఏసీబీ కోర్టుకుందని దమ్మాలపాటి తెలిపారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాం కాబట్టి, మధ్యంతర బెయిల్‌పై కింది కోర్టు విచారణ జరపకూడదన్న నిషేధం ఏదీలేదన్నారు. న్యాయస్థానం స్పందిస్తూ.. మంగళవారం హైకోర్టులో విచారణ జరుగుతున్నందున, క్వాష్ పిటిషన్‌లో విచారణ తరువాత హైకోర్టులో వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఈ బెయిల్‌పై తదుపరి విచారణ జరుపుతామని స్పష్టంచేస్తూ విచారణను 19కి వాయిదా వేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది.

చంద్రబాబు కోసం ప్రత్యేక వైద్య బృందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నారా చంద్రబాబు నాయుడుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. సెంట్రల్ జైలులో ప్రత్యేక అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. 10 మందితో కూడిన ప్రత్యేక వైద్య బృందం నిరంతరం చంద్రబాబు ఆరోగ్యస్థితి గమనిస్తూ ఉంటుంది. అంబులెన్స్‌లో అత్యవసర మందులు, ఓ పాజిటివ్ బ్లడ్ ప్యాకెట్లు రెండు అందుబాటులో ఉంచారు. డాక్టర్ పి. శ్రీనివాస్ టీం లీడర్‌గా ఉన్న ఈ బృందంలో జనరల్ సర్జన్ డాక్టర్ ఫాతిమా, అనస్తీషియా స్పెషలిస్ట్ డాక్టర్ అమృత, ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ రఘువీర్, ఈఎమ్‌టీ (108) వీఎస్. నాగలక్ష్మి, స్టాఫ్ నర్స్ బి.ప్రశాంతి, ల్యాబ్ టెక్నీషియన్ జి.రవి, ఎమ్ఎన్‌వో ఇ.మణికంఠతో పాటు ఇద్దరు అంబులెన్స్ డ్రైవర్లు అందుబాటులో ఉంటారు.

సైబరాబాద్‌లో ధర్నాలకు అనుమతి లేదు

గచ్చిబౌలి (హైదరాబాద్): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసన పేరిట ఐటీ ఉద్యోగుల ముసుగులో కొందరు టీడీపీ నాయకులు ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని పోలీసులు తెలిపారు. సైబరాబాద్‌లో ధర్నాలకు, నిరసనలకు ఎలాంటి అనుమతులు లేవని.. ఐటీ కారిడార్‌లో రోడ్లపై, ఔటర్ రింగ్‌రోడ్డుపై ధర్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం మాదాపూర్ డీసీపీ సందీప్‌కుమార్ హెచ్చరించారు. ఐటీ ఉద్యోగులు నిరసనల్లో పాల్గొని.. పబ్లిక్ న్యూసెన్స్, ట్రాఫిక్ అంతరాయానికి కారణమైతే సంబంధిత కంపెనీకి నోటీసులు ఇస్తామన్నారు. శనివారం సాయంత్రం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ వద్ద నిరసన కార్యక్రమానికి కొందరు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసిందని, వారికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని డీసీపీ స్పష్టం చేశారు. ధర్నా ఉందని సోషల్ మీడియాలో ప్రచారం చేసినా చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రం తోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహాసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూఫ్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు సేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రెడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

కోస్టారికా వెళ్లనున్న లోకేశ్ జైశ్వాల్



బహదూర్‌పురా: 17 నుంచి 27వ తేదీ వరకు కోస్టారికా దేశంలో జరగనున్న పర్యావరణ వ్యవస్థ, సేవల పునరుద్ధరణ, చెల్లింపుపై ప్రత్యేక అధ్యయనం నిమిత్తం నోడల్ అధికారి, పీసీసీఎఫ్ అండ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ లోకేశ్ జైశ్వాల్ తన బృందంతో వెళ్లనున్నారని జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునిల్ ఎస్ హిరేమత్ అన్నారు. భారతదేశం, యూఎస్ఏ ఒప్పందంలో భాగంగా తెలంగాణ, బిహార్, కేరళ రాష్ట్రాల నుంచి ఈ బృందాలు బయలుదేరనున్నాయన్నారు. 2019లో ప్రారంభించిన ఫారెస్ట్ ప్లస్ 2.0–యూఎస్ఏఐడీ ప్రోగ్రాంలో పర్యావరణ వ్యవస్థ సేవలను వినియోగించడం, సాంకేతికతలపై నోడల్ అధికారిగా వ్యవహరిస్తూ శాస్త్రీయ విధానంలో క్షీణించిన అడవుల పునరుజ్జీవనానికి దోహదపడే కార్యక్రమాలను చేపట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి అటవీ విస్తరణను విజయవంతంగా పెంచారన్నారు. లోకేశ్ జైశ్వాల్ యునైటెడ్ కింగ్‌డమ్ లండన్ యూనివర్సిటీ ఆఫ్ కాలేజీలో పర్యావరణ అండ్ సుస్థిర అభివృద్ధిలో ఎం.ఎస్.డిగ్రీ పూర్తి చేశారన్నారు.

సాక్షి రియల్టీ

భూమ్!



- ఆగస్టులో 6,493 ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు
- వీటి విలువ రూ. 3,461 కోట్లు
- ఈ ఏడాది ఇది రెండో అత్యధికం
- 68 శాతం వాటా రూ. 50 లక్షల లోపు ధర ఉన్నవే
- నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరుగులు పెడుతుంది. గత నెలలో రూ.3,461 కోట్లు విలువ చేసే 6,493 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్స్ అయ్యాయి. ఈ ఏడాది ఈ స్థాయిలో రిజిస్ట్రేషన్స్ జరగడం ఇది రెండోసారి. మార్చిలో అత్యధికంగా 6,959 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్స్ జరిగాయి. జూలై నెలతో పోలిస్తే రిజిస్ట్రేషన్లలో 17 శాతం, ఏడాది కాలంతో పోలిస్తే 15 శాతం ఎక్కువని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. ప్రాపర్టీల విలువల పరంగా చూస్తే జూలైతో పోలిస్తే 20 శాతం, ఏడాది కాలంతో పోలిస్తే 22 శాతం ఎక్కువ.

68 శాతం వాటా ఈ గృహాలదే..

ఆగస్టులో జరిగిన రిజిస్ట్రేషన్లలో అత్యధిక వాటా రూ.50 లక్షల లోపు గృహాలదే. ఈ ఇళ్ల వాటా 68 శాతంగా ఉంది. విభాగాల వారీగా చూస్తే.. రూ.25 లక్షలు లోపు ధర ఉన్న ప్రాపర్టీల వాటా 16 శాతం కాగా.. రూ.25–50 లక్షలు మధ్య ధర ఉన్న ప్రాపర్టీల వాటా 52 శాతం, రూ.50–75 లక్షలవి రూ.16 శాతం, రూ.75 లక్షల నుంచి రూ.కోటి ధర ఉన్నవి 8 శాతం, రూ.కోటి నుంచి రూ.2 కోట్లు ధర ఉన్నవి 7 శాతం, రూ.2 కోట్లకు మించి ధర ఉన్న ప్రాపర్టీల వాటా 2 శాతంగా ఉంది.

2 వేల చ.అ. లోపు విస్తీర్ణ ఇళ్లు...

గత నెలలో జరిగిన రిజిస్ట్రేషన్లలో 1,000 చ.అ. నుంచి 2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న ప్రాపర్టీల వాటా 70 శాతంగా ఉంది. 2 వేల నుంచి 3 వేల చ.అ. మధ్య ఉన్న ఇళ్ల వాటా 9 శాతం, 3 వేల చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణమైన యూనిట్ల వాటా 2 శాతంగా ఉంది.

- అత్యధిక రిజిస్ట్రేషన్లు మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోనే జరిగాయి. ఈ జిల్లా వాటా 43 శాతం ఉండగా.. రంగారెడ్డిలో 39 శాతం, హైదరాబాద్‌లో 17 శాతం రిజిస్ట్రేషన్ వాటాను కలిగి ఉన్నాయి.

టాప్–5 రిజిస్ట్రేషన్స్ ఇవే..

ఆగస్టులో జరిగిన రిజిస్ట్రేషన్లలో టాప్–5 జాబితాలో బేగంపేట, బంజారాహిల్స్, ఖైరతాబాద్ ప్రాంతాలలోని ప్రాపర్టీలు నిలిచాయి. అత్యధికంగా బేగంపేటలో రూ.8.20 కోట్ల మార్కెట్ విలువ గల రిజిస్ట్రేషన్ జరగగా.. ఆ తర్వాత బంజారాహిల్స్‌లో రూ.7.47 కోట్లు, రూ.5.60 కోట్లు, రూ. 5.60 కోట్ల ప్రాపర్టీలు, ఖైరతాబాద్‌లో రూ.4.76 కోట్ల ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ జరిగింది. ఆయా యూనిట్ల విస్తీర్ణం 3 వేల చ.అ.లకు మించి ఉన్నవే.

ఈ ఏడాది రిజిస్ట్రేషన్లు, విలువల గణాంకాలివే

నెల	రిజిస్ట్రేషన్లు	విలువ (రూ.కోట్లలో)
జనవరి	5,454	2,650
ఫిబ్రవరి	5,725	2,987
మార్చి	6,959	3,602
ఏప్రిల్	4,494	2,286
మే	6,039	3,068
జూన్	5,566	2,897
జూలై	5,557	2,878
ఆగస్టు	6,493	3,461

నగర వార్తలు

ఇందిరాపార్కులో మహాధర్నా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ముషీరాబాద్: ఆర్టిజెన్స్ అర్హతలను బట్టి జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్స్, సబ్ ఇంజినీర్స్, ఓఎస్‌లుగా కన్వర్షన్ ఇవ్వాలని, అన్‌మెన్డు కార్మికులను ఆర్టిజెన్స్‌గా గుర్తించి, గ్రేడ్–2 వేతనం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్పీడీసీఎల్ (వరంగంల్), ఎస్పీడీసీఎల్ (హైదరాబాద్) విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న 23 వేల మంది ఆర్టిజెన్స్‌ని కన్వర్షన్ (పర్మనెంట్) చేయాలని ఎన్పీడీసీలో 1536 మంది, ఎస్పీడీసీలో 56 మంది అన్‌మెన్డు కార్మికులను ఆర్టిజెన్స్‌గా గుర్తించాలని తదితర డిమాండ్లతో మహాధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంగారెడ్డి మాట్లాడుతూ.. బిల్ కలెక్టర్స్, మీటర్ రీడర్స్, ఎస్పీఎం, పీఏలకు జీవో నెంబర్ 11 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మరణించిన అన్‌మెన్డు కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రావు, కుమారచారి, గోవర్ధన్, నాగేశ్వర్‌రావు, వెంకటరాజు పాల్గొన్నారు.

నిమజ్జనం నిరుటి మాదిరే

బేబీ పాండ్స్, ప్రీ ఫ్యాబ్రికేటెడ్, తాత్కాలిక కొలనులు

- మొత్తం 74 కొలనులు అందుబాటులోకి

ఏ జోన్‌లో.. ఏ కొలనులు..

జోన్	పోర్టబుల్	తాత్కాలిక	బేబీ పాండ్స్	మొత్తం
ఎల్‌బీనగర్	4	4	5	13
చార్మినార్	3	5	2	10
ఖైరతాబాద్	5	6	2	13
శేరిలింగంపల్లి	3	3	8	14
కూకట్‌పల్లి	3	2	7	12
సికింద్రాబాద్	6	3	3	12
మొత్తం	24	23	27	74



సాక్షి, సిటీబ్యూరో: వినాయకచవితి పండగ సమీపిస్తుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు ఎక్కడి వారు అక్కడే తమకు దగ్గరి ప్రాంతాల్లో నిమజ్జనాలు చేసేందుకు వీలుగా కొలనులు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా జీహెచ్ఎంసీ నిమజ్జనాల కోసమే నిర్మించిన కొలనులతోపాటు ప్రీ ఫ్యాబ్రికేటెడ్ పోర్టబుల్ కొలనులు, తాత్కాలికంగా నిర్మించే కొలనుల్ని నిమజ్జనాల కోసం వినియోగించనున్నారు. నిమజ్జనాల కోసమే నిర్మించిన కొలనుల్ని బేబీపాండ్స్‌గా వ్యవహరిస్తున్నారు. నిర్వహణలేక వ్యర్థాలతో నిండిపోయిన బేబిపాండ్స్‌ను శుభ్రం చేయడంతోపాటు, తాత్కాలిక చెరువుల పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కోరారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందికి గణేష్ మట్టి విగ్రహాలు మేయర్ పంపిణీ చేశారు.

వేతన బకాయిలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నల్లకుంట: వేతనాల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి వైరాలజీ ల్యాబ్ కాంట్రాక్ట్ సిబ్బంది శుక్రవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల నిర్వహణ బాధ్యతలను నక్షత్ర, సాహితి ఏజెన్సీలు చూసుకుంటున్నాయి. నక్షత్ర ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న సుమారు 40 మంది ఉద్యోగులకు జూలై, ఆగష్టుకు సంబంధించి వేతనాలు చెల్లించలేదు. పైగా సదరు ఏజెన్సీ ప్రతినిధి పత్తా లేకుండా పోయాడు. ఈ విషయంలో అనేక సార్లు ఆస్పత్రి అధికారులు, నక్షత్ర ఏజెన్సీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం నిరసన తెలిపారు. టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య నిరసనకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఉద్యోగుల జీతాలు విషయంపై ఆస్పత్రి యాజమాన్యం, ఏజెన్సీ పట్టించుకోకుంటే ఉద్యోగుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెంటనే జీతాలు చెల్లించాలి లేకుండా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షురాలు పద్మజ రెడ్డి, సంయుక్త కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి సతీష్, ఉద్యోగులు వెంకటేశ్, మహేందర్, గోపి కృష్ణ, నళిని, నయూం, షారుఖ్, నవాజ్, యాస్మిన్, షబానా, భాగ్యలక్ష్మి, నరసింహ, సత్యనారాయణ, శ్రీకాంత్, అబ్బాస్, అజ్గర్ పాల్గొన్నారు. నక్షత్ర ఏజెన్సీ ద్వారా పని చేస్తున్న సుమారు 40 మంది సిబ్బందికి రెండు నెలల వేతన బకాయిలు ఉన్నట్లు తన దృష్టికి రాగా సదరు ఏజెన్సీకి మెమో జారీ చేశామని ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.శంకర్ పేర్కొన్నారు.

అంతర్జాతీయ క్రీడా పోటీలకు తెలంగాణ వేదిక

గన్‌ఫౌండ్రీ: జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు తెలంగాణ చక్కటి వేదిక అవుతుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా. ఆంజనేయగౌడ్ అన్నారు. ఈ నెల 16 నుంచి జరగనున్న థాయి బాక్సింగ్ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఎల్బీస్టేడియంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ విజన్‌తోనే భాగ్యనగరం అనేక క్రీడా పోటీలకు వేదిక అయ్యిందన్నారు. ఓ వైపు గ్రామీణ క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ మరోవైపు ప్రఖ్యాత క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి నగరాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. ఎల్బీస్టేడియంలో జరిగే బాక్సింగ్ పోటీల విజయవంతానికి తమ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ చుబుకేశ్వర్, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రెడ్డి, థాయి బాక్సింగ్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంజనేయగౌడ్

నేడు పాస్‌పోర్టు స్పెషల్ డ్రైవ్

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలోని 5 ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు ఈ నెల 16వ తేదీన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పని చేస్తాయని ఆర్పీవో దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీతో పాటు ఈ నెల 23వ తేదీల్లో కూడా ఈ స్పెషల్ డ్రవ్ కొనసాగుతుందని తెలిపారు. బేగంపేట, అమీర్‌పేట్, టోలిచౌక్, నిజామాబాద్, కరీంనగర్ పీఎస్కేలతో పాటు 14 పీవోపీఎస్కేల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు.

నేటి నుంచి పుస్తక ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: కితాబ్ లవర్స్ ఆధ్వర్యంలో పుస్తక ప్రియుల కోసం ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ దగ్గర, ప్రీమియా మాల్ సమీపంలో ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. ఉ. 10 గంటలనుంచి రాత్రి 9 గంటల వరకు ఏర్పాటు చేసే ప్రదర్శనలో వివిధ రకాలైన సుమారు 10 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని వ్యవస్థాపకులు రాహుల్ పాండే తెలిపారు. 'లోడ్ ది బాక్స్'ఆఫర్‌లో భాగంగా కొనుగోలుదాలు ఒక పెట్టేనిండా నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేయవచ్చని రూ.1200–రూ.3000 వరకు ఉంటాయన్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023

ఖైరతాబాద్ మహాగణపతికి కంటిపాపను తీర్చిదిద్దుతున్న శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్



న్యూస్‌రీల్

నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణ

- పరిశీలించనున్న కర్ణాటక డిప్యూటీ సీఎం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో అమలవుతున్న ఘనవ్యర్థాల (చెత్త) నిర్వహణ, చెత్త నుంచి విద్యుత్ తయారీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు తదితరాలను కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పరిశీలించనున్నారు. బెస్ట్ ప్రాక్టీసెస్ కార్యక్రమాల్ని పరిశీలించి తమ రాష్ట్రంలో అమలు చేసేందుకు ఆయన ఈ పర్యటన చేయనున్నట్లు తెలిసింది. తన పర్యటనలో భాగంగా శనివారం ఆయన జవహర్‌నగర్‌లో చెత్త శుద్ధి, చెత్తనుంచి విద్యుత్ తయారీ, దుండిగల్ కేంద్రంలో చెత్త నిర్వహణ, అక్కడి సదుపాయాలు, జగద్గిరిగుట్టలో చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను పరిశీలించనున్నారు. ఆయనతో పాటు బృహత్ బెంగళూర్ మహా నగరపాలిక (బీబీఎంపీ) అధికారులు ఇక్కడ అమలవుతున్న కార్యక్రమాల తీరుతెన్నుల్ని పరిశీలించనున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమై జీహెచ్ఎంసీలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను వారు అధ్యయనం చేయనున్నారు.

రాష్ట్రపతి నిలయంలో 'విమోచన' వేడుకలు



రసూల్‌పురా: హైదరాబాద్ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17న పురస్కరించుకుని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మూడు రోజుల పాటు జరిగే సాంస్కృతిక, క్విజ్, వ్యాసరచన, రంగస్థల, వ్యాసరచన, ముఖ చిత్రం, చిత్రలేఖనం ఖాదీ ఫ్యాషన్ షో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, మనూ వైస్ చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్ ముఖ్య అతిథిగా హాజరై విమోచన దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రపతి నిలయం మొత్తం కలియతిరిగారు. విమోచన దినోత్సవ కార్యక్రమాల్లో పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజల సందర్శనకు అనుమతించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయ పాలనా వ్యవహారాల అధికారిణి రజనీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పరిశీలించిన బుద్ధప్రకాశ్



సాక్షి, సిటీబ్యూరో: ఓటరు జాబితా పరిశీలకుడి (రోల్ అబ్జర్వర్)గా నియమితులైన బుద్ధప్రకాశ్ శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జిల్లాలోని సనత్ నగర్, సికింద్రాబాద్ ఖైరతాబాద్, ముషీరాబాద్, మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు జాబితాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా విడుదలకానుందన్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఓటరు జాబితా పరిశీలన చేసినట్లు ఆయన తెలిపారు. రిటర్నింగ్ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, ఈఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది మేమే.. ఇళ్లు ఇచ్చేదీ మేమే

గ్రేటర్ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక ఇలా

జిల్లా	వికలాంగులు	ఎస్సీ	ఎస్టీ	ఇతరులు	మొత్తం
హైదరాబాద్	283	1,213	413	5,391	7,300
రంగారెడ్డి జిల్లా	75	295	97	1,433	1,900
మేడ్చల్-మల్కాజిగిరి	96	332	116	1,456	2,000
సంగారెడ్డి	16	83	29	372	500

టెన్షన్ వద్దు... అర్హులందరికీ 'డబుల్' గృహాలు

- హైదరాబాద్ కలెక్టరేట్‌లో రెండో విడత లక్కీ డ్రా
- 24 నియోజక వర్గాల్లో 1,1700 మంది ఎంపిక
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: 'అర్హులైన పేదలందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం. ఇప్పుడే రాలేదని టెన్షన్ పడొద్దు.. కలెక్టరేట్, ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీసుల చుట్టూ అనవసరంగా తిరగవద్దు' అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో డబుల్ బెడ్రూం ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలో మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని, .. ఇళ్లు ఇచ్చేది కూడా తామేనన్నారు. ఇళ్ల కోసం కొంత వేచి చూడాలని తప్ప రాలేదని బాధపడవద్దని సూచించారు. ఇళ్ల కేటాయింపులో ఎలాంటి ఎవరి జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. లాటరీ ద్వారా కేటాయింపు చేసే ప్రక్రియ కన్నా ర్యాండమైజేషన్ ఎన్నో రేట్లు పారదర్శకత, జవాబుదారీ తనాన్ని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, మేయర్ విజయ లక్ష్మి, ఎమ్మెల్సీలు ప్రభాకర్, వాణీదేవి, మీర్జా రహమత్ బేగ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్ అరికెపూడి



కలెక్టరేట్ వద్ద దరఖాస్తుదారుల ఎదురుచూపులు

గాంధీ, దానం నాగేందర్, ముఠా గోపాల్, ప్రకాష్ గౌడ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, హరీష్, అమోయ్ కుమార్, హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీవోలు సూర్యప్రకాష్, రవికుమార్ పాల్గొన్నారు. కాగా.. గ్రేటర్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల రెండో విడత కింద ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ పద్ధతిలో సుమారు 11,700 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో వికలాంగులకు 470, ఎస్సీలకు 1923, ఎస్టీలకు 655, ఇతరులకు 8,652 ఇళ్లను కేటాయించారు. వీటిని ఈ నెల 21న పంపిణీ చేయనున్నారు.

సమ్‌థింగ్ స్పెషల్

ఖైరతాబాద్: ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఖైరతాబాద్ మహాగణపతి ప్రస్థానం 1954లో ఒక్క అడుగుతో ప్రారంభమై 69వ సంవత్సరాలకు చేరుకుంది. ఈసారి పర్యావరణ హితంగా పూర్తిగా మట్టితో తయారు చేసిన మహాగణపతి 63 అడుగుల ఎత్తులో శ్రీ దశమహా విద్యాగణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. శుక్రవారం సాయంత్రం మహాగణపతికి నేత్రోనిలం (కంటిపాప ఏర్పాటు) కార్యక్రమాన్ని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ నిర్విఘ్నంగా పూర్తి చేశారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఖైరతాబాద్ మహాగణపతిని వివిధ రూపాల్లో తీర్చి దిద్దుతున్న శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

నా పూర్వజన్మ సుకృతం..

ఖైరతాబాద్ మహాగణపతిని ఏటా వివిధ రూపాల్లో తీర్చిదిద్దే అద్భుత అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. వినాయకచవితి వచ్చిందంటే ఎక్కడ ఉన్నా మహాగణపతి తయారీకి తప్పక వస్తాను. గత 40 సంవత్సరాలుగా మహాగణపతి సేవలో ఉన్నాను.

ఈ సంవత్సరం మట్టితో మహాగణపతి అద్భుతంగా రూపుదిద్దుకుంది. 2020లో మొదటిసారిగా మట్టితో 12 అడుగుల ఎత్తులో.. ఆ తర్వాత 2022లో, 2023.. ఈ సంవత్సరం మట్టితోనే అద్భుతంగా తయారైంది.

ఈసారి ఖైరతాబాద్ మహా గణపతి ప్రత్యేకం

- 4- 5 గంటల పాటు వర్షంలో తడిసినా విగ్రహం కరగదు
- కన్నుల పండువగా నేత్రోనిలనం
- శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ చేతులమీదుగా కంటిపాప ఏర్పాటు

ఈసారి ప్రత్యేకతలేమిటంటే..

63 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పులో, 45 టన్నుల బరువుతో శ్రీ దశమహా విద్యాగణపతిగా విఠల శర్మ సిద్ధాంతి సూచనల మేరకు నామకరణం చేసి, ఆయన ఇచ్చిన సూచనల మేరకే రూపు దిద్దుకుంది. ఒక చేతిలో గ్రంథం, వరాహదేవితో కలిసి ఉన్న మహాగణపతికి పూజ చేస్తే అన్ని శుభాలే జరుగుతాయి.

మహాగణపతికి ప్రాణ ప్రతిష్ట ఇలా..

నేత్రోనిలనం చేయడం అంటే కంటి పాప అమర్చడం. ఇలా చేయడం వల్ల మహాగణపతికి రూపం వస్తుంది. వినాయక చవితి రోజు కలశ పూజ పూర్తి చేయడం ద్వారా ప్రాణ ప్రతిష్ట జరుగుతుంది.

మట్టి వినాయకుడి ప్రత్యేకతలివీ..

మహాగణపతిని రూపొందించడానికి ఒక్క చుక్క పీఓపీ కూడా వాడలేదు. మొదటగా స్టీల్‌తో రూపు తీసుకువచ్చి ఆ తర్వాత జాలీని అమర్చి దానిపై గడ్డి, మట్టితో రెండో లేయర్, దానిపై ఔట్‌లేన్‌గా శాండ్, సుతిలి, ఓపీపోట్లు పొడర్లను కలిపి మరో లేయర్, మట్టి, సుతిలి పొడర్, బట్టతో మరో లేయర్ అమర్చి దానిపై ఫినిషింగ్ తీసుకువచ్చాం. ఇలా మొత్తం అయిదు లేయర్లు ఉన్నాయి. అయిదు లేయర్లపై వాటర్ పెయింట్స్ వాడటం వల్ల వర్షం నిరంతరంగా 4-5 గంటలు పడినా విగ్రహం ఏమాత్రం కరగదు. ఎలాంటి పగుళ్లకు అవకాశం లేదు. నిమజ్జన సమయంలో వర్షం పడినా ఏ ఇబ్బందీ ఉండదు. నిమజ్జనం పూర్తిగా జరిగితే 8 గంటల్లో నీటిలో కరుగుతుంది.

సుదర్శన్ లేని లోటు కనిపించింది..

గత సంవత్సరం వరకు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఉన్న సింగరి సుదర్శన్ మరణానంతరం ఆయన లేని లోటు కనిపించింది. ఆయన ఆశీర్వాదంతోనే మహాగణపతి పనులను ఎప్పుడూ లేని విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు దగ్గరుండి ప్రతీ పని చేస్తూ వచ్చాను.

ట్వీట్ చేసి పరార్!

'టాలీవుడ్ డ్రగ్స్' కేసులో నటుడు నవదీప్ పేరు



- అధికారికంగా వెల్లడించిన నగర కొత్వాల్ ఆనంద్
- అది తాను కాదంటూ గురువారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్
- కొన్ని మీడియా చానళ్లకు ఇంటర్వ్యూ ఇచ్చి అజ్ఞాతంలోకి..
- శుక్రవారం హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్

సాక్షి, సిటీబ్యూరో: 'టాలీవుడ్ డ్రగ్స్' కేసులో సినీనటుడు నవదీప్ కూడా నిందితుడని, అతడు పరారీలో ఉన్నాడని నగర కొత్వాల్, తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్-నాబ్) డైరెక్టర్ సీవీ ఆనంద్ గురువారం సాయంత్రం ప్రకటించారు. ఇది జరిగిన కొద్ది సమయానికే తన ట్విట్టర్ హ్యాండిల్ నుంచి నవదీప్ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. డ్రగ్స్ కేసులో ఉన్న నవదీప్ తాను కాదని, తన ఇంట్లోనే అందుబాటులో ఉన్నానని అందులో ప్రకటించాడు. ఆపై అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ఆయన శుక్రవారం తన న్యాయవాది ద్వారా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు.

రామ్‌చంద్ వాంగ్మూలంతో వెలుగులోకి..

మాదాపూర్‌లోని ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న ఫ్లాట్‌లో గత నెల 31న జరిగిన డ్రగ్ పార్టీ తీగ లాగిన టీఎస్ నాబ్ అధికారులు గురువారం మరో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో నైజీరియన్లతో పాటు టాలీవుడ్‌కు చెందిన వాళ్లు ఉన్నారు. ఈ కేసులో పట్టుబడిన రామ్‌చంద్ విచారణలోనే నటుడు నవదీప్ పేరు వెలుగులోకి వచ్చింది. . నవదీప్‌కు స్నేహితుడు, సన్నిహితుడు అయిన రామ్‌చంద్ తన వాంగ్మూలంలో నవదీప్ సైతం తనతో కలిసి మాదకద్రవ్యాలు సేవించినట్లు వెల్లడించాడు. ఆఖరుసారిగా గత శనివారం ఇరువురం వీటిని తీసుకున్నట్లు బయటపెట్టాడు. దీంతో టీఎస్ నాబ్ అధికారులు నవదీప్‌ను ఈ కేసులో నిందితుడిగా చేర్చారు.

మరికొందరితో కలిసి ఎస్కేప్...

హైదరాబాద్ సీపీ చెప్తున్న నవదీప్‌ను తాను కాదంటూ ట్వీట్ చేసిన నవదీప్ ఆపై కొన్ని మీడియా చానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చాడు. ఇవి ముగిసిన తర్వాత మరికొందరితో కలిసి కారులో బయటకు వెళ్లిపోయాడు. ఈ హడావుడి చూసిన టీఎస్ నాబ్ అధికారులు నవదీప్‌కు నోటీసులు జారీ చేయడానికి ఆయన ఇంటికి వెళ్లారు. అతడు అందుబాటులో లేకపోవడంతో మరికొన్ని ప్రాంతాల్లోనూ గాలించారు. అర్ధరాత్రి వరకు పోలీసులతో టచ్‌లో ఉన్న నవదీప్ అదిగో వస్తున్నా.. ఇదిగో వస్తున్నా అంటూ మభ్యపెట్టాడు. ఆపై పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం తన న్యాయవాది ద్వారా హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న టీఎస్ నాబ్ సైతం కౌంటర్ దాఖలు చేసింది.

గతంలోనూ గలాభాలు.. .

నవదీప్ వార్తల్లోకి ఎక్కడం ఇది తొలిసారేమీ కాదు. మద్యం తాగి నిర్లక్ష్యంగా కారు నడపడంతో పాటు పోలీసుల విధులను అడ్డుకోవడానికి ప్రయత్నించి 2010లో అరెస్టయ్యాడు. అదే ఏడాది అక్టోబర్‌లో నాగార్జునసాగర్‌లో బోటుతో వెళ్లి కృష్ణా నదిలో చిక్కుకుని హడావుడి చేశాడు. 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులో విచారణకు హాజరయ్యాడు.

నవదీప్‌ను అరెస్టు చేయొద్దు: హైకోర్టు

డ్రగ్స్ కేసులో నవదీప్‌ను మంగళవారం వరకు అరెస్టు చేయవద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. గుడిమల్కాపూర్ పోలీసు స్టేషన్ పరిధి డ్రగ్స్ కేసులో పోలీసులు 13 మందిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నవదీప్ వినియోగదారుడిగా ఉన్నాడని.. అతడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ శుక్రవారం లంచ్ మోషన్ రూపంలో నవదీప్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ వాదనలు చేపట్టారు. పిటిషనర్ తరపున వెంకట సిద్ధార్థ వాదనలు వినిపించారు. 'ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేకున్నా తప్పుగా నవదీప్‌ను కావాలని ఇరికించారని, ఆయనకు ఇతర నిందితులెవరితోనూ ప్రమేయం, అనుబంధం లేదని.. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వాలి' అని వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మంగళవారం వరకు నవదీప్‌ను అరెస్టు చేయవద్దని ఆదేశించారు.

తాజ్‌కృష్ణపై డేగకన్ను

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్‌కృష్ణ కేంద్రంగా జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర కొత్వాల్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికే పలువురు పోలీసు సిబ్బంది ఈ బాధ్యతలు చేపట్టారు. సమావేశాలు జరిగే తాజ్ కృష్ణ హోటల్‌తో పాటు దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు, దారితీసే మార్గాలనూ పోలీసులు తమ అధీనంలోకి తీసుకోనున్నారు. శుక్రవారం నుంచే ప్రముఖులు వస్తుండటంతో అటు శంషాబాద్ విమానాశ్రయంతో పాటు తాజ్ కృష్ణ పరిసరాల్లో అదనపు బలగాలను మోహరించారు. శాంతిభద్రతల విభాగంతో పాటు నగర భద్రత విభాగం, ట్రాఫిక్ వింగ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉమ్మడిగా పని చేస్తున్నారు. హోటల్‌లో బస చేసి ఉన్న వారి జాబితాలను సేకరించిన పోలీసులు విశ్లేషిస్తున్నారు. మరోపక్క రాకపోకలు సాగించే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసేలా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో జరిగిన గలాభా నేపథ్యంలో మరింత అప్రమత్తయ్యారు. ఈ నేపథ్యంలోనే తాజ్ కృష్ణతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోకి కేవలం అధీకృత వ్యక్తులనే అనుమతించాలని నిర్ణయించారు. ప్రతి రోజూ మూడు నాలుగు సార్లు అణువణువూ బాంబు నిర్వీర్యం బృందాలు, స్నిఫర్ డాగ్స్ తనిఖీ చేయనున్నారు. ఇద్దరు డీసీపీ స్థాయి అధికారుల నేతృత్వంలో ఇద్దరు అదనపు డీసీపీలు, నలుగురు ఏసీపీలు, తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్లు, 25 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు, 13 మంది ఏఎస్సైలు, 110 మంది కానిస్టేబుళ్లు, నాలుగు ప్లటూన్ల సాయుధ బలగాలు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తాయి. వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది సైతం అవసరమైన సంఖ్యలో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

స్వయంగా పర్యవేక్షిస్తున్న నగర కొత్వాల్



సీడబ్ల్యూసీకి సిటీ ముస్తాబు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలకు ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో తరలివస్తున్న అతిరథ మహారథులకు నగరం స్వాగతం పలుకుతోంది. సమావేశాల వేదిక తాజ్‌కృష్ణ హోటల్‌కు వెళ్లే మార్గాలను సుందరంగా అలంకరించిన పార్టీ నాయకత్వం.. భారీ కటౌట్లు, జెండాలు, ఫ్లెక్సీలతో ముంచెత్తింది. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్ కృష్ణలో శని, ఆదివారాల్లో జరగనున్న భేటీకి పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీ, ఖర్గే సహా అధినాయకత్వమంతా హాజరు కానుంది. పార్టీ రథ సారథులు నగరానికి కదిలి వస్తుండటంతో శ్రేణుల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. కాగా.. నగర శివారు తుక్కుగూడ వేదికగా జరిగే విజయభేరి సభకు నగర శివారు ప్రాంతాలు సైతం భారీగా ముస్తాబవుతున్నాయి. విజయభేరి బహిరంగ సభకు గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నుంచి భారీగా జనసమీకరణకు పార్టీ కసరత్తు చేస్తోంది.

నిలోఫర్‌లో బాలుడి అపహరణ

గుర్తు తెలియని మహిళ పనేనా?

- నాంపల్లి పీఎస్‌లో కేసు నమోదు
- అయిదు బృందాలతో గాలింపు
- కేసును త్వరలోనే ఛేదిస్తామన్న పోలీసులు



అపహరణకు గురైన బాలుడు (ఫైల్)



బాలుడి తల్లి ఫరీదా బేగం



రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణ కేంద్రమైన నిలోఫర్ ఆస్పత్రిలో ఆరు నెలల బాలుడు అపహరణకు గురయ్యాడు. ఈ ఘటన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట ప్రాంతానికి చెందిన ఫరీదాబేగం, సల్మాన్ ఖాన్ దంపతులకు ఇద్దరు కుమారులు. నాలుగేళ్ల కుమారుడు ఫర్హత్ ఖాన్ కొన్ని రోజులుగా విష జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్యం నిమిత్తం ఫర్హత్ ఖాన్‌ను గురువారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకు వచ్చారు. అదే రోజు రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్‌లోని డీఎస్‌ఆర్ వార్డులో చేర్చారు. ఫర్హత్ ఖాన్ కోలుకోవడంతో ప్రస్తుతం యూనిట్-4లో చికిత్స పొందుతున్నాడు.

- కాగా.. ఆరు నెలల రెండో కుమారుడు ఫైజల్ ఖాన్‌ను తమ వెంట ఆస్పత్రికి తీసుకువచ్చారు. వార్డులో చికిత్స పొందుతున్న పెద్ద కుమారుడు ఫర్హత్ ఖాన్ దగ్గర తండ్రి సల్మాన్ ఖాన్ ఉండగా, చిన్న కుమారుడు ఫైజల్ ఖాన్ తల్లి ఫరీదా బేగం ఇద్దరూ వార్డు బయట ఉన్నారు. ఈ క్రమంలో ఫరీదా బేగానికి ఓ గుర్తు తెలియని మహిళ పరిచయమైంది. ఇద్దరూ వరండాలో కూర్చుని ముచ్చట్లు పెట్టుకున్నారు. ఇదే సమయంలో ఫైజల్ ఖాన్ నిద్రపోయాడు. కుమారుడు నిద్రపోతుండటంతో తనకు పరిచయమైన గుర్తు తెలియని మహిళకు బాబును చూస్తూ ఉండమని చెప్పి భోజనం కోసం కిందకు వెళ్లింది.
- భోజనం తీసుకుని కింద నుంచి మొదటి అంతస్తులోనికి తిరిగి వచ్చే లోపు గుర్తు తెలియని మహిళ బాలుడు ఫైజల్ ఖాన్ కనిపించకుండా పోయారు. బాలుడి కోసం ఎంత వెతికినా జాడ కానరాకపోవడంతో తల్లి దండ్రులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. కిడ్నాప్‌నకు గురైన బాలుడి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గడచిన 24 గంటలుగా అన్ని కోణాల్లో విస్తృతంగా పరిశీలన చేస్తున్నారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, ఇప్పటికే అయిదు బృందాలను ఏర్పాటు చేశామని నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అభిలాష్ పేర్కొన్నారు.

అనుమానాలెన్నో..

రోగి సహాయకురాలిగా నిలోఫర్ ఆస్పత్రి రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్‌లోకి ఆగంతుకురాలు ప్రవేశించి.. ఓ మహిళను తన మాయ మాటలతో బుట్టలో వేసుకుని ఆమె ఆరు నెలల కుమారుడిని అపహరించిన ఘటన నగరంలో కలకలం రేపింది. ఆగంతుకురాలి తాలూకు బంధువులెవరైనా ఆస్పత్రిలో ఉన్నారా? లేక బాలుడిని ఎత్తుకెళ్లడానికే రోగి సహాయకురాలి అవతారంలో వచ్చిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. పిల్లలు లేని వారు వచ్చి రెక్కీ నిర్వహించారా? ఎవరైనా డబ్బులు ఇస్తే వచ్చి తీసుకెళ్లారా? అనే కోణాలూ కనిపిస్తున్నాయి. కొత్తవారు ఆస్పత్రికి వచ్చి పిల్లల్ని ఎత్తుకెళ్లడం అంత సులభమేమీ కాదని పలువురు నిలోఫర్ వైద్యులు చెబుతున్నారు. బాలుడి అపహరణ వెనక ఆస్పత్రికి చెందిన ఇంటి దొంగల ప్రమేయమేమైనా ఉందా? అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఘటన జరిగి 24 గంటలైనా బాలుడి ఆచూకీ లభించలేదు. పోలీసులకు సైతం చిన్నపాటి క్లూ కూడా దొరకకుండా దొంగలు జాగ్రత్త పడటం గమనార్హం. ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రవేశ మార్గంలో మినహా ఎక్కడా సీసీ కెమెరాలు పని చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే కిడ్నాపర్‌కు కలిసి వచ్చిందని అర్థమవుతోంది. విజిటింగ్ అవర్స్‌లో బాలుడిని కిడ్నాప్ చేసి ఉంటారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి అనుమానం వ్యక్తంచేశారు.

నవజాత శిశువు వదిలివేత

నిలోఫర్ ఆస్పత్రిలో అయిదు రోజుల మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. ఐసీయూ భవనంలోని మొదటి అంతస్తులో నేల మీద ఉన్న శిశువు ఏడుస్తూ కనిపించడంతో ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చి శిశు విహార్‌కు తరలించారు. నిలోఫర్‌లో లభ్యమైన శిశువుకు ఎలాంటి ట్యాగ్ లేదని, గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని, నిలోఫర్‌లోనే కాన్పు జరిగిందా? లేక బయట నుంచి వచ్చిన వ్యక్తులు వదలివెళ్లారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపారు.





విమోచన దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు

సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి, బీజేపీ జాతీయ నాయకుడు అమిత్‌షా ఈ కార్యక్రమానికి హాజరుకానుండటంతో పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, కళాకారులు రిహార్సల్స్ నిర్వహించారు. – సాక్షి, సిటీబ్యూరో



ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనం వీడాలి



ఓయూలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేస్తామని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ పై మౌనం వీడాలని జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ ధర్మతేజ అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట కొనసాగుతున్న దీక్షకు వివిధ కాలేజీలకు చెందిన అధ్యాపకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు వివిధ రూపాల్లో ఆందోళన కొనసాగిస్తున్నా ముఖ్యమంత్రి స్పందించడం లేదన్నారు. గత 11 రోజులుగా 'పెన్ డౌన్.. చాక్ డౌన్' పేరుతో విధులు బహిష్కరించినా మౌనం వహించడం దారుణమన్నారు. ఓయూలో ప్రజాస్వామ్యబద్ధంగా అధ్యాపకులు చేస్తున్న దీక్షకు టెంట్, మైక్‌కు అనుమతించకపోవడం అన్యాయమని యూనివర్సిటీ ప్రొ.కాశీం పేర్కొన్నారు. అన్ని అర్హతలతో అకాడమిక్‌గా, అడ్మినిస్ట్రేషన్ పరంగా సేవలందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సదానందరెడ్డి దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేల్పుల కుమార్, విజయేందర్‌రెడ్డి, సీహెచ్ వెంకటేష్, ఉపేందర్‌రావు, స్రవంతిరెడ్డి, రేష్మారెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

నో క్లాస్.. నో పే : ఓయూ రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ: చాక్‌డౌన్..పెన్‌డౌన్ పేరుతో గత 11 రోజులుగా విధులను బహిష్కరించి తరగతులకు గైర్హాజరవుతున్న కాంట్రాక్టు అధ్యాపకులకు నో క్లాస్...నో పే (పని చేయని వారికి వేతనం చెల్లించరు) విధానాన్ని అమలు చేయనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. ఓయూ క్యాంపస్‌లోని 9 కాలేజీల అధ్యాపకులతో పాటు కోఠి మహిళా కళాశాల, నిజాం, సైఫాబాద్, సికింద్రాబాద్ పీజీ కాలేజీలు, ఇతర కేంద్రాల అధ్యాపకులు వెంటనే విధుల్లో చేరాలన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళనల కారణంగా ఈ విద్యా సంవత్సరం కొత్త చేరిన ఇంజినీరింగ్, బీఏ, బీకాం, బీఎస్సీ తదితర యూజీ కోర్సుల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరగకపోతే నష్టపోతారన్నారు. అధ్యాపకులు రిజిస్టర్‌లో సంతకం పెట్టి విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనన్ని రోజులు వేతనాలు చెల్లించవద్దని ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు.

ట్రాఫిక్ పోలీసులకు అత్యాధునిక వాకీటాకీలు

శుక్రవారం అందించిన కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: సమకాలీన అవసరాలకు తగ్గట్టు నగర ట్రాఫిక్ విభాగానికి కొత్త సమాచార మార్పిడి వ్యవస్థ సమకూరుతోంది. ఇందులో భాగంగా తొలి విడతగా ఖరీదు చేసిన 1000 అత్యాధునిక వాకీటాకీలను కొత్వాల్ సీవీ ఆనంద్ శుక్రవారం అధికారులు, సిబ్బందికి అందించారు. నాంపల్లిలోని ట్రాఫిక్ కమిషనరేట్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ట్రాఫిక్ నిర్వహణలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని, ఇది ఎంత స్పష్టంగా ఉంటే సత్ఫలితాలు ఉంటాయని సీపీ అన్నారు. ఈ నేపథ్యంలోనే వాకీటాకీలు సహా అత్యాధునిక సమాచార మార్పిడి సాధనాలు ఖరీదు చేయడానికి రూ.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఓ విభాగం ఒకేసారి 1000 అత్యాధునిక వాకీటాకీలు వంటి పరికరాలు కొనుగోలు చేయడం దేశంలో ఇదే తొలిసారని ఆయన వివరించారు. ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు మాట్లాడుతూ... ఈ వాకీటాకీల్లో ఉన్న డ్యూయల్ మైక్రోఫోన్ల కారణంగా సమాచారం అందించే వ్యక్తి మాటలు మినహా చుట్టుపక్కల ఉన్న శబ్దాలు ఎదుటి వారికి వినిపించవని అన్నారు. గణేష్, బోనాలు వంటి కీలక బందోబస్తులో వీటి పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. మరో పక్క ఈ వాకీటాకీల్లో గతంలో వాటి కంటే అత్యధిక బ్యాటరీ బ్యాకప్‌తో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు రాహుల్ హెగ్డే, డి.శ్రీనివాస్, అదనపు డీసీపీ ఎస్.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



టెట్ ప్రశాంతం

సాక్షి,సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్ -2 పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని అధికారులు వెల్లడించారు. కొన్ని సెంటర్లలో ఆలస్యంగా వచ్చిన వారిని సైతం అనుమతించారు. హైదరాబాద్ జిల్లాలో పేపర్-1కు 91 శాతం, పేపర్-2లో 89.62 శాతం హాజరు శాతం నమోదైంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలో పేపర్-1కు 96.36 శాతం, పేపర్-2కు 82.71 శాతం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పేపర్-1కు 89.27 శాతం, పేపర్-2లో 88.55 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.

గాంధేయవాదుల శిక్షణ కేంద్రంగా..

- బోయిన్‌పల్లిలో గాంధీయన్ ఐడియాలజీ సెంటర్
- జాతీయ స్థాయి నాయకత్వ శిక్షణ కేంద్రం..
- మూడు బ్లాకులుగా నిర్మాణం
- కన్వెన్షన్ సెంటర్, హాస్టల్, గెస్ట్‌హౌస్..

కంటోన్మెంట్: కాంగ్రెస్ పార్టీ యువతకు గాంధీయిజాన్ని బోధిస్తూ సరికొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుడుతోంది. గాంధీయన్ ఐడియాలజీ సెంటర్ పేరిట బోయిన్‌పల్లిలోని 10 ఏకరాల సువిశాల స్థలంలో జాతీయ స్థాయి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు ఇటీవల కంటోన్మెంట్ బోర్డు నుంచి పూర్తి స్థాయి నిర్మాణ అనుమతులు పొందింది. టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ భవనానికి ఈ నెల 17న కాంగ్రెస్ అధినేత్రి శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం.

ఏమేం నిర్మిస్తున్నారు?

- బోయిన్‌పల్లి జీఎల్ఆర్ సర్వే నెంబర్ 502/పీ1, పీ2లోని 50,215 గజాల విస్తీర్ణంలో మూడు వేర్వేరు బ్లాకులుగా భారీ భవనాలు నిర్మించనున్నారు.
- 11,692 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మెయిన్ బ్లాక్ నిర్మాణం జరగనుంది. ఇందులోనే కన్వెన్షన్ సెంటర్ కూడా ఉంటుంది. పార్టీ కీలక సమావేశాలకు ఈ సెంటర్ వేదిక కానుంది. ముఖ్యంగా గ్రామీణ స్థాయి మొదలు జాతీయ స్థాయి వరకు పార్టీ అంతర్గత కమిటీల సమావేశాలు నిర్వహించుకునేలా నిర్మాణం చేపట్టనున్నారు.
- 6,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో హాస్టల్ బ్లాకుల నిర్మాణం చేపట్టనున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నాయకత్వ శిక్షణ కోసం వచ్చే వారికి ఇక్కడే తాత్కాలిక బస ఏర్పాట్లు చేయనున్నారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎంపీ వరకు ప్రజాప్రతినిధులతో పాటు, వివిధ ప్రజా సమస్యలపై సంపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ కార్యక్రమాల రూపకల్పన ఉంటుందని సీనియర్ నేతలు పేర్కొన్నారు.
- 1051 చదరపు మీటర్ల విస్తీర్ణంలో గెస్ట్ హౌస్ నిర్మిస్తున్నారు. రాష్ట్రాన్ని సందర్శించే జాతీయ స్థాయి నేతలు, శిక్షణ కార్యక్రమాలకు గెస్ట్‌లుగా వచ్చే వారికి ఈ గెస్ట్ హౌస్‌లో బస కల్పిస్తారు. మొత్తానికి గాంధీయన్ ఐడియాలజీ సెంటర్ జాతీయ స్థాయిలో గాంధేయవాదులను తయారు చేసే సంస్థగా రూపు దిద్దుకునే అవకాశముందని పార్టీ నేతలు చెబుతున్నారు.

టీఎస్‌బీ మెట్‌లైఫ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ట్రోఫీ లోగో ఆవిష్కరణ



ట్రోఫీ లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: బ్యాడ్మింటన్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, స్థిరత్వం, టీం వర్క్, శ్రేష్టతను సాధించడానికి బోధించే జీవన విధానమని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, అర్జునా అవార్డు గ్రహీతలు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అన్నారు. పీఎస్‌బీ మెట్‌లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (2023) ట్రోఫీ లోగోను శుక్రవారం సోమాజిగూడ పార్క్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఎస్‌బీ మెట్‌లైఫ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఆశీష్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని వర్ధమాన క్రీడాకారుల్లో ప్రతిభను బయటకు తీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 10 ప్రధాన నగరాల్లో 9 నుంచి 17 సంవత్సరాల వరకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. నగరంలో 19 అక్టోబర్ నుంచి 23 వరకు పోటీలు జరుగుతాయని, అన్ని నగరాల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారితో పోటీలు నిర్వహించి చాంపియన్‌షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9820006190 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరుతో లూటీ

లింకు పంపి రూ.28 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: కేవైసీ అప్‌డేట్ పేరుతో సైబర్ నేరగాళ్లు అకౌంట్‌ను లూటీ చేశారు. బ్యాంకు నుంచి లింకు వచ్చిందని భావించిన అతను క్లిక్ చేయడంతో ఖాతాలో ఉన్న సొమ్మంతా స్వాహా చేశారు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ బాధితుడు సిటీ సైబర్ క్రైం ఏసీపీ ఆర్.జి.శివమారుతిని కలిసి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల నగరానికి చెందిన యువకుడికి యాక్సిస్ బ్యాంకు పేరుతో ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అకౌంట్ కేవైసీ అప్‌డేట్ చేసుకోని కారణంగా రద్దయ్యే అవకాశం ఉందని అందులో పేర్కొన్నారు. దీంతో మెసేజ్‌లోని లింకును క్లిక్ చేసిన యువకుడు అప్‌డేట్ చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ప్రక్రియ జరుగుతుండగానే ఓ వ్యక్తి కాల్ చేసి తాను యాక్సిస్ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. కాల్ మాట్లాడుతూనే ఓటీపీలు అడిగి పలు దఫాలుగా రూ.28లక్షలు దోచేశాడు. ఇంకా డబ్బు అకౌంట్‌లో జమ చేయాలని ఒత్తిడి చేయడంతో తాను మోసపోయినట్లు గుర్తించి బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులకు గాయాలు




శంషాబాద్: వీధి కుక్కల దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడిన సంఘటన శుక్రవారం స్థానిక అహ్మద్‌నగర్, సాదత్ కాలనీలో చోటు చేసుకుంది. శుక్రవారం వీధిలో ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఓ చిన్నారికి తలపై భాగంలో కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చిన్నారులను రక్షించి ఆస్పత్రికి తరలించారు. కాలనీలో వీధి కుక్కల బెడదపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధితుల తల్లిదండ్రులు, కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

స్పెషల్ ఓటర్ డ్రైవ్‌కు 13,319 దరఖాస్తులు

సాక్షి,సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండాలనే లక్ష్యంతో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లలోని ఓటర్ల కోసం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్,సంగారెడ్డి జిల్లాల్లో కొత్తగా ఓటరు నమోదు కోసం 37,588, చిరునామా మార్పులు, పొరపాట్ల సవరణకు 13,319 దరఖాస్తులు అందినట్లు జాయింట్ సీఈవో ఓ ప్రకటనలో తెలిపారు. రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల సమన్వయంతో 757 ఎన్నికల విభాగం బృందాలు ఇందుకు కృషి చేశాయన్నారు. సేకరించిన దరఖాస్తుల పరిశీలన ఎప్పటికప్పుడు జరుగుతోందని, అన్ని దరఖాస్తులను ఈనెల 27లోగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

హైకోర్టుకు హాజరైన బండి సంజయ్

దూద్‌బౌలి: కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎన్నిక చెల్లదంటూ కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ హైకోర్టులో వేసిన పిటిషన్‌లో భాగంగా శుక్రవారం ఆయన హైకోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా చార్మినార్ పోలీసులు హైకోర్టు, మదీనా, సిటీ కాలేజీ పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు హైకోర్టుకు చేరుకున్న బండి సంజయ్ హైకోర్టులో లంచ్ మోషన్ తర్వాత క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా తన వాదనలు వినిపించేందుకు వచ్చారు.

బ్లడ్ డొనేషన్ పేరుతోనూ మోసాలు!

- సోషల్‌మీడియాలో చూసి ఎర వేస్తున్న వైనం
- నగదు తీసుకున్నాక స్పందించని రెడ్డి సందీప్
- నిందితుడి అరెస్ట్



సాక్షి, సిటీబ్యూరో: రక్తం, ప్లాస్మా వంటివి అత్యవసరమైన వారిని సంప్రదించి, వారి నుంచి కొంత మొత్తం తీసుకుని మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని సీసీఎస్ ఆధీనంలోని వెస్ట్ జోన్ క్రైమ్ టీమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతగాడు గతంలోనూ ఇదే తరహా నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లినట్లు డీసీపీ శిల్పవల్లి శుక్రవారం పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా, పొనుగుటివలస ప్రాంతానికి చెందిన రెడ్డి సందీప్ 2016లో డిగ్రీ పూర్తి చేశాడు. ఆపై హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ కోర్సు కూడా పూర్తి చేశాడు. నిరుద్యోగంతో పాటు ఆర్థిక ఇబ్బందులు చుట్టు ముట్టడంతో నేరాల బాటపట్టాడు. విశాఖపట్నంలోని ద్వారక, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేశాడు. ఆయా కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటికి వచ్చాడు. 2020లో కోవిడ్ ఉధృతి నేపథ్యంలో ఆ రోగులకు వైద్యం చేయడానికి కోలుకున్న పేషెంట్ ప్లాస్మా అవసరం పెరిగింది. దీంతో పలువురు సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్ కేంద్రంగా డోనర్స్ కోసం ప్రయత్నాలు చేశారు. ఈ విషయం గమనించిన సందీప్ డోనర్ పేరుతో మోసాలు చేయాలని పథకం వేశాడు. దీనిని అమలులో పెట్టడంలో భాగంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో సెర్చ్ చేశాడు. ప్లాస్మా డోనర్స్ కోసం వాటిలో ప్రకటనలు ఇచ్చిన వారికి ఫోన్లు చేసేవాడు. తాను ఇటీవల కోవిడ్ నుంచి కోలుకున్నానని, నాది మీకు కావాల్సిన బ్లడ్ గ్రూప్ అని నమ్మబలికేవాడు. తాను ప్లాస్మా డొనేట్ చేయడానికి సిద్ధంగా ఉన్నానంటూ చెప్పేవాడు. అయితే తాను శ్రీకాకుళం నుంచి రావడానికి రవాణా, ఇతర ఖర్చులకు కొంత డబ్బు కావాలని కోరేవాడు. తన బ్యాంకు ఖాతా లేదా ఈ-వాలెట్ వివరాలు పంపి వాటిలో డబ్బు వేయించుకునే వాడు. ఆపై వారి ఫోన్లకు స్పందించకుండా మోసం చేసేవాడు. మరికొందరికి కోవిడ్ రోగులకు చికిత్స కోసం వాడే యాంటీ వైరల్ డ్రగ్స్ ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేశాడు. ఇలా రెండు రాష్ట్రాల్లోనూ కలిపి దాదాపు 200 మందిని మోసం చేశాడు. ఇలా వసూలు చేసిన మొత్తాన్ని బెట్టింగ్‌లతో పెట్టేవాడని డీసీపీ తెలిపారు. నగరానికి చెందిన కొందరినీ మోసం చేయడంతో ఇతడిపై సిటీలోని పంజగుట్ట, రామ్‌గోపాల్‌పేట, బంజారాహిల్స్‌తో పాటు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలోనూ కేసులు నమోదు కావడంతో అరెస్టయ్యాడు. కొన్ని కేసుల్లో శిక్ష కూడా పడింది. తాజాగా మరోసారి సోషల్‌మీడియా వేదికగా బ్లడ్, ప్లాస్మా డొనేషన్ పేరుతో మోసాలు ప్రారంభించిన అతడిపై దోమలగూడ ఠాణాలో కేసు నమోదు కావడంతో వాంటెడ్‌గా మారాడు. సీసీఎస్‌లోని వెస్ట్‌జోన్ క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ డి.భిక్షపతి నేతృత్వంలోని బృందం శుక్రవారం పట్టుకుంది.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: అమర్ కో ఆపరేటివ్ సొసైటీ 11 కేవీ ఫీడర్ జూబ్లీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అమర్‌సొసైటీ, కన్వరీ హిల్స్ ఫేజ్–2, ఆర్ట్ గ్యాలరీ లైన్, దుర్గంచెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఆర్ట్ గ్యాలరీ 11కేవీ ఫీడర్, జూబ్లీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని కావేరీ హిల్స్, డి–మార్ట్, విక్రమ్ హాస్పిటల్ లైన్, నెక్టార్ గార్డెన్‌లైన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, బెంజ్ షోరూం 11కేవీ ఫీడర్ రవీంద్రసొసైటీ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డి–మార్ట్‌లైన్, డాక్టర్స్ కాలనీ వెనుకవైపు, ఆంధ్రా బస్తీ, పీఎస్ కావేరీ హిల్స్–2 వెనుకవైపు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

గణేష్ విగ్రహాల తయారీలో చిన్నారులు



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న చిన్నారులు

శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు మట్టి వినాయక విగ్రహాలను తయారుచేసి ప్రతిఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని, మేము మా నివాసంలో మట్టి వినాయకులను పూజిస్తామని ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం రాజీవ్‌నగర్‌కాలనీలోని బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్‌లో చిన్నారులు మట్టి వినాయకులను తయారు చేసి, వినాయకుడి చవితి విశిష్టతను తెలుసుకున్నారు. తాము మట్టి వినాయకులను పూజిస్తామన్నారు. స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్, ప్రిన్సిపాల్ శాంతిప్రియ పాల్గొన్నారు.


ఘనంగా ఇంజినీర్స్ డే



అవార్డును అందుకుంటున్న చంద్రమోహన్‌రెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో శుక్రవారం ఇంజినీర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ప్రతి సంవత్సరం అందజేసే ఇంజినీర్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి. సతీష్‌రెడ్డి, డీఆర్‌డీఎల్ హైదరాబాద్ డైరెక్టర్ జి.ఎ.శ్రీనివాసమూర్తిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అవార్డును ఎండీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డికి అందజేశారు. ఇంజినీర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.నిర్మలాదేవి, డాక్టర్ ఎస్.ప్రదీప్‌రెడ్డిలకు అందజేశారు. యంగ్ ఇంజినీర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును డాక్టర్ ఎం.డి.అబ్దుల్‌రహీంకు అందజేశారు. ఐఈఐ చైర్మన్ బి.బ్రహ్మారెడ్డి, ఇంజినీర్ ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి

బంజారాహిల్స్: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకేరోజు వస్తుండటంతో కుల మతాలకు అతీతంగా ప్రజలంతా ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని బంజారాహిల్స్ ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. సెక్టార్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్‌నంబరు 14 నందినగర్, నూర్‌నగర్, జహీరానగర్ తదితర ప్రాంతాల్లో మండపాల నిర్వాహకులతో ఆయన శాంతిసమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండపాల ఎత్తు పెంచేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇష్టారాజ్యంగా కరెంటు వైర్లు వేయకూడదని, ట్రాన్స్‌కో లైన్‌మెన్లతో కనెక్షన్ తీసుకోంటే భద్రత ఉంటుందన్నారు. ప్రతి రోజు ముగ్గురు నిర్వాహకులు మండపాల్లో పడుకోవాలని కోరారు. తన సెక్టార్ పరిధిని నాలుగు క్లస్టర్లుగా విభజించడం జరిగిందని, ప్రతి క్లస్టర్‌కు ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేశామన్నారు. ఈ గ్రూపులో ఆ ప్రాంత పెద్దలు, యువజన సంఘాలు, మండపాల నిర్వాహకులు ఉంటారని, ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకోవడం జరుగుతుందన్నారు. పరస్పర సహకారంతోనే పండుగలను సామరస్య పూర్వక వాతావరణంలో నిర్వహించుకోగలమన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు

బస్తీ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రారంభం



ప్రశాసన్‌నగర్ బస్తీ దవాఖానాలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమం

- సామాన్యుడి ఆరోగ్యానికి భరోసా
- ఉచితంగా చికిత్సలు, మందుల పంపిణీ
- ఆరోగ్య మేళాల్లో వైద్య పరీక్షలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో ఉన్న 13 బస్తీ దవాఖానాలు, తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

> ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ' పేరుతో ఆరోగ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలో ప్రారంభించిన విషయం విదితమే.

- బస్తీ దవాఖానాలు, వెల్‌నెస్ సెంటర్లు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని వైద్యాధికారులు ప్రారంభించగా ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రెండు వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు.
- పీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్లు, బస్తీ దవాఖానాల పరిధిలో కార్యకలాపాలు నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించారు. వీటిని పక్కాగా అమలుచేయాలని వైద్యాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇంటింటికీ 'ఆభా' కార్డుల పంపిణీ

- ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి కంప్యూటర్‌లో నమోదు చేసి కుటుంబ సభ్యులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఆభ) కార్డులు అందించనున్నారు. ఇప్పటికే ఆస్పత్రుల ద్వారా ఆభ కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈ కార్డు ఉంటే దేశ వ్యాప్తంగా ఎక్కడ ప్రభుత్వ ఆస్పత్రికైనా ఎలాంటి పత్రాలు లేకుండా, రికార్డులు చూపించకుండానే వెళ్లి వైద్య సేవలను పొందవచ్చు.

ఆరోగ్య శిబిరాల నిర్వహణ

- ఆయుష్మాన్ భవ ద్వారా బస్తీలు, మురికివాడలు, కాలనీల్లో విస్తృతంగా వైద్య శిబిరాలు ఆరోగ్య మేళా పేరుతో నిర్వహిస్తారు. ప్రజలకు అన్ని విభాగాల వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు. ఏదైనా వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వ ఆస్పత్రులు ద్వారా ఉచితంగా చికిత్సలు, మందులు అందిస్తారు. బస్తీల్లో ఆయుష్మాన్ సభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న సౌకర్యాలు అందిస్తున్న వైద్య సేవలను వివరాలు అందిస్తారు. అలాగే ప్రజలకు అవయవదాన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తారు. ఒకరి అవయవాలు మరొకరికి ఎలా పని చేస్తాయో వివరిస్తారు. యువకులతో అవయవదానంపై ప్రతిజ్ఞ చేయిస్తారు.

అవయవ దానంపై ప్రతిజ్ఞ చేయించాం



ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని మా బస్తీ దవాఖానాలో బుధవారం ప్రారంభించాము. ఇందులో భాగంగా దీని ప్రయోజనాలను ప్రజలకు వివరించాం. అవయవ దానంపై ప్రతిజ్ఞ కూడా చేయించడం జరిగింది. మన దేశంలో అయవవ మార్పిడికి అవసరమైన అవయవాల, కణజాలల కొరత కారణంగా అనేక మంది రోగులు బాధపడుతున్నందున నేను, నా కుటుంబ సభ్యులను, నా స్నేహితులను, ఇతర పౌరులను అవయవ దానం చేసేలా ప్రోత్సహిస్తానని ప్రతిజ్ఞ ఉంటుంది. అలాగే ఆభ కార్యక్రమంలో భాగంగా వెల్‌నెస్ సెంటర్లలో ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఉచిత మందులు, నిపుణులచే ఉచిత టెలీకన్సల్టేషన్, ఆరోగ్యంపై పెంపొందించే కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుంది. హెల్త్ మేళాలు ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ అమూల్య, ప్రశాసన్‌నగర్ బస్తీ దవాఖాన వెల్‌నెస్ సెంటర్

చలో నాగర్‌కర్నూల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: పండుగలా పాలమూరు ప్రాజెక్టు ప్రారంభోత్సవం–చలో నాగర్‌కర్నూల్ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. పాలమూరు ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కార్యకర్తలు భారీగా తరలిరావాలని సూచించారు. కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. అందుకు ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ నెల 16న ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా నియోజకవర్గం నుంచి బస్సులతోపాటు కారు, బైకు ర్యాలీల ద్వారా నాగర్ కర్నూల్ అట్టహాసంగా తరలివెళ్తామన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి

టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి



పార్టీలో చేరిన నేతలతో విజయారెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నంబర్–2 ఇందిరానగర్ బస్తీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బస్తీకి చెందిన కిరణ్, వీరూనాయక్, సోనూ, శ్రీరాములు నాయక్, జగదీష్, కిట్టూ నాయక్ తదితరులతో పాటు 20 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికి టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి పార్టీ కండువాలు వేసి ఘనంగా అహ్వానించారు. అనంతరం విజయారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం తద్వారా దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పార్టీ కోసం పని చేసే వారికి కాంగ్రెస్‌లో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మోహన్‌యాదవ్, బాబాగౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్



బంజారాహిల్స్: వినాయక చవితి నేపథ్యంలో జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అదనపు బలగాలను మోహరించనున్నట్లు జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతం నగర్ కమ్యూనిటీ హాల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటికి రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో మండపాల నిర్వాహకులతో సమావేశాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న పోలీసులతోపాటు అదనంగా పోలీసులను నియమిస్తామన్నారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో 140 వరకు మండపాల దరఖాస్తులు అందాయన్నారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 170కి పైగా మండపాలు ఏర్పాటు కానున్నాయని, ఇంకో రెండు రోజులపాటు దరఖాస్తులు తీసుకొంటారన్నారు. ప్రతి మండప నిర్వాహకుడు తప్పనిసరిగా మండపానికి సంబంధించిన వివరాలను పోలీసులకు అందించాలన్నారు. కరెంటు కనెక్షన్ తీసుకొనేటప్పుడు తప్పనిసరిగా ట్రాన్స్‌కో అధికారులతో అనుమతి ఉండాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, మండపంలో రోజూ నిర్వాహకుల్లో ముగ్గురు పడుకోవాలన్నారు. పోలీసులకు సంపూర్ణ సహకారం అందించినప్పుడే పండుగలు ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకోవచ్చన్నారు. పోలీసు సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి వినాయక మండప ప్రాంతాన్ని ఇప్పటికే పరిశీలించామని, నిర్వాహులతో సెక్టార్ ఎస్‌ఐ ఎప్పటికప్పుడు అభిప్రాయాలు పంచుకుంటున్నారని అన్నారు.

సందడిగా 'డబుల్' ఇళ్ల కేటాయింపు



డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: డబుల్ బెడ్ రూం ఇళ్ల రెండో విడత కేటాయింపు లాటరీ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సందడిగా నిర్వహించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గానికి రెండో విడతలో 500ల మందికి లబ్ధి చేకూరుందని ఆయన వెల్లడించారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు వస్తాయని, విడతల వారీగా కేటాయింపు జరుగుతందని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. నియోజకవర్గానికి భారీగా డబుల్ బెడ్ రూం ఇళ్లు రాబోతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదేనని ఆయన స్పష్టం చేశారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

బంజారాహిల్స్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజిద్దాం అనే నినాదంతో ప్రభుత్వం భక్తులకు ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి ఈ ఏడాది కూడా శ్రీకారం చుట్టింది. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ అధికారులు ఉచితంగా విగ్రహాలు పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో సోమాజీగూడ ప్రెస్ క్లబ్, గ్రీన్‌ల్యాండ్స్, కుందన్‌బాగ్, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 10 ఐఏఎస్ క్వార్టర్స్, కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్‌లలో వీటిని పంపిణీ చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో మొత్తం 80100 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సర్కిల్–18 కింద వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో 15600 మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. సర్కిల్–17 పరిధిలోని ఖైరతాబాద్, సోమాజీగూడ డివిజన్‌ల పరిధిలో 8196 విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. అటు జీహెచ్‌ఎంసీ, ఇటు హెచ్‌ఎండీఏ ఈ పంపిణీ కార్యక్రమాలు చేపట్టనున్నాయి.

ప్రెస్‌క్లబ్‌లో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ ప్రారంభం



ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడుకి విగ్రహాన్ని అందిస్తున్న విద్యాసాగర్

పంజగుట్ట: సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. విలేకరులే కాకుండా ఎవరైనా మట్టి వినాయక విగ్రహాలను తీసుకెళ్లవచ్చని హెచ్‌ఎండీఏ అధికారులు వెల్లడించారు. వ్యక్తి పేరు, ఫోన్ నెంబర్ తీసుకుని వినాయక ప్రతిమను ఇస్తున్నామన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రావు, సభ్యులకు హెచ్‌ఎండీఏ ఏఈ విద్యాసాగర్ విగ్రమాలను అందజేశారు.

కవితపై కేంద్రం కుట్రలను సహించం

ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం

పంజగుట్ట: బతుకమ్మ పండగ వస్తున్న నేపథ్యంలో తెలంగాణ ఆడబిడ్డ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు లభిస్తున్న ప్రజాదరణను జీర్ణించుకోలేకే ఢిల్లీ లిక్కర్ కేసుతో ఈడీతో తిరిగి నోటీసులు పంపించారని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగ పరిధిలో పనిచెయ్యాల్సిన ఈడీ, సీబీఐ రాజ్యాంగం మర్చిపోయి ప్రధాని నరేంద్రమోదీ, అమీత్‌షా చెప్పుచేతుల్లో నడుస్తున్నాయన్నారు. కేంద్రం చేస్తున్న దుర్మార్గ పాలనను బట్టబయలు చేసేందుకు అక్టోబర్ 11న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో లక్షలాది మందితో భారీ సభ నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. మోదీ ప్రధానిలా కాకుండా ఓ నియంతలా పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో డాక్టర్ సంజీవ్ నాయక్, గంధం రాములు, కోలా శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలి

పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్

వెంగళరావునగర్: మంటపాల వద్ద అపరిచిత వ్యక్తుల కదలికలపై పీస్ కమిటీ సభ్యులు నిఘా ఉంచాలని, ఎలాంటి అనుమానం వచ్చినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ తెలియజేశారు. మధురానగర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం రాత్రి పీస్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మోహన్‌కుమార్ మాట్లాడుతూ... పీస్ కమిటీ సభ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మంటపాల వద్ద హడావుడి సృష్టించాలని చూసినా, గొడవలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా అలాంటి వారిని సున్నితంగా వారించాలన్నారు. పీస్ కమిటీ సభ్యుల సహకారంతో గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా విధులు నిర్వహించాలని అన్నారు. మధురానగర్, పంజగుట్ట ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, హైదరాబాద్ సెంట్రల్ పీస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కిషన్‌శర్మ, వెస్ట్‌జోన్ అధ్యక్షురాలు తేజో విజయ్‌కుమార్, బాలక్‌దాస్, నయీమ్, అసద్, మధురానగర్ అసోసియేషన్ నేతలు కోడె సాంబశివరావు, కళ్యాణ చక్రవర్తి, రాజేంద్రప్రసాద్, కె.సుధాకర్, పంజగుట్ట, మధురానగర్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

45 రోజులపాటు భారత భాగ్య సమృద్ధి యజ్ఞం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత

బంజారాహిల్స్: భారత భాగ్య సమృద్ధి యజ్ఞం పేరుతో 45 రోజులపాటు సీతారాంబాగ్ రామమందిరంలో దేశ సర్వతోముఖాభివృద్ధి, భారతీయుల శ్రేయస్సు భాగ్యనగర ప్రజల హితం కాంక్షిస్తూ అక్టోబరు 15 నుంచి నవంబర్ 27వ తేదీ వరకు మహాయజ్ఞాన్ని నిర్వహించనున్నట్లు లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని సంస్థ కార్యాలయలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఇందులో పలు హిందూ ధార్మిక సంస్థలు పాల్గొంటాయన్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో 45 రోజులపాటు సర్వకార్యసిద్ధి సహస్ర చండీ సహిత మహారుద్ర కామేశ్వర కామేశ్వరీ యాగం జరుగుతుందన్నారు. వైదిక ధర్మంలో పేర్కొన్న 36 రకాల వైదిక విధులు, 12 రకాలైన కళ్యాణాలతో పాటు పలు హోమాలు జరుగుతాయన్నారు. దీనికి సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని శనివారం నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యమన్‌సింగ్, ప్రమోద్‌కుమార్, రాజశేఖర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వాలని నిమ్స్ సెక్యూరిటీ గార్డుల వినతి

సాక్షి, సిటీబ్యూరో: నిమ్స్ హాస్పిటల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల ఈ ఏడాది ఆగస్టు జీతాలు వెంటనే ఇప్పించాలని, అందరు సెక్యూరిటీ గార్డులకు ఒకే విధమైన జీతాలను అందించాలని నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్ కోరింది. ఈ మేరకు శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్పకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ... కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులను పర్యవేక్షించే క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్ సంస్థ వారు బిల్లులు పెట్టడం లేదని, పాత చెక్కులు రెడీగా ఉన్న తీసుకెళ్లడం లేదన్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చి అగ్రిమెంట్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. వీలైనంత తొందరలో సెక్యూరిటీ గార్డులకు జీతాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు ఎం.వెంకటేష్, ఉపాధ్యక్షురాలు కుర్ర లక్ష్మి, కోశాధికారి ఎ.కవిత, అంబయ్య, సోనాలి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బస్సులో కానిస్టేబుల్ గోల్డ్‌చైన్ చోరీ

వెంగళరావునగర్: బస్సు ఎక్కి దిగే సమయానికి గోల్డ్ చైన్ చోరీకి గురైనట్టు మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మహేశ్వరం మండలం కల్వకోలి గ్రామానికి చెందిన బక్కని రాజశేఖర్ ఇబ్రహీంపట్నంలోని టీఎస్ఎస్‌పీ 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం మెహిదీపట్నంలోని సరోజినీ కంటి ఆస్పత్రి వద్ద నుంచి మైత్రీవనం వెళ్లేందుకు సిటీ బస్సు ఎక్కాడు. బస్సు రద్దీగా ఉండటం వల్ల ముగ్గురు తనను ఆనుకుని ఒత్తిడికి గురి చేశారు. చివరకు బస్సు మైత్రీవనం వద్దకు రాగానే దిగిపోయారు. అనంతరం షర్టును పరిశీలించుకోగా అతని మెడలో ఉండాల్సిన 15 గ్రాముల గోల్డ్ చైన్ మాయం అయింది. దాంతో బస్సులో ఒత్తిడికి గురి చేసిన ముగ్గురే చైన్ చోరీ చేసినట్టు గ్రహించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఒత్తిడిని వదిలేయండి ఇలా...

ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు పరుగులు మొదలు. చేయాల్సిన పనుల చిట్టా చాంతాడంత. దీంతో హడావుడి, ఆందోళన. ఫలితం ఒత్తిడి. అందుకనే ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళనతో చిత్తవుతున్నారు. వీటి వల్ల వచ్చే శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటే చాలా అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు ఇంట్లో మనంతట మనం పాటించగల చిన్న చిట్కాలను చెబుతున్నారు. అవేంటో చూద్దామా..?

గోరు వెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. శరీరంలో ఎక్కడైనా నొప్పులుగా అనిపిస్తే చిన్నగా మసాజ్ చేసుకోవడం, కండరాలన్నీ సాగేలా ఒళ్లు విరుచుకోవడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గుతుంది. బాత్ రూమ్‌లో కూనిరాగాలు తీయడం లేదా ఏదైనా లైట్ మ్యూజిక్‌ని పెట్టుకుని, గోరువెచ్చని నీటితో శరీరం, మనస్సు తేలిక పడేంతవరకు టబ్ బాత్ చేయాలి. అందుకు మంచి సువాసన ఉన్నసహజమైన సబ్బును ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

నృత్యం...

నృత్యం చేయడం అనేది ఒత్తిడి నివారిణిలా పని చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి సంగీతాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా డ్యాన్స్ చేయవచ్చు. ఎవరైనా ఉన్నప్పుడు చేయడం మొహమాటం అయితే ఎవరూ లేనప్పుడు ఆ పని చేయండి. దీనివల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది.

ఇష్టమైన వారితో ప్రేమగా...

ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇష్టమైన వారితో ప్రేమగా... సంతోషంగా గడిపేందుకు ప్రయత్నించండి. అందువల్ల శరీరంలో డోపమైన్ లాంటి హ్యాపీ హార్మోన్‌లు విడుదలవుతాయి. దీంతో మీరు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

బబుల్ ర్యాప్‌లను పగలగొట్టడం...

బబుల్ ర్యాప్ కవర్లను చూడగానే అంతా వాటిని పగలగొట్టాలని ఉవ్విళ్లూరతారు. అందుకు కారణాలు లేకపోలేదు. అలా వాటిని పేల్చడం వల్ల మనలో ఓ రకమైన ఆనందం కలుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందువల్లనే మనం వాటిని పేల్చేందుకు ఇష్ట పడుతుంటాం.

మంచి పుస్తకాలు చదవడం...

మంచి పుస్తకాలు, పేపర్లు చదవడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఒత్తిడిగా అనిపించినప్పుడు మీకు నచ్చిన పుస్తకం తీసి చదవండి. వెంటనే తగ్గుముఖం పడుతుంది ఆ ఒత్తిడి. అలాగే రోజూ దినపత్రికలను చదవడం కూడా ఒత్తిడి నివారణలో ఒక భాగం. దినపత్రికలు చదవడమనగానే నేరవార్తలు, హత్యావార్తలు కాదు. మనసుకు కాస్తంత ఆహ్లాదం కలిగించే వార్తలు చదవడం మేలు.

ఆలయ సందర్శనం...

మీ మతాన్ని అనుసరించి మీరు ప్రార్థనామందిరాలను సందర్శించడం మంచిది. రోజూ కాసేపు పూజామందిరంలో గడపడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాగని దేనినీ అతిగా చేయరాదు. గంటలు గంటలు పూజలు చేస్తూ గడపడం కూడా మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆలయానికి లేదా మసీద్‌కు లేదా చర్చికి వెళ్లడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

మీరు ఒత్తిడిలో ఉన్నారు అనుకున్నప్పుడువీటిలో మీకు వీలైనవాటిని పాటించి చూడండి.

అన్నింటికన్నా ముఖ్యం ఒత్తిడి వచ్చాక బాధ పడేకంటే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం చాలా ఉత్తమం. అదేవిధంగా ఒత్తిడి ఎందువల్ల వస్తుందో తెలుసుకుంటే నివారించుకోవడం సులభం కాబట్టి, ముందుగా మీ పనులను ప్రశాంతగా పూర్తి చేయడం ఆరంభించండి.



ధ్యానం...

ఒత్తిడి నుంచి బయట పడటానికి ధ్యానం అద్భుతమైన మార్గం అని చాలా అధ్యయనాల్లో తేలింది. శ్వాస మీద ధ్యాస పెట్టి కేవలం రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నా సరే అది మీ శరీరంలో స్ట్రెస్ హార్మోన్ సార్టిసాల్ స్థాయుల్ని తగ్గిస్తుంది.

ఆహారానికి సుగంధం
ఆరోగ్యానికి అందలం




ఆహారం సులభంగా జీర్ణమవడానికి ఆహారంలో కొన్ని సుగంధ ద్రవ్యాలను చేర్చుకుంటే మేలు. అవేంటో, ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం... జీర్ణశక్తి బాగుంటే ఆరోగ్యం బాగున్నట్లే. మనం తీసుకునే ఆహారం మీదనే అది జీర్ణమవడం ఆధారపడి ఉంటుంది. మన వంటిళ్లలో సహజంగానే జీర్ణశక్తిని పెంచే సుగంధ ద్రవ్యాలు బోలెడుంటాయి. అలాంటి వాటిలో తేలికగా అందుబాటులో ఉండే పదార్థాలే ఎక్కువ. వాటిని వాడటం ద్వారా జీర్ణశక్తి ఎలా మెరుగవుతుందో చూద్దాం...



అల్లం...

దీర్ఘకాలిక అజీర్తి సమస్యలు ఉన్న వాళ్లకి అల్లం మంచి మందు. ఇది కడుపు నొప్పి రాకుండా చేస్తుంది. అల్లం టీ తాగడం, వండుకునే ఆహార పదార్థాల్లో కొంచెం అల్లాన్ని చేర్చడం ద్వారా ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. కడుపు ఖాళీ అవడానికీ ఇది సహకరిస్తుంది.



ధనియాలు...

కడుపు ఉబ్బరంగా, వికారంగా ఉన్నప్పుడు కాసిని ధనియాలు నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ధనియాల్లో ఉండే కొన్ని లక్షణాల వల్ల గ్యాస్ సమస్యలు దూరం అవుతాయి.



యాలకులు...

కడుపులో మంట, నొప్పి, వికారం లాంటి వాటికి యాలకులు మంచి మందులా పని చేస్తాయి. దీంట్లో మాంగనీసు ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న ఆహారం అరిగి శక్తినిచ్చేలా చేస్తుంది.

మధుమేహం నుంచి కాపాడుతుంది.



మెంతులు...

నానబెట్టిన మెంతుల్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అజీర్తి, మలబద్ధకం లాంటి వాటికి పరిష్కారం దొరుకుతుంది. పేగుల ఆరోగ్యం బాగుంటుంది.



సోంపు...

ఆహారం తేలిగ్గా జీర్ణం కావడానికి సోంపు చాలా మంచిది. ఇంట్లో కూడా తిన్న వెంటనే కొన్ని సోంపు గింజలు నమిలితే దీనిలో ఉండే పొటాషియం, జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్ లాంటి ఖనిజాలు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిజేయడంలో సహకరిస్తాయి.



జీలకర్ర...

జీలకర్రలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పాస్పరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, సి, కె, ఇ, బీ 6 కూడా ఉంటాయి. రోజూ టీ స్పూను జీలకర్ర తీసుకోవడం వల్ల ఈ పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పేగుల్లో పేరుకుపోయిన మలినాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. దీన్ని భోజనానికి ముందు తీసుకుంటే డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియలో సహకరిస్తుంది.

అందువల్ల ఈ సుగంధ ద్రవ్యాలను తప్పకుండా తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



- ఉసిరి పచ్చడి తీసుకోవడం, తేనెలో నానపెట్టిన ఉసిరిని నిత్యం పద్ధతి ప్రకారం సేవించడం ద్వారా దృష్టిలోపం తగ్గుతుంది. ఉసిరి పొడిని నిత్యం పరకడుపున తేనెతో కలిపి సేవించడం వల్ల వత్తిడి, అలసట తగ్గుతుంది.



- ఎండు ద్రాక్షలు లేదా కిస్‌మిస్‌లు వాడడం మంచిది. వీటికి చలువ చేసే గుణం వుంది. గ్లాసుడు నీళ్లలో ఎండు ద్రాక్షలు వేసి, నానపెట్టి, ఆ నీటిని తీసుకుంటే వేడి చేయకుండా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు చాలా మంచిది.



- గోధుమలు, బియ్యం, పెసలు, రాగులు, సోయాగింజ లు, జొన్నలు అరకిలో వంతున కలిపి, 50 గ్రాముల నువ్వులు, 20 గ్రాముల జీలకర్ర జోడించి, దోరగా విడివిడిగా వేయించాలి. ఆపై మరపట్టించి రొట్టెలు చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పిండితో జావ కూడా చేసుకోవచ్చు.



- నెలసరి నొప్పితో బాధపడేవారు పుదీనా ఆకులను నీళ్లలో వేసి మరిగించి, వడకట్టి, ఆ నీటిని సేవించడం వల్ల మంచి ఫలితం వుంటుంది. పుదీనా ఆకులు, ఉప్పు కలిపి నీటిలో మరిగించి, ఆ ఆవిరి పడితే గొంతు మృదువుగా మారుతుంది.

సడెన్‌గా చెమటలా..?

చెమటలు పట్టడం అనేది చాలా సాధారణ విషయం.. ఎందుకంటే శరీర శ్రమ అతిగా చేయడం వల్ల అందరిలో చెమట పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో మరింత సహజం. అయితే కొందరిలో చెమట విచ్చలవిడిగా పడుతూ ఉంటుంది. దీంతోపాటు కొందరిలో అకస్మాత్తుగా చెమటలు పోస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు చాలామంది దీనిని సాధారణ సమస్యగా భావించి తేలిగ్గా తీసుకుంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలని కొని తెచ్చుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా మీకు జరుగుతుంటే మాత్రం మీ ఒంటి మీద మీరు కాస్తంత శ్రద్ధ తీసుకోవాల్సిందే మరి!



అకస్మాత్తుగా చెమటలు పట్టడం అనేకరకాల అనారోగ్య సమస్యలకు ముందస్తు సూచనలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని గుండెజబ్బుల లక్షణాలలో ఒకటిగా వైద్యులు భావిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ముందు తరచు ఆకస్మాత్తుగా చెమటలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. మీలో ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం, వారి సలహా మేరకు హెల్త్‌చెకప్ చేయించుకోవడం మంచిదని అనుభవజ్ఞుల సలహా.

అధిక చెమట ఈ వ్యాధుల లక్షణాలలో ఒకటి...

అకస్మాత్తుగా చెమటలు పట్టడం గుండెపోటు మొదటి లక్షణమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. మహిళలకు రాత్రిపూట ఎక్కువగా చెమట పడడం వల్ల భవిష్యత్‌లో రానున్న తీవ్రసమస్యలకు సంకేతాలు. తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కూడా ఎక్కువగా చెమట పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో మధుమేహం పెరగడం కారణంగా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి.

- అకస్మాత్తుగా వచ్చే చెమటలు రాకుండా ఉండాలంటే... ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం
- మద్యపానం అలవాటుంటే వెంటనే మానేయడం
- ఆకు కూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం
- గ్రీన్ టీ తీసుకోవడం
- రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం
- డీప్ ఫ్రైలు, ఇతర నూనె పదార్థాలను తగ్గించడం
- ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయడం
- పద్ధతి ప్రకారం డైట్ తీసుకోవడం అవసరం.

సినిమా

మీ ఆనందమే నాకు సంతృప్తి



- విజయ్ దేవరకొండ

‘‘నేను చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్ అంతా విహార యాత్రకు వెళ్తే నేను ఇంట్లో డబ్బులు అడిగి ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక అలాగే ఉండిపోయేవాడిని. ఆ విహార యాత్రలో నా స్నేహితులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ ఉండేవాడిని. తమ్ముడి (ఆనంద్ దేవరకొండ) ఇంజినీరింగ్ ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవరైనా కొంత సహాయం చేస్తే బాగుండును అనిపించేది. కానీ ఎవర్నీ అడగడానికి ఇష్టం ఉండేది కాదు. అవన్నీ దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. ఇవాళ మీకు (అభిమానులు) హెల్ప్ చేయగలుగుతున్నాను అంటే అది నా వ్యక్తిగత ఆకాంక్ష. నేను అందించే ఈ లక్ష రూపాయలతో మీకు ఒత్తిడి తగ్గి ఆనందం కలిగితే అది నాకు సంతృప్తిగా ఉంటుంది’’ అన్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం ‘ఖుషి’. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 1న విడుదలైంది. ‘ఖుషి’ సినిమా హ్యాపీనెస్‌ను షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు రూ. లక్ష చొప్పున చెక్స్ అందించారు విజయ్ దేవరకొండ. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ‘‘ఈ ప్రోగ్రామ్‌ను అనౌన్స్ చేసినప్పటి నుంచి మాకు ఇప్పటివరకూ 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఏడాది వంద మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది కొంతమందికి సహాయం చేస్తూనే ఉంటాను. నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకూ, సినిమాలు చేస్తున్నంతవరకూ నేను సహాయం చేస్తూనే ఉంటాను. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్’’ అన్నారు. ‘‘కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, సౌత్ స్టేట్స్ నుంచి సెలెక్ట్ చేశారు. సౌత్‌లో అన్ని ప్లేసెస్ నుంచి మా సినిమాకు మంచి స్పందన లభించింది’’ అన్నారు శివ నిర్వాణ. ‘‘వంద మందికి సహాయం చేయాలనే ప్రయత్నం మా మూవీతో విజయ్ మొదలుపెట్టినందుకు సంతోషంగా ఉంది’’ అన్నారు నవీన్, రవిశంకర్.

కోలీవుడ్ కబురు?

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందట. తమిళ నటుడు అథర్వ హీరోగా ఆకాష్ అనే కొత్త దర్శకుడు ఓ తమిళ చిత్రాన్ని తెరకెక్కించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఖుషీ కపూర్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఖుషీకి ఈ కథ నచ్చిందని, ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నది కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ఒకవేళ ఇదే నిజమైతే.. ఖుషీ కపూర్ నటించే తొలి తమిళ సినిమా ఇదే అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. ‘పయ్యా (‘ఆవారా’)’ సినిమాకు సీక్వెల్‌గా ‘పయ్యా 2’ రానుందని, ఇందులో ఆర్య హీరోగా నటిస్తారని, ఖుషీ కపూర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. అయితే ‘పయ్యా 2’ సీక్వెల్‌లో ఖుషీ కపూర్ నటిస్తుందనే వార్తల్లో వాస్తవం లేదని ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక హిందీలో ‘ఆర్చీస్’ అనే వెబ్ ఫిల్మ్‌లో ఖుషీ కపూర్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ నుంచి స్ట్రీమింగ్ కానుందని సమాచారం.



- ఖుషీ కపూర్

సప్త సాగరాలు

రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం ‘సప్త సాగర దాచే ఎల్లో’. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి ‘సప్త సాగరాలు దాటి’ అనే పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనున్నారు. ‘‘క్లాసిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది’’ అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



- రక్షిత్, రుక్మిణి



- మృణాల్ ఠాకూర్

ప్రేమకథ విన్నారా?

కెరీర్‌లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్నారు మృణాళ్ ఠాకూర్. నార్త్ అండ్ సౌత్ అనే తేడాలను పక్కన పెడితే ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన ఐదు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయంటే ఆమె ఏ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారో ఊహించవచ్చు. ఇదే స్పీడ్‌ను కొనసాగించాలనుకుంటూ బాలీవుడ్ కొత్త సినిమాకు సై అన్నారట మృణాళ్. శ్రీదేవి టైటిల్ రోల్ చేసిన హిందీ హిట్ ఫిల్మ్ ‘మామ్’ తీసిన దర్శకుడు రవి ఉదయార్ ఇటీవల ఓ లవ్‌స్టోరీ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారట. ఆయన ఈ కథను మృణాళ్‌కు వినిపించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని బీ టౌన్ టాక్.

ఆ రోజు కీడా కోలా



- బ్రహ్మానందం

‘పెళ్లిచూపులు’, ‘ఈ నగరానికి ఏమైంది?’ చిత్రాల ఫేమ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ నటించి, తెరకెక్కించిన తాజా చిత్రం ‘కీడా కోలా’. క్రైమ్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్ లీడ్ రోల్స్ చేశారు. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమా నటుడు– నిర్మాత రానా సమర్పణలో నవంబరు 3న విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

భయం.. అత్యాశ.. కుట్ర



- వంశీ, ఆనంద్ దేవరకొండ, ఉదయ్, అనురాగ్

ఆనంద్ దేవరకొండ హీరోగా ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించిన చిత్రం ‘గం..గం.. గణేశా’. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ‘‘భయం, అత్యాశ, కుట్ర అంశాల చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. ‘బేబీ’ తో ఆడియన్స్ ఎంత ఎమోషనల్ అయ్యారో, ‘గం..గం..గణేశా’ చిత్రంతో అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఉదయ్ కథ, విజన్‌ను నమ్మి ఈ సినిమా చేశాను’’ అన్నారు. ‘‘ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది’’ అన్నారు వంశీ కారుమంచి. ‘ప్రేక్షకులకు నచ్చే చిత్రం ఇది’’ అన్నారు ఈ చిత్ర సహనిర్మాత అనురాగ్ పర్వతనేని.

మిస్టర్ ఇడియట్ వస్తున్నాడు

హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘మిస్టర్ ఇడియట్’. సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా ‘మిస్టర్ ఇడియట్’లోని మాధవ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శక–నిర్మాత కె. రాఘవేంద్ర రావు విడుదల చేశారు. ‘‘మిస్టర్ ఇడియట్’ ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు గౌరీ రోణంకి. ‘‘నవంబరులో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం’’ అన్నారు నిర్మాత జేజేఆర్ రవిచంద్.



- మాధవ్, సిమ్రాన్ శర్మ

అందాలు చదివే కళ్లకైనా...



- పంఖురి, నవదీప్

నవదీప్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘లవ్ మౌళి’. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, మిర్చి హేమంత్ నటించారు. ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మాత. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్ల కదిలే గుండెకైనా..’ అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను అనిల్ కృష్ణన్ పాడారు. ‘‘లవ్ మౌళి’ షూటింగ్ మొత్తం మేఘాలయలోని చిరపుంజీలో చిత్రీకరించాం’’ అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
శనివారం
16-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	320	67,839
నిఫ్టీ ▲	89	20,192

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,700	▽	224
డోజోన్స్	34,606	▽	301
ఎఫ్‌టీఎస్ఈ 100	7,711	▲	38
డాక్స్	15,894	▲	88
షాంఘై	3,118	▽	9
నికాయ్	33,533	▲	365

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	59,016
బంగారం (22 క్యారట్)	58,780
వెండి (కేజీ)	71,853

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.29	83.96
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	101.57	104.93
€	యూరో	ఒకటి	86.97	90.07
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.66	57.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.10	54.96
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.06	62.00
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.75	23.54
¥	చైనా యువాన్	పదింటికి	10.31	12.38

వైభవ్ జ్యువెలర్స్ @ రూ. 204-215

ఈ నెల 22-26 మధ్య ఐపీవో

సాక్షి, విశాఖపట్టణం: బంగారు ఆభరణ విక్రయ కంపెనీ వైభవ్ జ్యువెలర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 204-215 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 22న ప్రారంభమై 26న ముగియనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 210 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 28 లక్షల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి రూ. 270 కోట్లను సమకూర్చుకోవాలని ఆశిస్తోంది. 8 కొత్త స్టోర్ల ఏర్పాటు, వీటి ఇన్వెంటరీతోపాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఈక్విటీ జారీ నిధులను వినియోగించనుంది. దక్షిణాది ప్రాంత


వైభవ్ జ్యువెలర్స్ ప్రతినిధులు

కంపెనీ ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 13 షోరూములను నిర్వహిస్తోంది. మార్చితో ముగిసిన గతేడాది ఆదాయం రూ. 2,027 కోట్లను అధిగమించగా.. ఈ ఏడాది(2023-24) ఏప్రిల్-జూన్‌లో రూ. 509 కోట్ల ఆదాయం, రూ. 19 కోట్లకుపైగా నికర లాభం సాధించింది.

మెర్సిడెస్ కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

ధర రూ.1.39 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ ఈక్యూఈ 500 4మేటిక్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని భారత్‌లో విడుదల చేసింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.1.39 కోట్లు. బ్యాటరీపై 10 ఏళ్లు లేదా 2,50,000 కిలోమీటర్ల వరకు వారంటీ ఉంది. 90.56 కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి చార్జింగ్‌తో 465-550 కిలో మీటర్లు ప్రయాణిస్తుంది. గంటకు గరిష్ట వేగం 210 కిలో మీటర్లు. పొడవు 4,863 మిల్లీమీటర్లు ఉంది. సీమ్‌లెస్ గ్లాస్ కవర్‌తో 12.3 అంగుళాల డ్రైవర్ డిస్‌ప్లే, 17.7 అంగుళాల ఓలెడ్ సెంట్రల్ డిస్‌ప్లే, 12.3 అంగుళాల ఓలెడ్ ఫ్రంట్ ప్యాసింజర్ డిస్‌ప్లే ఏర్పాటు



చేశారు. థర్మోట్రానిక్ ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, యాక్టివ్ స్టీరింగ్ అసిస్ట్, యాక్టివ్ లేన్ కీపింగ్ అసిస్ట్, ట్రాన్స్‌పరెంట్ బానెట్, 360 డిగ్రీల కెమెరా వంటి హంగులు ఉన్నాయి. కాగా, మెర్సిడెస్‌కు చెందిన చార్జింగ్ కేంద్రాల్లో ఇతర బ్రాండ్ల కార్లకు సైతం చార్జింగ్ సదుపాయం కల్పిస్తారు.

ఏడోనెలా ఎగుమతులు రివర్స్

- ఆగస్టులో 6.86 శాతం డౌన్
- విలువలో 34.48 బిలియన్ డాలర్లు
- దిగుమతులు తొమ్మిదో నెలా క్షీణ బాట
- విలువలో 58.64 బిలియన్ డాలర్లు
- వాణిజ్యలోటు 24.16 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, మందగమన పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఎగుమతి-దిగుమతి గణాంకాలు వెలువడుతున్నాయి. భారత్ వస్తు ఎగుమతులు వరుసగా ఏడవనెల వృద్ధిలేకపోగా క్షీణబాటనే నడిచాయి. దిగుమతుల విషయంలో ఈ క్షీణత తొమ్మిది నెలల నుంచి నమోదవుతోంది. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- ఆగస్టులో ఎగుమతులు 2022 ఇదే నెలతో పోల్చితే 6.86 శాతం తగ్గి 34.48 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ఇదే నెల్లో దిగుమతులు 5.23 శాతం క్షీణించి 58.64 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- ఎగుమతులు-దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం- వాణిజ్యలోటు 24.16 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. జూలైలో ఈ విలువ 20.67 బిలియన్‌లు కావడం గమనార్హం.
- ఎగుమతుల రంగంలో తేయాకు, కాఫీ, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, తోలు, రత్నాలు-ఆభరణాలు, జౌళి, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు పడిపోయాయి. అయితే ముడి ఇనుము, ఎలక్ట్రానిక్ గూడ్స్, ఆయిల్ సీడ్స్, జీడిపప్పు, తివాచీ, ఇంజనీరింగ్, ఫార్మా, సముద్ర ఉత్పత్తులుసహా మొత్తం 30 కీలక రంగాల్లో 15 సానుకూల వృద్ధి రేటును నమోదుచేసుకున్నాయి.

ఆర్థిక సంవత్సరం ఐదు నెలల్లో...

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ ఐదు నెలల్లో ఎగుమతులు 11.9 శాతం క్షీణించి 172.95 బిలియన్ డాలర్లుగా నమోదుకాగా, దిగుమతుల విలువ 12 శాతం క్షీణించి 271.83 బిలియన్ డాలర్లుగా ఉంది. వెరసి వాణిజ్య లోటు 98.88 బిలియన్ డాలర్లు.



పసిడి దిగుమతులు రయ్...

పసిడి దిగుమతులు ఆగస్టులో 38.75% పెరిగి 4.93 బిలియన్ డాలర్లుగా నమోదవగా, ఆగస్టు-ఏప్రిల్ మధ్య 10.48% పెరుగుదలతో 18.13 బిలియన్ డాలర్లుగా పసిడి దిగుమతుల విలువ ఉంది.

రష్యా నుంచి దిగుమతులు రెట్టింపు

రష్యా నుంచి భారత్ దిగుమతులు ఏప్రిల్-ఆగస్టు మధ్య రెట్టింపయ్యాయి. క్రూడ్ ఆయిల్, ఎరువుల దిగుమతులు పెరగడం దీనికి ప్రధాన కారణమని వాణిజ్య మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడించాయి. 2022 ఏప్రిల్-ఆగస్టు మధ్య రష్యా నుంచి దిగుమతుల విలువ 13.77 బిలియన్ డాలర్లుకాగా, తాజా సమీక్షా కాలంలో ఈ విలువ 25.69 బిలియన్ డాలర్లకు ఎగసింది. చైనా, అమెరికాల తర్వాత రష్యా చమురు కొనుగోలులో భారత్‌ది మూడవ స్థానం. ఇక చైనా నుంచి దిగుమతులు ఈ ఐదు నెలల కాలంలో 43.96 బిలియన్ డాలర్ల నుంచి 42 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

జోస్ ఆలుక్కాస్ 'పరంపర' కలెక్షన్ ఆవిష్కరణ

చెన్నై: జోస్ ఆలుక్కాస్.., భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలతో స్ఫూర్తి పొందిన ఆభరణాల శ్రేణి 'పరంపర' కలెక్షన్‌ను విడుదల చేసింది. చెన్నైలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో దక్షిణాది నటి కీర్తి సురేష్ 'పరంపర'ను ఆవిష్కరించారు. ఎండీ వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కాల సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. ఈ సిరీస్‌లో కృష్ణుడు, గణేశుడు తదితదిర దేవతామూర్తుల ప్రతిరూపాలతో సహా నెమళ్ళు, ఏనుగులు, హంసల లావణ్యం, ప్రతీకాత్మకల నుంచి ప్రేరణ పొందిన వజ్రాభరణాలు ఉన్నాయి. తక్కువ ఖర్చుతో కూడిన శ్రామిక శక్తిని వినియోగించడం ద్వారా అత్యంత తక్కువ ధరలకు వీటిని కస్టమర్లకు అందించగలుగుతామని కంపెనీ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
16-9-2023	
విశాఖ	510-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
15-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	480-00
వరంగల్	482-00
రిటైల్ ధర	4.85

బుల్ రికార్డుల పరుగు..

సరికొత్త శిఖరాలపై సూచీలు

- ఇంట్రాడే, ముగింపులోనూ తాజా గరిష్టాలు నమోదు
- 16 ఏళ్ల తర్వాత వరుస లాభాలతో సుదీర్ఘ ర్యాలీ చేసిన సెన్సెక్స్
- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు, ఎఫ్ఐఐల తాజా కొనుగోళ్లు



సెన్సెక్స్ సూచీలో మైలురాళ్లు

- ఈ జూలై 18న తొలిసారి 67,000 స్థాయిని అందుకుంది. ఆ మరుసటి రోజు(జూలై 19న) తొలిసారి 67,000 స్థాయిపైన ముగిసింది.
- ఈ జూలై 13న తొలిసారి 66,000 స్థాయిని తాకింది. ఆ మరుసటి రోజు(జూలై 14) తొలిసారి 66,000 స్థాయిపైన ముగిసింది.
- ఆ జూలై 3న 65,000 స్థాయిని అధిరోహించడంతో పాటు ఈ కీలక స్థాయిపైన ముగిసింది.
- 2021 ఏడాది సెప్టెంబర్ 24న 60 వేల స్థాయిని ఛేదించడంతో పాటు అదే రోజున 60 వేల పాయింట్లపైన ముగిసింది.

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలు, విదేశీ ఇన్వెస్టర్ల తాజా కొనుగోళ్ల అండతో శుక్రవారం స్టాక్ సూచీలు ఇంట్రాడే, ముగింపులోనూ జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఐటీ, టెలికం షేర్లు రాణించి సూచీలకు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 320 పాయింట్లు పెరిగి 67,839 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 408 పాయింట్లు బలపడి 67,927 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 89 పాయింట్లు పెరిగి 20,192 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 119 పాయింట్లు ఎగసి 20,222 స్థాయిని తాకింది. ఇంట్రాడే, ముగింపులు ఇరు సూచీలకి జీవితకాల గరిష్ట స్థాయి కావడం విశేషం. ఎఫ్ఎంసీజీ, మెటల్, మీడియా, రియల్టీ షేర్లు స్వల్పంగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.164 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,939 కోట్ల షేర్లను కొన్నారు. ఇటీవల విడుదలైన అమెరికా, చైనా ఆర్థిక గణాంకాలు మెప్పించడం, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ కీలక వడ్డీరేట్లు గరిష్టానికి చేరుకోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 1,240 పాయింట్లు, నిఫ్టీ 372 పాయింట్లు పెరిగాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, ఆర్థిక సేవల సంస్థ క్రెడిట్ స్వీస్‌కి 1.5 మిలియన్ డాలర్ల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయడంతో స్పైస్‌జెట్ షేరు ట్రేడింగ్‌లో 4% ర్యాలీ చేసి రూ.40 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి అరశాతం స్వల్పలాభంతో రూ.38.54 వద్ద వద్ద ముగిసింది.
- సెన్సెక్స్ 11 ట్రేడింగ్ సెషన్‌లో 3,008 పాయింట్లు(4.63%) ర్యాలీ చేయడంతో బీఎస్ఈలో మొత్తం రూ.14 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.323 లక్షల కోట్లకు చేరింది.
- పండుగ సీజన్ డిమాండ్, అధిక సంఖ్యలో ఆర్డర్లు పెరగొచ్చనే ఆశావహ అంచనాలతో ఆటో, ఐటీ షేర్లకు డిమాండ్ లభించింది. బీఎస్ఈ ఆటో ఇండెక్సు 1.50%, ఐటీ ఇండెక్సు ఒకశాతం లాభపడింది.
- చివరి రోజు నాటికి ఆర్ఆర్ కేబుల్స్ ఐపీవోకు 18.69 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో కంపెనీ 1.33 కోట్ల ఈక్విటీలు జారీ చేయగా 24.88 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 52.26 రెట్లు, సంస్థాగతేర విభాగం 13.23 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 2.13 రెట్లు సబ్‌స్క్రైబయ్యాయి. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల ద్వారా ఈ మంగవారం రూ.586 కోట్లు సమీకరించింది.

నీల్సన్ సీఈవోగా భారతీయుడు

కార్తీక్ రావు నియామకం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ దిగ్గజాలకు సారథ్యం వహిస్తున్న భారతీయుల సంఖ్య మరింతగా పెరుగుతోంది. తాజాగా అంతర్జాతీయ మార్కెట్ రీసెర్చ్ సంస్థ నీల్సన్‌కు సీఈవోగా కార్తీక్ రావు నియమితులయ్యారు. ఆయన నియామకం తక్షణం అమల్లోకి వచ్చింది. 2018 నుంచి సీఈవోగా ఉన్న డేవిడ్ కెన్నీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పదోన్నతి పొందారు. కార్తీక్ రావు సుదీర్ఘకాలంగా నీల్సన్‌లోని వివిధ విభాగాల్లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తదితర హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. చెన్నైలనోని లయోలా యూనివర్సిటీలో డిగ్రీ (ఎకనామిక్స్) చదివిన కార్తీక్ రావు, అమెరికాలోని ఇలినాయిస్ స్టేట్ యూనివర్సిటీలో ఎంబీఏ పట్టా పొందారు.





అంతిమ్‌పైనే ఆశలు

పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత పొందడమే లక్ష్యంగా నేటి నుంచి బెల్‌గ్రేడ్‌లో మొదలుకానున్న ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు బరిలోకి దిగనున్నారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో మొత్తం 30 వెయిట్ కేటగిరీల్లో (పురుషుల ఫ్రీస్టయిల్ 10, గ్రీకో రోమన్ 10, మహిళల ఫ్రీస్టయిల్ 10) పోటీలు నిర్వహించనుండగా... ఇందులో 18 ఒలింపిక్ వెయిట్ కేటగిరీలు... 12 నాన్ ఒలింపిక్ కేటగిరీలు ఉన్నాయి. ఒలింపిక్ వెయిట్ కేటగిరీల్లో టాప్-5లో నిలిచిన రెజ్లర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. భారత్ నుంచి మహిళల ఫ్రీస్టయిల్ 50 కేజీల విభాగంలో జూనియర్ ప్రపంచ చాంపియన్ అంతిమ్ పంఘాల్‌పైనే ఆశలు ఉన్నాయి. అంతర్గత వివాదాల కారణంగా భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు తటస్థ క్రీడాకారులుగా పోటీపడుతున్నారు.

'హెచ్‌సీఏ' కమిటీపై ఉత్తర్వులు ఇవ్వవద్దు

తెలంగాణ హైకోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న జస్టిస్ (రిటైర్డ్) ఎల్.నాగేశ్వరరావు కమిటీకి సంబంధించి దిగువ కోర్టులు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధూలియాలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌సీఏ కమిటీ రద్దయిన నేపథ్యంలో అసోసియేషన్ కార్యకలాపాలను చక్కదిద్దేందుకు గత ఫిబ్రవరిలో ఎల్. నాగేశ్వరరావుతో ఏక సభ్య కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. అయితే హెచ్‌సీఏ ఎన్నికల అంశం వ్యవహారం సహా ఇతర అంశాల్లో పలువురు హెచ్‌సీఏ సభ్యులు పదే పదే వేర్వేరు కారణాలతో కోర్టును ఆశ్రయిస్తున్నారు. వీరి పిటిషన్‌ల తర్వాత హైకోర్టుతో పాటు జిల్లా కోర్టులు కూడా కొన్ని ఆదేశాలు జారీ చేశాయి. ఈ విషయం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. హెచ్‌సీఏ ప్రస్తుత స్థితికి సంబంధించి సుప్రీంకోర్టులోనే పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై తీర్పు ఇచ్చే అధికారం అత్యున్నత న్యాయస్థానానికి ఉందని సుప్రీం అభిప్రాయపడింది. అసలు అలాంటి పిటిషన్‌లను అనుమతించడమే తప్పని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. హైకోర్టు లేదా జిల్లా కోర్టులు ఎలాంటి ఆదేశాలు ఇచ్చిన చెల్లవని కూడా స్పష్టం చేసిన సుప్రీంకోర్టు... తదుపరి విచారణను అక్టోబర్ 31కి వాయిదా వేసింది.

మెక్‌గిల్‌పై డ్రగ్స్ సరఫరా ఆరోపణలు



సిడ్నీ: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ స్టువర్ట్ మెక్‌గిల్ డ్రగ్స్ సరఫరా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. 2021 ఏప్రిల్‌లో కొందరు వ్యక్తులు తనను కిడ్నాప్‌నకు ప్రయత్నించి కొట్టారంటూ మెక్‌గిల్ ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు దర్యాప్తు చేయగా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆరుగురు నిందితులను విచారించగా, డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిలో మెక్‌గిల్ కూడా ఒకడని... అందులో వచ్చిన విభేదాల వల్లే కిడ్నాప్ ఉదంతం జరిగిందని తెలిసింది. 52 ఏళ్ల ఈ లెగ్‌స్పిన్నర్ ఆస్ట్రేలియా తరఫున 44 టెస్టుల్లో 208 వికెట్లు పడగొట్టాడు.

భారత్‌కు బంగ్లా షాక్


- 6 పరుగులతో ఓడిన టీమిండియా
- గిల్ శతకం వృథా
- రేపు భారత్, శ్రీలంక ఫైనల్


శుభ్‌మన్ గిల్

కొలంబో: ఆసియా కప్‌లో అనూహ్య ఫలితం... 'సూపర్-4' దశలో రెండు ఘన విజయాలతో ముందే ఫైనల్ స్థానం ఖాయం చేసుకున్న భారత్‌కు చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చేతిలో ఓటమి ఎదురైంది. ప్రాధాన్యత లేని మ్యాచ్‌లో ముగ్గురు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి బరిలోకి దిగిన టీమిండియా చివరకు ఓటమి పక్షాన నిలిచింది. అయితే ఈ గెలుపు బంగ్లాదేశ్ ప్రదర్శనను తక్కువ చేసేది కాదు. ముందే ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించినా చివరి వరకు స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబర్చిన ఆ జట్టు చెప్పుకోదగ్గ విజయంతో స్వదేశానికి వెళ్లనుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 6 పరుగుల తేడాతో భారత్‌పై గెలిచింది. ఆసియా కప్‌లో గతంలో ఒకే ఒకసారి భారత్‌ను (2012)ఓడించిన బంగ్లాకు ఇది రెండో విజయం.

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసింది. కెప్టెన్ షకీబ్ అల్ హసన్ (85 బంతుల్లో 80; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), తౌహీద్ హృదయ్ (81 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), నసుమ్ అహ్మద్ (45 బంతుల్లో 44; 6 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. 49 పరుగులకే జట్టు 4 వికెట్లు కోల్పోగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబ్, తౌహీద్ ఐదో వికెట్‌కు 101 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. భారత బౌలర్లలో శార్దుల్ 3, షమీ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 49.5 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌటైంది. శుభ్‌మన్ గిల్ (133 బంతుల్లో 121; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెరీర్‌లో ఐదో సెంచరీతో చెలరేగాడు. ప్రతికూల పరిస్థితుల్లో స్పిన్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై అతను పట్టుదల కనబర్చి నిలబడ్డాడు. అయితే ఇతర బ్యాటర్ల వైఫల్యంతో జట్టుకు ఓటమి తప్పలేదు. చివర్లో అక్షర్ పటేల్ (34 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది. ముస్తఫిజుర్ 3 వికెట్లు తీయగా... అరంగేట్ర బౌలర్ తన్‌జీమ్, మెహదీ హసన్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా ఆదివారం జరిగే ఫైనల్లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. **ఈ మ్యాచ్‌తో హైదరాబాదీ ఎడంచేతి వాటం బ్యాటర్ తిలక్ వర్మ వన్డేల్లోకి అడుగు పెట్టాడు. భారత్ తరఫున వన్డేలు ఆడిన 252వ ఆటగాడిగా తిలక్ నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందే తిలక్ 7 టి20ల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.**




షకీబ్, ముస్తఫిజుర్

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తన్‌జీద్ (బి) శార్దుల్ 13; లిటన్ దాస్ (బి) షమీ 0; అనాముల్ (సి) రాహుల్ (బి) శార్దుల్ 4; షకీబ్ (బి) శార్దుల్ 80; మిరాజ్ (సి) రోహిత్ (బి) అక్షర్ 13; తౌహీద్ (సి) తిలక్ (బి) షమీ 54; షమీమ్ (ఎల్బీ) (బి) జడేజా 1; నసుమ్ (బి) ప్రసిధ్ 44; మెహదీ హసన్ (నాటౌట్) 29; తన్‌జీమ్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 265. వికెట్ల పతనం:** 1-13, 2-15, 3-28, 4-59, 5-160, 6-161, 7-193, 8-238. **బౌలింగ్:** షమీ 8-1-32-2, శార్దుల్ 10-0-65-3, ప్రసిధ్ 9-0-43-1, అక్షర్ పటేల్ 9-0-47-1, తిలక్ 4-0-21-0, జడేజా 10-1-53-1.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అనాముల్ (బి) తన్‌జీమ్ 0; గిల్ (సి) తౌహీద్ (బి) మెహదీ 121; తిలక్ (బి) తన్‌జీమ్ 5; కేఎల్ రాహుల్ (సి) షమీమ్ (బి) మెహదీ 19; ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) మిరాజ్ 5; సూర్యకుమార్ (బి) షకీబ్ 26; జడేజా (బి) ముస్తఫిజుర్ 7; అక్షర్ (సి) తన్‌జీద్ (బి) ముస్తఫిజుర్ 42; శార్దుల్ (సి) మిరాజ్ (బి) ముస్తఫిజుర్ 11; షమీ (రనౌట్) 6; ప్రసిధ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్) 259. వికెట్ల పతనం:** 1-2, 2-17, 3-74, 4-94, 5-139, 6-170, 7-209, 8-249, 9-254, 10-259. **బౌలింగ్:** తన్‌జీమ్ 7.5-1-32-2, ముస్తఫిజుర్ 8-0-50-3, నసుమ్ 10-0-50-0, షకీబ్ 10-2-43-1, మెహదీ హసన్ 9-1-50-2, మిరాజ్ 5-0-29-1.

బోపన్న చివరిపోరు...

నేటి నుంచి భారత్, మొరాకో డేవిస్ కప్ మ్యాచ్

లక్నో: ప్రపంచ పురుషుల టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ డేవిస్ కప్‌లో తన ప్రస్థానాన్ని ముగించడానికి భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న సిద్ధమయ్యాడు. మొరాకోతో నేడు మొదలయ్యే వరల్డ్ గ్రూప్-2 డేవిస్ కప్ మ్యాచ్‌లో భారత జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. 2002లో తొలిసారి డేవిస్ కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 43 ఏళ్ల బోపన్న 32 మ్యాచ్‌లు ఆడి 22 మ్యాచ్‌ల్లో విజయం అందుకున్నాడు. తొలి రోజు శనివారం రెండు సింగిల్స్ జరుగుతాయి. యాసిన్ దిల్మీతో శశి కుమార్ ముకుంద్, ఆడమ్ మౌన్‌డిర్‌తో సుమిత్ నగాల్ ఆడతారు. ఆదివారం ఒక డబుల్స్‌తోపాటు రెండు రివర్స్ సింగిల్స్‌ను నిర్వహిస్తారు. డబుల్స్ మ్యాచ్‌లో రోహన్ బోపన్న-యూకీ బాంబ్రీ జోడీ ఇలియట్ బెన్‌చిట్రి-యూనస్ లారూసి జంటతో ఆడుతుంది. రివర్స్ సింగిల్స్‌లో యాసిన్ దిల్మీతో సుమిత్ నగాల్, ఆడమ్ మౌన్‌డిర్‌తో శశికుమార్ ముకుంద్ తలపడతారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ మ్యాచ్‌కు సంబంధించి 'డ్రా' వివరాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా డేవిస్‌కప్ కెరీర్‌ను ముగిస్తున్న రోహన్ బోపన్నను సన్మానించారు.




క్లాసెన్ విధ్వంసం

83 బంతుల్లో 13 ఫోర్లు, 13 సిక్స్‌లతో 174

సెంచూరియన్: ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ తన విశ్వరూపం ప్రదర్శించాడు. 83 బంతుల్లో 13 ఫోర్లు, 13 సిక్స్‌లు బాది 174 పరుగులు సాధించాడు. 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న క్లాసెన్ 57 బంతుల్లో సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత 26 బంతుల్లో మరో 74 పరుగులు సాధించాడు. మిల్లర్ (45 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), డసెన్ (62; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా అదరగొట్టారు. దాంతో తొలుత దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 416 పరుగులు సాధించింది. ఈ క్రమంలో వన్డేల్లో అత్యధికంగా ఏడుసార్లు 400 అంతకంటే ఎక్కువ పరుగులు సాధించిన జట్టుగా దక్షిణాఫ్రికా రికార్డు నెలకొల్పింది. భారత్ ఆరుసార్లు ఈ ఘనత సాధించింది. మరోవైపు ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా 10 ఓవర్లలో 113 పరుగులిచ్చాడు. వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా మిక్ లూయిస్ (10 ఓవర్లలో 113; ఆస్ట్రేలియా; 2006లో దక్షిణాఫ్రికాపై) పేరిట ఉన్న చెత్త రికార్డును జంపా సమం చేశాడు. 417 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 34.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. అలెక్స్ క్యారీ (77 బంతుల్లో 99; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ కోల్పోయాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లు 2-2తో సమంగా ఉన్నాయి. చివరిదైన ఐదో వన్డే ఆదివారం జరుగుతుంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


Reliance Growth is Life
GRAND LAUNCH
• RC PURAM, BESIDE D-MART
• SANGAREDDY: OPP. ITI GOVT. COLLEGE
Reliance digital
PERSONALISING TECHNOLOGY
మీరు వినాయకుడిని
తెచ్చుకోండి మీ ఇంటికి,
టెక్ డెలివరీ అవుతుంది
సమయానికి.
#MakeFriendsWithTechnology
వినాయక చవితి స్పెషల్ ఆఫర్లు 16 నుండి 19 సెప్టెంబరు
10% వరకు ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
AU SMALL FINANCE BANK
Bank of Baroda Credit Card
HDFC BANK
ICICI Bank
IDFC FIRST Bank CREDIT CARDS
onecard
CREDIT CARD | EMI
₹ 5000 వరకు
ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
ON ALL CREDIT & DEBIT CARDS
(On purchase of ₹60000 & above)
*ఇవాళ కొనండి ఇక పొందండి
డెలివరీ మరియు ఇన్‌స్టలేషన్‌ని
వినాయక చవితినాడు
18 సెప్టెంబరు
*ఆఫర్ కేవలం మొదటి 100 కస్టమర్లకు మాత్రమే వర్తిస్తుంది
SIDE BY SIDE REFRIGERATORS
Starting from
₹51990*
EMIs of ₹4333/-
7 Kg. TOP LOAD WASHING MACHINE
Starting from
₹13990*
EMIs of ₹1166/-
4K UHD
140 CM (55) UHD TVs
Starting from
₹29990
BPL | LG | SAMSUNG | SANSUI
SONY | RECONNECT
Hisense VIDAA TV
109 CM (43)
HISENSE ANDROID TV 43A4G
₹34990
₹19990
TCL Google TV P635
146 CM (58) 165 CM (65) 189 CM (75)
₹89990 ₹124990 ₹254990
₹35490* ₹46990* ₹74990*
*Price after Cashback
LG NanoCell ULTRA BRIGHT PANEL
139CM (55) 55NANO83
165CM (65) 65NANO83
₹99990 ₹159990
₹59990* ₹89990*
UP TO 10% CASHBACK MAX UP TO ₹7500/-* ON LEADING BANK
SAMSUNG Neo QLED
Starting from
₹99990*
*Price after Cashback
BENEFITS GET 40% OFF ON SELECT SAMSUNG SOUNDBAR
NEW LAUNCH
VIVO V29E
• 50MP Front Camera
• 7.57 mm Slim body
₹31999
Starting at
₹26999*
Cashback upto 2500 in SBI CC
iPhone
DEAL PRICE
13 128GB
₹69900
Starting from
₹56900
14 128GB
₹79900
Starting from
₹65900
NEW LAUNCH
SAMSUNG
GALAXY FOLD 5/ FLIP 5
• Snapdragon 8 Gen 2
• Dynamic AMOLED Display
₹99999
Starting from
₹85999*
*price post upgrade and cashback
BENEFITS GET ₹5000 LOYALTY BONUS EXTRA ON CARD TRANSACTION
DEAL MODEL
SAMSUNG GALAXY S23 ULTRA
₹124999
₹106999*
*Price post cashback & upgrade bonus
BENEFITS GET ₹5000 LOYALTY BONUS EXTRA ON CARD TRANSACTION
MULTITASKING
AMD R5 Starting at ₹43990*
Intel Core i5 Starting at ₹46990*
GAMING
GTX 1650 Starting at ₹44990*
RTX 3050 Starting at ₹55990*
PRICE POST PROMO, CASHBACK, EXCHANGE BENEFIT & STUDENT DISCOUNT AS PER APPLICABLE
AIRPODS PRO
1ST GEN
₹26300
₹15990*
WATCH S8 41MM GPS
₹45900
₹39009*
SOUNDBAR
Starting from
₹4999*
LG 3.1.2 CHANEL SOUNDBAR SP8A
₹59990
₹24990*
PARTY SPEAKERS
30% OFF*
*ON SELECT MODELS
FREE** TWS WORTH ₹4490 + MIC
8 Kg. TOP LOAD WASHING MACHINE
₹18490*
8 Kg. FRONT LOAD WASHING MACHINE
₹35490*
FROST FREE REFRIGERATORS
256 L
₹25990*
363 L
₹36990*
SIDE BY SIDE REFRIGERATORS
HAIER 630 L
₹59990*
EMIs of ₹4999/-
LG 655 L
₹74990*
EMIs of ₹6583/-
SAMSUNG 653 L
₹100990*
EMIs of ₹8416/-
FREE** 10 KG TOP LOAD WASHING MACHINES WORTH ₹32500 (ON SELECT SAMSUNG SBS*)
BREAKFAST COMBO
KELVINATOR SANDWICH MAKER
PRESTIGE 1.5L KETTLE
BUTTERFLY HOT N COLD BOTTLE
₹5043
₹2099*
CONVECTION MICROWAVES
SAMSUNG 28L CONVECTION ₹16600*
LG 28L CONVECTION ₹19900*
LG 28L WI-FI ENABLED ₹22900*
SAMSUNG | LG | KELVINATOR | BPL | IFB | HAIER
*Prices are after bank cashback
అద్భుతమైన డీల్స్ మరియు క్యాష్‌బ్యాక్ ఆఫర్స్ | గ్యారంటీడ్ ఉత్తమ ధర |
సాటిలేని ఎలక్ట్రానిక్స్ శ్రేణి | సజావుగా ఇన్‌స్టలేషన్ మరియు డెలివరీ
Reliance resQ
1800 889 1044
150+ టీవీలు | 100+ ల్యాప్‌టాప్స్ | 200+ స్మార్ట్‌ఫోన్స్ |
100+ ఏసీలు | 100+ వాషింగ్ మెషీన్లు | 80+ రిఫ్రిజిరేటర్లు - మరెన్నో
ALSO SHOP ON:
reliancedigital.in
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE